www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పేజీలు: 14

సంపుటి (Volume) : 23

సంచిక (Issue) : 55

శనివారం | 24-5-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి రా.7.21 తదుపరి త్రయోదశి; నక్షత్రం: రేవతి మ.1.48 తదుపరి అశ్విని; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.5.44-7.27; అమృతఘడియలు: ఉ.11.37-1.04, తె.4.46-6.12; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.39

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శంషాబాద్ విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న కవిత

దేవుడి చుట్టూ దయ్యాలు!

పార్టీలో నాపై అంతర్గత కుట్రలు, కుతంత్రాలు.. కుట్రలు చేసే ఆ దయ్యాలే నా లేఖను లీక్ చేశాయి



- కేసీఆర్ దేవుడు.. ఆయనే మా నాయకుడు
- నాన్నకు లేఖ వెనుక వ్యక్తిగత ఎజెండా లేదు
- రాసింది నేనే.. తరచూ ఫీడ్‌బ్యాక్ ఇస్తుంటా
- పార్టీలో అన్ని స్థాయులవారూ అనుకుంటున్న విషయాలనే నేను ఆ లేఖలో ప్రస్తావించాను
- నా లేఖే బయటపడితే ఇతరుల పరిస్థితేంటి?
- లోపాలపై చర్చించాలి.. కోవర్టుల్ని తప్పించాలి
- అప్పుడే పార్టీ పదికాలాలపాటు చల్లగా ఉంటుంది
- అమెరికా నుంచి తిరిగొచ్చిన కవిత వ్యాఖ్యలు
- ఆమె చెప్పిన 'దయ్యాలెవరు?' అంటూ విస్తృత చర్చ

జాగృతే.. బీఆర్ఎస్ శ్రేణులు రాలే!

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కవితకు 'తెలంగాణ జాగృతి' ఘనస్వాగతం
- స్వాగత బ్యానర్లన్నీ నీలి రంగులోనే.. కనిపించని గులాబీ జెండాలు
- బ్యానర్లలో కనిపించని బీఆర్ఎస్ పేరు, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ఫొటోలు
- భారీగా తరలివచ్చిన అభిమానులు.. 'కవితక్క సీఎం' అంటూ నినాదాలు

13



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/శంషాబాద్ రూరల్)

"కేసీఆర్ దేవుడు.. కానీ, ఆయన చుట్టూ కొన్ని దయ్యాలు ఉన్నాయి. వాళ్ల వల్ల చాలా నష్టం జరుగుతోంది" అని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. కుట్రలు చేస్తున్న ఆ దయ్యాలే.. తన తండ్రికి తాను రాసిన లేఖను లీక్ చేశాయని.. పార్టీలో తనపై అంతర్గతంగా కుట్రలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. అమెరికా నుంచి శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్న ఆమె.. ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడారు. తాను తన కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకకు హాజరై తిరిగి వచ్చే సరికి.. లేఖ లీక్ అయ్యిందంటూ హంగామా జరుగుతోందని, ఆ లేఖ రెండు వారాల క్రితం కేసీఆర్‌కు తాను రాసిందేనని స్పష్టత ఇచ్చారు. గతంలో కూడా కేసీఆర్‌కు తన అభిప్రాయాలను ఇలా లేఖ ద్వారా చెప్పానని ఆమె పేర్కొన్నారు. వరంగల్ సభ తరువాత లేఖ ద్వారా తన అభిప్రాయాలను పార్టీ అధినేతకు వెల్లడించానని.. కేసీఆర్‌కు లేఖ రాయడంలో తనకు ఎలాంటి వ్యక్తిగత ఎజెండా లేదని ఆమె స్పష్టం చేశారు. పార్టీలో అన్ని స్థాయుల్లో ఉన్న వారూ అనుకునే విషయాలు, దాదాపు సగం తెలంగాణ ప్రజలు

మిగతా 13వ పేజీలో...

ముందుంది ముసలం?

- బీఆర్ఎస్‌లో కవిత కలకలం.. పార్టీలో లుకలుకలు బహిర్గతం..!
- కేసీఆర్ చుట్టూ దయ్యాలెవరు?.. కవిత లేఖ ఎక్కడికి దారి తీస్తుంది?
- ధిక్కారాన్ని కేసీఆర్ సహిస్తారా?.. కూతురే ప్రశ్నించడంపై ఆందోళన
- అసమ్మతి గళం వినిపించిన నేతలను బయటికి పంపించిన చరిత్ర
- కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెంచామన్న జోష్ ఆవిరి
- కవిత కొత్త పార్టీ పెడతారన్న ప్రచారం

13

నేడు కేసీఆర్ వద్దకు కవిత?.. లేఖ బహిర్గతంపై మాట్లాడే చాన్స్

లేఖ ఓ డ్రామా!

13

- అంతర్గత ప్లాన్ చేసుకున్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కేసీఆర్ జవాబు చెప్పాలి: పొన్నం
- కేసీఆర్ దేవుడైతే.. దయ్యం ఎవరు?

10

- కవితకు ఆది శ్రీనివాస్ ప్రశ్నలు
- బీఆర్ఎస్ మునిగే నావ.. దూకాలని చూస్తున్న కవిత: బీర్ల అయిలయ్య

ఎందుకు రాశారో..

- అర్థం కాలేదు..
- కవిత లేఖలో విషయం లేదు
- వారి మధ్య మాటల్లేవన్న సంగతి ఇప్పుడే తెలిసింది
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- లిక్కర్ క్వీన్ కవిత లేఖ ఓటీటీ డ్రామాలా ఉంది: బండి

13

తెలంగాణ జీవనశైలిలోనే సౌందర్యం!

- మహిళల భద్రత, సాధికారతకు ఆదర్శం
- అభివృద్ధి, ఆత్మీయత, ఆత్మగౌరవానికి రాష్ట్రం ప్రతీక
- హైదరాబాద్ సురక్షిత నగరం: మిస్ వరల్డ్ పోటీదారులు
- హెడ్ టు హెడ్ చాలెంజ్ ఫైనల్‌లో తెలంగాణపై జడ్జిలు అడిగిన ప్రశ్నలకు అద్భుత సమాధానాలు
- విజేతలుగా మిస్ వేల్స్, టర్కీ, ట్రినిడాడ్, జాంబియా



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సుందరి పోటీదారులు తెలంగాణపై ప్రశంసలు కురిపించారు. మన సంస్కృతీ సంప్రదాయాలను కొనియాడారు. 'బ్యూటీ విత్ పర్పస్' భావన ఇక్కడి ప్రజల జీవనశైలిలో కనిపించిందని తెలిపారు. హైదరాబాద్ నగర వీధుల్లో మహిళలు రాత్రి వేళల్లో సైతం భయపడకుండా స్వేచ్ఛగా తిరగగలగడం ఆశ్చర్యాన్ని కలిగించిందని చెప్పారు. ఇది ఒక సురక్షిత నగరానికి ప్రతీకగా అభివర్ణించారు. రాష్ట్ర అభివృద్ధి, మహిళల సాధికారత, భద్రతకు సంబంధించి అందాల భామలు చేసిన వ్యాఖ్యలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న

మిగతా 14వ పేజీలో...





జహీరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, హాజరైన ప్రజలు

మోదీని ఎన్నిసార్లయినా కలుస్తా

- రాష్ట్రాభివృద్ధికి సహకారం తప్పక తీసుకుంటా
- ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు
- ప్రతిపక్ష పదవి ఫామ్‌హౌస్‌లో పడుకోవడానికి కాదు
- అసెంబ్లీకి హాజరై తప్పొప్పులు చెబితే దిద్దుకుంటాం
- మహిళలకు ఈ ఏడాది 21 వేల కోట్ల రుణాలు
- అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేయాలి
- 5612 నిమ్జ్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు
- పట్టాలిప్పించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పగిస్తున్నా
- 450 ఎకరాల్లో హ్యుందాయ్ కార్ల కంపెనీ
- జహీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

సంగారెడ్డి, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడతానని, ఆ తర్వాత అందరినీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తన పని అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటానని చెప్పారు. నిధుల కోసం ప్రధాని నరేంద్రమోదీని ఎన్నిసార్లయినా కలుస్తానని, రావాల్సిన నిధులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే ఏమవుతుందో తెలుసునని, గత ముఖ్యమంత్రి చెరువు మీద అలిగి ఫామ్‌హౌస్‌లో పడుకుంటే ఏమైందో అందరూ చూశారని వ్యాఖ్యానించారు. అందుకే సోనియా, రాహుల్, ఖర్గే సూచనలు పాటిస్తూ రాష్ట్ర ఆదాయాన్ని పెంచేలా ప్రయత్నిస్తున్నానన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి, కేంద్రీయ విద్యాలయం, నిమ్జ్ ఫోర్ లేన్

మిగతా 12వ పేజీలో...

నేషనల్ హెరాల్డ్ విరాళాలపై మళ్లీ కలకలం

- పదవుల ఆశ చూపి వసూలు చేశారు
- ఇది క్విడ్ ప్రో కో కిందే వస్తుంది
- రేవంత్, అహ్మద్ పటేల్, పవన్ బన్సల్ కోరితేనే కాంగ్రెస్ నేతలు డబ్బులిచ్చారు
- ఢిల్లీ కోర్టులో ఈడీ అభియోగపత్రం

2

నేడు నీతి ఆయోగ్ భేటీ.. 'తెలంగాణ విజన్'ను ఆవిష్కరించనున్న సీఎం రేవంత్



రూ. 2.69 లక్షల కోట్ల డివిడెండ్

11

- ప్రభుత్వానికి ఆర్‌బీఐ భారీ నజరానా
- రికార్డు స్థాయిలో చెల్లింపులు
- 2024-25లో 27.4% పెరిగిన డివిడెండ్
- కలిసొచ్చిన ఫారెక్స్ లావాదేవీలు

బెట్టింగ్... వికృత క్రీడ

2

- ఐపీఎల్ ముసుగులో బెట్టింగ్, జూదం
- ప్రజలు పాల్గొనడాన్ని చట్టాలతో ఆపలేం
- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- యాప్‌లను నిషేధించాలంటూ కేఏ పాల్ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ
- స్వయంగా వాదనలు వినిపించిన పాల్
- కేంద్ర ప్రభుత్వానికి ధర్మాసనం నోటీసులు

భవనాలకు అనుమతి కోసం 8 లక్షలు డిమాండ్

- ఏసీబీకి చిక్కిన సికింద్రాబాద్ జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ విఠల్
- 4 లక్షలే ఇచ్చి మిగతా సొమ్ము ఇవ్వలేదని దరఖాస్తు తిరస్కరణ
- బాధితుడి ఫిర్యాదుతో దాడి చేసి అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు
- లంచం తీసుకుంటూ పట్టుబడిన కామారెడ్డి జిల్లా కోర్టు ఏపీపీ, కానిస్టేబుల్.. పెద్దశంకరంపేట ఇన్‌చార్జి ఎంపీడీవో..



టౌన్ ప్లానింగ్ ఏసీపీ విఠల్

సికింద్రాబాద్/కామారెడ్డిటౌన్/పెద్ద శంకరంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అవినీతికి పాల్పడుతూ నలుగురు అధికారులు, సిబ్బంది శుక్రవారం ఏసీబీకి చిక్కారు. ఆ నలుగురినీ ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ జోన్ పరిధిలో వెంకట్‌రావు అనే వ్యక్తి

మిగతా 3వ పేజీలో...



యాపిల్‌పై 25%.. ఈయూపై 50%

2

ఆగని ట్రంప్ సుంకాల రంకెలు

- అమెరికాలో అమ్మే ఐఫోన్లు అమెరికాలోనే తయారుచేయాలి
- భారత్‌లో కానీ.. మరెక్కడైనా కానీ తయారు చేయవద్దని హుకుం
- జూన్ 1 నుంచి ఈయూ ఉత్పత్తులపై 50% టారిఫ్ అని హెచ్చరిక

టెక్ ఉద్యోగాలకు కత్తెర

- దిగ్గజ సంస్థల్లో కొనసాగుతున్న కోత
- ఈ ఏడాది 61 వేల మంది తొలగింపు

2

హార్వర్డ్‌పై నిషేధం నిలిపివేత

- అమెరికా జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీ

కెనడా స్టడీ పర్మిట్లలో భారీ కోత

- భారతీయ విద్యార్థులకు గట్టి షాక్



డాక్టర్ రవికుమార్

నిలోఫర్ సూపరింటెండెంట్‌పై కొరడా

- అవినీతి, అక్రమాల ఆరోపణలు
- ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో దొంగతనం జరిగినా నిర్లక్ష్యం
- ప్రైవేటు మందుల షాపు నిర్మాణ వివాదం నేపథ్యంలో సస్పెన్షన్
- అవినీతి ఆరోపణలతో పేట్లబుర్జు సూపరింటెండెంట్, సూర్యాపేట డీఎంహెచ్‌వో కూడా తొలగింపు
- వైద్యారోగ్య శాఖలో ఒకేరోజు ముగ్గురు అధికారులపై చర్యలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలో ఒకే రోజు ముగ్గురు కీలక అధికారులపై వేటు పడింది. హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన స్థానంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ విజయ్‌కుమార్‌ను నియమించింది. పేట్లబుర్జు ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజనిరెడ్డిని తొలగించి.. డాక్టర్ జయకు ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది. అలాగే సూర్యాపేట

మిగతా 12వ పేజీలో...

తెలంగాణలో 3 కొత్త కేంద్ర సంస్థలు

- రూ.250 కోట్లతో అంతర్జాతీయ స్థాయి మిల్లెట్స్ పరిశోధన కేంద్రం
- కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం: కిషన్ రెడ్డి

3

10

కుల సర్వే జరిపించడం నాకు గర్వకారణం

- కేసీఆర్ నియంత.. రేవంత్ ప్రజాస్వామికవాది
- బీఆర్ఎస్ ముక్కలవడం ఖాయం: మహేశ్‌గౌడ్
- జన్మదినం సందర్భంగా ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ

కనిమొళి బృందానికి రష్యాలో తప్పిన ముప్పు

మాస్కో/చెన్నై, మే 23: పాకిస్థాన్ వ్యవహార శైలిని ప్రపంచ దేశాల దృష్టికి తీసుకెళ్లే ప్రణాళికలో భాగంగా రష్యాకు వెళ్లిన డీఎంకే ఎంపీ కనిమొళి సారథ్యంలోని ఎంపీల బృందానికి పెద్ద ముప్పు తప్పింది. వీరు ప్రయాణించిన విమానం గురువారం రష్యా రాజధాని మాస్కోలోని విమానాశ్రయంలో నిర్దేశిత సమయంలో దిగకుండా కొంత సమయంపాటు ఆకాశంలో చక్కర్లు కొట్టింది. రష్యాతో దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంలో భాగంగా ఉక్రెయిన్..గురువారం రాత్రి మాస్కోపై డ్రోన్ దాడులతో విరుచుకు పడడమే ఇందుకు కారణం. డజన్ల కొద్దీ ఉక్రెయిన్ డ్రోన్లు మాస్కోను లక్ష్యంగా చేసుకోవడంతో.. అధికారులు అక్కడి విమానాశ్రయాలను కొంత సమయంపాటు మూసివేశారు. దీంతో, 45 నిమిషాలు ఆలస్యంగా డొమొడెడోవో విమానాశ్రయంలో వీరి విమానం సురక్షితంగా లాండ్ అయినట్లు కనిమొళి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

భారత్‌తో రూ.180 కోట్ల రక్షణ ఒప్పందం రద్దు

» బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ నిర్ణయం

కోల్‌కతా, మే 23: భారత్‌తో దౌత్య సంబంధాలు నానాటికీ దిగజారుతున్న వేళ ఇరు దేశాల మధ్య దూరాన్ని పెంచే విధంగా బంగ్లాదేశ్ మరో నిర్ణయం తీసుకుంది. కోల్‌కతాకు చెందిన ప్రభుత్వ రంగ నౌకా నిర్మాణ సంస్థతో రూ.180.25 కోట్ల విలువైన భారీ ఒప్పందాన్ని బంగ్లాలోని తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసుకుంది. ఈ మేరకు భారత రక్షణ శాఖ పరిధిలో పనిచేసే గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎస్ఈ) తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీకి సమాచారం ఇచ్చింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్ ప్రభుత్వం తమకు ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేసుకున్నట్లు తెలిపింది. సముద్రంలో ఓడలను లాక్కెళ్లడానికి, మునిగిపోయిన పడవలను వెలికి తీసే ఆపరేషన్లలో వినియోగించే అధునాతన టగ్ బోట్ల నిర్మాణం కోసం జీఆర్ఎస్ఈతో బంగ్లా ఒప్పందం చేసుకుంది.

పాక్‌కు 20 బిలియన్ల ప్యాకేజీపై పునరాలోచన

» ప్రపంచ బ్యాంకుకు విజ్ఞప్తి చేయనున్న భారత్

న్యూఢిల్లీ, మే 23: పాకిస్థాన్ ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేందుకు భారత్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. దీనిలో భాగంగా ప్రపంచ బ్యాంక్‌తో పాటు ఎఫ్ఏటీఎఫ్‌ను కలవనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చే నెలలో పాక్‌కు 20 బిలియన్ డాలర్ల ప్యాకేజీకి ఆమోదం తెలిపే అంశంపై పునరాలోచన చేయాలని ప్రపంచ బ్యాంకుకు భారత్ విజ్ఞప్తి చేయనుందని పేర్కొన్నాయి. అదేవిధంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌ను తిరిగి గ్రే లిస్ట్‌లోకి చేర్చాలని ఎఫ్ఏటీఎఫ్‌పై ఒత్తిడి తీసుకొచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. దీనిద్వారా దాయాది దేశం ఆర్థిక లావాదేవీలపై పర్యవేక్షణ పెరుగుతుంది. అలాగే ఆ దేశానికి విదేశీ పెట్టుబడులతో పాటు ప్రపంచ ఆర్థిక సంస్థల నుంచి నిధుల విడుదలకు అడ్డుకట్ట వేయాలని భారత్ యోచిస్తోంది.

నీటిని ఆపేస్తే.. మీ పీక నొక్కేస్తాం: పాక్ అధికారి

న్యూఢిల్లీ, మే 23: సింధూ జలాల ఒప్పందం రద్దుపై పాకిస్థాన్ సైనిక ప్రతినిధి ఒకరు భారత్‌పై తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేశారు. పాక్‌లోని ఓ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధరి మాట్లాడుతూ, 'మా దేశానికి రావాల్సిన సింధూ జలాలను మీరు అడ్డుకుంటే.. మీ పీక నొక్కేస్తాం' అంటూ నోరు పారేసుకున్నారు. లష్కరే తొయిబా చీఫ్ ఉగ్రవాది హఫీజ్ సయీద్ తరహాలో ఒక ఆర్మీ అధికారి మాట్లాడటం వివాదాస్పదమైంది. ఆయన వ్యాఖ్యలను అఫ్ఘాన్ రాజకీయ నాయకురాలు, మాజీ ఎంపీ మరియం సొలైమాంఖిల్ తీవ్రంగా ఖండించారు. 'మీరు నీటిని ఆపేస్తే.. మేం మీ ఊపిరి ఆపేస్తాం' అంటూ గతంలో హఫీజ్ చేసిన వ్యాఖ్యలను షరీఫ్ కాపీ కొట్టినట్లుందని అన్నారు.

'ప్రాజెక్టు కుశ' ప్రొటోటైప్ ఏడాదిలో సిద్ధం: బెల్

న్యూఢిల్లీ, మే 23: ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ చేసిన డ్రోన్, క్షిపణి దాడులను భారత్ సమర్థవంతంగా అడ్డుకుంది. రష్యా తయారీ ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ ఇందులో కీలక పాత్ర పోషించింది. అలాంటి మన సొంత అధునాతన రక్షణ వ్యవస్థ త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రాజెక్ట్ కుశ'పై.. డీఆర్‌డీవో, బెల్ (భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్) సంస్థలు యుద్ధప్రాతిపదికన పనిచేస్తున్నాయి. ఉపరితలం నుంచి గాలిలోకి (సర్ఫేస్ టు ఎయిర్) ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణులు, అత్యాధునిక రాడార్లు, కమాండ్ కంట్రోల్ వంటివి దీనిలో భాగంగా ఉంటాయి. మరో ఏడాది, ఏడాదిన్నరలో మన సొంత గగనతల రక్షణ వ్యవస్థ ప్రొటోటైప్ (ప్రాథమిక రూపం) సిద్ధమవుతుందని బెల్ సంస్థ ఇటీవల తమ నివేదికలో తెలిపింది.

మన విదేశాంగ విధానం కుప్పకూలింది: రాహుల్

న్యూఢిల్లీ, మే 23: కేంద్ర మంత్రి జైశంకర్ తీరుతో మన విదేశాంగ విధానం కుప్పకూలిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. పృథ్వీరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యతిరేకంగా మహమ్మద్ ఘోరీతో చేతులు కలిపిన రాజపుత్ ప్రభువు జైచంద్ పేరు ధ్వనించేలా జైశంకర్‌ను 'జై చంద్ జై శంకర్- జేజే' అని సంబోధిస్తూ ఆయనపై రాహుల్ ప్రశ్నల వర్షం కురిపించారు. "పాకిస్థాన్ చర్యలను ఖండిస్తూ ఎందుకని ఒక్క దేశమూ మన వెనుక నిలబడలేదు?" అంటూ నిలదీశారు. "ఉగ్రవాదంపై పాక్ ప్రకటనను ఎలా విశ్వసించారు? భారత ప్రయోజనాలను ఎందుకని ట్రంప్‌కు పణం పెట్టారు? కెమెరాల ఎదుట మాత్రమే ఎందుకని మీ రక్తం పొంగుతుంది? వట్టి ప్రసంగాలు కట్టిపెట్టి ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి" అని రాహుల్ డిమాండ్ చేశారు.

పోలింగ్ స్టేషన్ దాకా మొబైల్ తీసుకెళ్లొచ్చు!

న్యూఢిల్లీ, మే 23: పోలింగ్ రోజున ఓటర్లు తమ ఫోన్లను పోలింగ్ స్టేషన్ దాకా తీసుకువెళ్లడానికి ఎన్నికల సంఘం(ఈసీ) వెసులుబాటు కల్పించింది. అయితే, వాటిని పోలింగ్ స్టేషన్ నుంచి 100 మీటర్ల దూరంలోనే స్విచ్చాఫ్ చేయాలని సూచించింది. ఓటు వేసే ముందు ఫోన్లను పోలింగ్ స్టేషన్ వెలుపల ఏర్పాటు చేసే కౌంటర్లలో దాచిపెట్టాలని తెలిపింది. ఈ మేరకు శుక్రవారం మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రజలకు ఫోన్ అవసరాలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇంతకు ముందు పోలింగ్ స్టేషన్ నుంచి 100మీటర్ల దూరం వరకు మొబైల్ ఫోన్లపై నిషేధం ఉండేది. మరోవైపు, ఓటర్లకు ఓటర్ స్లిప్పులు అందించడానికి, బూత్ నంబర్లు చెప్పడానికి రాజకీయ పార్టీలు పోలింగ్ స్టేషన్ నుంచి 100మీటర్ల ఆవల బూత్‌లను ఏర్పాటు చేసుకోవచ్చని ఈసీ తెలిపింది. ఇంతకుముందు ఈ పరిధి 200మీటర్లుగా ఉంది.

యూపీలో జైలు నుంచి 104 ఏళ్ల ఖైదీ విడుదల

» 43 ఏళ్ల జైలు శిక్ష తర్వాత నిర్దోషిగా ప్రకటించిన హైకోర్టు

కౌశాంబీ (యూపీ), మే 23: హత్య, హత్యాయత్నం కేసుల్లో 43 ఏళ్ల పాటు శిక్ష అనుభవించిన 104 ఏళ్ల ఖైదీ నిర్దోషిగా జైలు నుంచి విడుదలయ్యాడు. గతంలో జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన అప్పీలు చేయగా, నిర్దోషిగా ప్రకటిస్తూ ఇటీవల హైకోర్టు ఆదేశాలిచ్చింది. కౌశాంబీ జిల్లా గౌరాయే గ్రామానికి చెందిన లఖన్ 1921లో జన్మించినట్టు జైలు రికార్డుల్లో ఉంది. 1977 ఆగస్టు 16న రెండు వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరిని హత్య చేయడంతో పాటు, మరికొందరిపై దాడి చేసినట్టు కేసు నమోదయింది. విచారణ జరిపిన ప్రయాగ్‌రాజ్ జిల్లా, సెషన్స్ కోర్టు లఖన్‌తో పాటు మరో ముగ్గురికి 1982లోయావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ తీర్పుపై వారు అలహాబాద్ హైకోర్టులో అప్పీలు చేశారు. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే ముగ్గురు నిందితులు మరణించారు. విచారణ జరిపిన హైకోర్టు ఆయనను ఈ నెల 2న నిర్దోషిగా ప్రకటించింది.

బయోసెన్సర్‌తో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు

న్యూఢిల్లీ, మే 23: ప్రయోగశాలల్లో చేసే ఖరీదైన పరీక్షలు అవసరం లేకుండా తక్కువ ఖర్చుతో, సులువుగా, వేగంగా రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు రూర్కెలా-నిట్ పరిశోధకులు బయోసెన్సర్‌ను అభివృద్ధి చేశారు. టీఎఫ్ఈటీ(టన్నెల్ ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్) అనే ఈ పరికరం టీసీఏడీ(టెక్నాలజీ కంప్యూటర్ ఎయిడెడ్) సిమ్యులేషన్ ఆధారంగా పని చేస్తుంది. సాధారణంగా ఎక్స్‌రే, మామోగ్రాఫీ, అల్ట్రా సోనోగ్రఫీ, ఎంఆర్ఐ తదితర పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తిస్తారు. ఈ పరీక్షల కోసం కొన్ని రసాయనాలు, ఇతర పదార్థాలను వినియోగిస్తారు. ఇలాంటివి అవసరం లేకుండా టీఎఫ్ఈటీ బయోసెన్సర్.. కణాల భౌతిక లక్షణాల ఆధారంగా క్యాన్సర్‌ను గుర్తిస్తుంది.

యాపిల్‌పై 25%.. ఈయూపై 50%



ఆగని ట్రంప్ సుంకాల రంకెలు

» అమెరికాలో అమ్మే ఐఫోన్లు అమెరికాలోనే తయారుచేయాలని, ఇండియాలోనో మరెక్కడో కాదని అమెరికా అధ్యక్షుడి హుకుం

» జూన్ 1 నుంచి ఈయూ ఉత్పత్తులపై 50% టారిఫ్ అని హెచ్చరిక

వాషింగ్టన్, మే 23: చైనాపై సుంకాలు పెంచిన నేపథ్యంలో తన తయారీని భారత్‌కు మార్చే ప్రయత్నాల్లో ఉన్న యాపిల్ కంపెనీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారీ షాక్ ఇచ్చారు. అమెరికాలో అమ్మే ఐఫోన్లను అమెరికాలో తయారు చేయకపోతే వాటిపై 25 శాతం సుంకం విధిస్తానని హెచ్చరించారు. దీనిపై తాను ఇప్పటికే యాపిల్ సీఈవో టిమ్ కుక్‌కు సమాచారం ఇచ్చానని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వెల్లడించారు. "నేను చాలా కాలం క్రితమే యాపిల్ సీఈవో టిమ్ కుక్‌కు సమాచారం ఇచ్చాను. అమెరికాలో అమ్మే ఐఫోన్లు యూఎస్ఏలోనే తయారుకావాలి తప్ప ఇండియాలోనో, మరోచోటో కాదనే విషయాన్ని ఆయనకు చెప్పాను. అలా చేయకపోతే కనీసం 25% సుంకాన్ని యాపిల్ అమెరికాకు చెల్లించాల్సి ఉంటుంది" అని ఆయన ఆ పోస్టులో పేర్కొన్నారు. వచ్చే కొన్నేళ్లలో ప్రపంచవ్యాప్తంగా విక్రయించే ఐఫోన్లలో 25 శాతం ఫోన్లను భారత్‌లో తయారుచేయాలని యాపిల్ లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో యాపిల్ సంస్థ 22 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.87 లక్షల కోట్లు) విలువ చేసే ఐఫోన్లను యాపిల్ సంస్థ భారత్‌లో ఉత్పత్తి చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 60 శాతం దాకా ఎక్కువ. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అమ్ముడవుతున్న ప్రతి ఐదు ఐఫోన్లలో ఒకటి భారత్‌లోనే తయారవుతోంది. యాపిల్‌పై సుంకాల హెచ్చరికతో పోస్టు పెట్టిన అరగంటకే.. ట్రంప్ తన సుంకాల అస్త్రాన్ని ఈయూపై గురిపెట్టారు. అమెరికాతో వాణిజ్య చర్చలకు రాని కారణంగా జూన్ 1 నుంచి యూరోపియన్ యూనియన్ ఉత్పత్తులపై 50 శాతం సుంకాలను సిఫారసు చేస్తున్నట్టు మరో పోస్టు పెట్టారు. ఈయూతో వ్యవహారం కష్టంగా ఉందని.. తమ మధ్య చర్చలు ముందుకు సాగట్లేదని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ పోస్టుల దెబ్బకు అమెరికా ఫ్యూచర్స్ మార్కెట్ కుదేలైంది. అటు ఈయూ స్టాక్ మార్కెట్లు కూడా 2% మేర పతనమయ్యాయి.

హార్వర్డ్‌పై నిషేధం నిలిపివేత

» అమెరికా జిల్లా కోర్టు తాత్కాలిక ఉత్తర్వులు

» ఊపిరి పీల్చుకున్న 6703 మంది విదేశీ విద్యార్థులు

బోస్టన్, మే 23: హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థుల అడ్మిషన్లపై నిషేధం విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఎదురు దెబ్బ తగిలింది. దీనిపై హార్వర్డ్ యూనివర్సిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి అల్లిసన్ బుర్రోగ్స్.. శుక్రవారం ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ నిషేధాజ్ఞలను తాత్కాలికంగా నిలిపివేశారు. అంతకుముందు శుక్రవారం ఉదయం.. 'ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ స్పష్టంగా దేశ రాజ్యాంగాన్ని, ఫెడరల్ చట్టాలను ఉల్లంఘిస్తోంది' అని పేర్కొంటూ హార్వర్డ్ యూనివర్సిటీ పిటిషన్ దాఖలు చేసింది. విద్యారంగంలో తనదైన ముద్ర వేసేందుకు, అన్ని విద్యా సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకునేందుకు గురువారం హార్వర్డ్ వర్సిటీలో విదేశీ విద్యార్థుల అడ్మిషన్లపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఈవీపీ) సర్టిఫికేషన్ రద్దు చేయడంతో ఎఫ్-1 లేదా జే-1 వీసా కింద విదేశీ విద్యార్థులకు ఈ యూనివర్సిటీలో ప్రవేశార్హత ఉండదు. అయితే, తాము పెట్టిన 6 కఠిన షరతులకు కట్టుబడి ఉంటూ 72 గంటల్లో వివరణ ఇస్తే నిషేధం ఎత్తేస్తామని డీహెచ్ఎస్ షరతు విధించింది. ఒకవేళ, ట్రంప్ సర్కార్ నిర్ణయం అమల్లోకి వస్తే 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన 788 మంది భారతీయులు సహా మొత్తం 6703 మంది విదేశీ విద్యార్థులు మరో ఎస్ఈవీపీ సర్టిఫైడ్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందడం లేదా బహిష్కరణ వేటుకు ఎదుర్కోవాల్సి ఉండేది. గత ఐదేళ్లలో తమ సంస్థలో విద్యాభ్యాసం చేసిన విదేశీ విద్యార్థుల ప్రవర్తన, క్రమశిక్షణ, క్యాంపస్ ఆవరణలో నిరసనల ప్రదర్శనలు, హింసాత్మక కార్యకలాపాలపై వచ్చే 72 గంటల్లో హార్వర్డ్ యూనివర్సిటీ ఇచ్చిన నివేదికను బట్టి తన నిషేధాన్ని ఎత్తివేస్తామని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ షరతు విధించిన సంగతి తెలిసిందే.

లోకం తీరు



టెక్ ఉద్యోగాలకు భారీగా కత్తెర

» దిగ్గజ సంస్థల్లో కొనసాగుతున్న కోత

» ఏఐ ప్రభావం, ఆర్థిక అనిశ్చితి కారణం

న్యూఢిల్లీ, మే 23: దిగ్గజ టెక్నాలజీ సంస్థలు ఈ ఏడాది కూడా ఉద్యోగులను భారీ సంఖ్యలో తొలగిస్తున్నాయి. ఉద్యోగాలకు కోతలు పెడుతున్న వాటిలో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, క్రౌడ్ స్ట్రయిక్ వంటి సంస్థలు ఉన్నాయి. ఆదాయ ఆర్జన మందగించడం, ఆర్థిక అనిశ్చితి కొనసాగడం, కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం పెరగడం తదితర కారణాల వల్ల ఈ కంపెనీలు ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. 2025లో ఇప్పటి వరకు 130 కంపెనీలు 61 వేల మంది ఉద్యోగులను తొలగించాయని లేఆఫ్స్‌డాట్‌ఎఫ్‌వైఐ సంస్థ వెల్లడించింది. ఒక్క మైక్రోసాఫ్ట్ సంస్థ తన ఉద్యోగుల్లో ఈ ఏడాది 6 వేల మందిని ఇంటికి పంపించింది. వాషింగ్టన్ రాష్ట్రంలోనే 2 వేల మందికి ఉద్వాసన పలికింది. 2023 తర్వాత ఆ కంపెనీలో ఇంత ఎక్కువ మందిని తీసివేయడం ఇదే మొదటిసారి. గూగుల్‌లో అయితే 2023లో 12 వేల మందిని ఒకేసారి తొలగించిన తర్వాత కూడా ఆ పంథాను స్థిరంగా కొనసాగిస్తోంది. తన ఆపరేషన్ మోడల్‌ను మెరుగుపరిచే క్రమంలో ఈ ఏడాది పిక్సెల్, ఆండ్రాయిడ్, క్రోమ్, క్లౌడ్ యూనిట్లలో ఉద్యోగాలకు కత్తెర వేసింది. ఇక ఈనెల ప్రారంభంలో తన యాడ్ సేల్స్ భాగస్వామ్య విభాగాలను నిర్వహించే గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ నుంచి 200 మందిని తొలగించింది. ఈ ఏడాది అమెజాన్ తన డివైజెస్ అండ్ సర్వీస్ విభాగంలో 100 మందిని పక్కనబెట్టింది. ఈ విషయంలో ఐబీఎం కొంత వైవిధ్యాన్ని చూపుతోంది. ఓ పక్క హెచ్ఆర్ వంటి విభాగాల్లో ఉద్యోగులను తొలగిస్తూ ఆ స్థానాలను ఏఐ టెక్నాలజీతో పూరిస్తోంది. మిగిలిన నిధులతో ప్రోగ్రామింగ్, సేల్స్‌లో నైపుణ్యం కలిగిన వారిని తీసుకుంటోంది.

కెనడా స్టడీ పర్మిట్లలో భారీ కోత

» ఈ ఏడాది జనవరి-మార్చి మధ్య కేవలం 30,640 పర్మిట్లు జారీ

» గత ఏడాదితో పోలిస్తే 31% తగ్గుదల

» భారతీయ విద్యార్థులకు గట్టి షాక్

ఒట్టావా, మే 23: భారీ స్థాయిలో వలసల నేపథ్యంలో కెనడా అనుసరిస్తున్న కఠినమైన వీసా నిబంధనల కారణంగా ఆ దేశానికి వెళ్లి చదువుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. స్టడీ పర్మిట్లలో కెనడా ఈ ఏడాది భారీగా కోత పెట్టింది. ఇమిగ్రేషన్ రిఫ్యూజెస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ) గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది మొదటి త్రైమాసికం (జనవరి-మార్చి)లో భారతీయ విద్యార్థులకు కేవలం 30,640 పర్మిట్లు జారీచేశారు. ఇది గత ఏడాది ఇదే కాలానికి సంబంధించి జారీచేసిన పర్మిట్లతో పోలిస్తే 31 శాతం తగ్గుదల కనిపిస్తోంది. దేశంలోకి భారీగా వస్తున్న విదేశీ విద్యార్థుల సంఖ్యను నియంత్రించేందుకు కెనడా ప్రభుత్వం 2023 నుంచి చర్యలు తీసుకుంటోంది. ఆ ఏడాది మొత్తం 6,81,155 స్టడీ పర్మిట్లను జారీచేయగా.. వాటిల్లో భారతీయులే 2,78,045 ఉన్నారు. అదే 2024 నాటికి మొత్తం సంఖ్యను 5,16,275కు తగ్గించారు. అందులో భారతీయ విద్యార్థుల సంఖ్య 1,88,465కు పడిపోయింది. భారీ స్థాయిలో వలసలు ఉండడంతో కెనడా ప్రభుత్వం విద్యార్థుల పర్మిట్ల విషయంలో నియంత్రణ విధించాలని నిర్ణయించింది. దేశంలో పెరుగుతున్న గృహ సంక్షోభం ఇందుకు ప్రధాన కారణంగా ఉంది. దీంతో పాటు ఆరోగ్య, రవాణా మౌలిక సదుపాయాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది. కొత్త ప్రధానిగా ఎన్నికైన మార్క్ కార్నీ ఇటీవల కీలక ప్రకటన చేశారు. విదేశీ విద్యార్థులు, పనిచేసే వారితో సహా దేశంలో తాత్కాలిక నివాసితుల సంఖ్య 2028 నాటికి దేశ జనాభాలో 5 శాతానికి మించకూడదన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐఆర్‌సీసీ.. 2025కు సంబంధించి స్టడీ పర్మిట్లను 4,37,000కు పరిమితం చేసింది. తొలుత దీన్ని 4,85,000 అనుకున్నారు. కెనడాలో ఉంటున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయుల సంఖ్య అధికంగా ఉంటుంది. 2022లో మొత్తం విదేశీ విద్యార్థుల్లో మనవాళ్ల సంఖ్య 41 శాతం వరకు ఉండటం గమనార్హం.

అమ్మా.. నేను చోరీ చేయలేదు!

సూసైడ్ నోట్ రాసి 13 ఏళ్ల బాలుడి ఆత్మహత్య

కోల్‌కతా, మే 23: చేయని దొంగతనాన్ని తనపై మోపారన్న మనస్థాపంలో 13ఏళ్ల బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు సూసైడ్ నోట్ రాశాడు. అందులో 'అమ్మా నేను దొంగతనం చేయలేదమ్మా' అని బాధపడ్డాడు. పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మిద్నాపోర్‌లో ఇటీవల ఈ ఘటన జరిగింది. బాలుడి పేరు కృష్ణేందు దాస్. శుభాంకర్ దీక్షిత్ అనే వ్యక్తి స్థానికంగా ఓ దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడు షాపులో లేని సమయంలో కృష్ణేందు మూడు చిప్స్ ప్యాకెట్స్ తీసుకొని వెళ్లిపోయాడని స్థానికులు చెప్పారు. దీక్షిత్ కోపంతో నేరుగా బాలుడి ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆ బాలుడు దీక్షిత్‌కు 20 రూపాయలు ఇచ్చాడు. అయినా, కృష్ణేందును తనతో పాటు దుకాణానికి తీసుకెళ్లిన దీక్షిత్, చిప్స్ ప్యాకెట్స్ ధర 15రూపాయలను మినహాయించుకొని ఆ చిన్నారికి ఐదు రూపాయలు తిరిగిచ్చేశాడు. ఆపై చిన్నారిని కొట్టి.. స్థానికుల ఎదుట క్షమాపణలు చెప్పించుకున్నాడు. దీంతో బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



గ్యాంగ్ రేప్ నిందితుల రోడ్ షో

నలుగురి అరెస్ట్.. ముగ్గురి కోసం గాలింపు

బెంగళూరు, మే 23(ఆంధ్రజ్యోతి): గత ఏడాది జనవరి 8న కర్ణాటకలోని హనగల్ శివారులో ఓ మహిళపై గ్యాంగ్‌రేప్ జరిగింది. ఈ కేసులో 19 మంది నిందితులు. వారిలో ఏడుగురు ప్రధాన నిందితులు. ఈ ఏడుగురు ఈ నెల 20న జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా వారు 5కార్లతో అనుచరులతో రోడ్ షో చేస్తూ ఇళ్లకు వెళ్లారు. ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో, ఆ నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో నలుగురిని శుక్రవారం అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురికోసం గాలిస్తున్నారు.

కోటాలోనే ఎందుకు విద్యార్థులు చనిపోతున్నారు?

» రాజస్థాన్‌ను నిలదీసిన సుప్రీంకోర్టు


న్యూఢిల్లీ, మే 23: కోచింగ్ సెంటర్ల కేంద్రమైన రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతుండడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఏడాదిలో ఇంతవరకు 14 మంది చనిపోవడం తీవ్రమైన విషయమని తెలిపింది. ఇందుకు సంబంధించిన వ్యాజ్యంపై శుక్రవారం విచారణ చేపట్టింది. పిల్లల ఆత్మహత్యల నివారణకు రాజస్థాన్ ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించింది. దర్యాప్తునకు సిట్‌ను నియమించినట్టు రాజస్థాన్ న్యాయవాది బదులిచ్చారు. విద్యార్థుల ఆత్మహత్యలపై కేసు నమోదులో ఆలస్యంపైన కూడా సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది.

బెట్టింగ్.. సమాజ వికృత క్రీడ

అందులో ప్రజలు పాల్గొనడాన్ని చట్టాలతో ఆపలేం .. ఐపీఎల్ ముసుగులో బెట్టింగ్, జూదం ఆడుతున్నారు

» ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై సుప్రీం వ్యాఖ్యలు

» యాప్‌లను నిషేధించాలంటూ కేఏ పాల్ వ్యాజ్యం



న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ అనేది సమాజ వికృత క్రీడని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. చట్టాన్ని అమలు చేయడం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా బెట్టింగ్‌లో పాల్గొనడాన్ని ఆపలేమని అభిప్రాయపడింది. అన్ని ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మార్చి 26న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. కేఏ పాల్ స్వయంగా వాదనలు వినిపించారు. బెట్టింగ్ యాప్‌ల కారణంగా ఒక్క తెలంగాణలోనే గత రెండేళ్లలో 1,023 మంది బలవన్మరణానికి పాల్పడ్డారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 25మంది నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ స్వార్థం కోసం అమాయకుల జీవితాలతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై చర్యలు తీసుకోవాలని, దీనికి సంబంధించి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేలా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. "సచిన్‌ను క్రికెట్ దేవుడని అభిమానులు భావిస్తారు. అలాంటి వ్యక్తి ఆమోదిస్తే.. ఆ యాప్ సరైందేనని ప్రజలు అనుకుంటారు" అని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. 'బెట్టింగ్‌ను ఎలాగైనా ఆపాలి. ఈ విషయంలో కోర్టు మీతో ఉంది. అయితే, చట్టం ద్వారా బెట్టింగ్ ఆపవచ్చనే అపోహలో మీరున్నట్టు కనిపిస్తోంది. హత్య చేస్తే ఎంతో బలమైన చట్టాలు ఉన్నాయి. ఐపీసీ 302 కింద జీవిత ఖైదు నుంచి మరణ శిక్ష వరకు విధించే అవకాశం ఉంది. మరి హత్యలు చేయకుండా మీరు ఆపగలరా?" అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. కేఏ పాల్ పిటిషన్‌పై సమాధానం చెప్పాలని కేంద్రానికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అవసరమైతే రాష్ట్రాలకు కూడా నోటీసులు జారీ చేస్తామని పేర్కొంది.

మాతృత్వ సెలవులు ఇద్దరు పిల్లలకే కాదు

మాతృత్వ ప్రయోజనాల్లో సెలవులు కూడా ఓ భాగమని శుక్రవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దానిని ఇద్దరు పిల్లలకే పరిమితం చేయూడదని సూచించింది. తనకు మొదటి వివాహం ద్వారా కలిగిన ఇద్దరు పిల్లల విషయంలో మాతృత్వ సెలవులు ఇచ్చారని, రెండో వివాహం ద్వారా కలిగిన సంతానానికి ఇవ్వలేదని పేర్కొంటూ తమిళనాడుకు చెందిన ఓ టీచరు చేసిన ఫిర్యాదుపై విచారణ జరిపిన కోర్టు ఈ స్పష్టత ఇచ్చింది. సెలవులు పొందేందుకు పిల్లల సంఖ్య అడ్డం కాబోదని తెలిపింది.

అతడి చేష్టను ఆమె నేరంగా చూడటం లేదు

» 14 ఏళ్ల బాలికతో శృంగారంలో పాల్గొన్న వ్యక్తిని నిర్దోషిగా ప్రకటించిన సుప్రీం

న్యూఢిల్లీ, మే 23: పోక్సో కేసుకు సంబంధించి సుప్రీం కోర్టు శుక్రవారం అరుదైన తీర్పును వెలువరించింది. ఏడేళ్ల క్రితం 14 ఏళ్ల బాలికతో శృంగారంలో పాల్గొని, పోక్సో చట్టం కింద దోషిగా తేలిన వ్యక్తిని సర్వోన్నత న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది. పైగా ఈ కేసు అందరికీ 'కనువిప్పు' కావాలి అని తీర్పులో ప్రత్యేకంగా ప్రస్తావించింది. 'తనపట్ల నిందితుడు చేసిన పనిని బాధితురాలు నేరంగా పరిగణించడం లేదు. పైగా అతడితో ఆమె భావోద్వేగంతో కూడిన అనుబంధాన్ని పెంచుకొంది' అని తీర్పులో వ్యాఖ్యానించింది. 2018లో 14 ఏళ్ల బాలికగా ఒకానొక రోజు ఆమె కనిపించకుండా పోయింది. అదేరోజు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మర్నాడు.. ఆ బాలికను 25 ఏళ్ల వ్యక్తి పెళ్లి చేసుకున్నట్లు కుటుంబసభ్యులకు తెలిసింది. దీనిపై స్థానిక కోర్టులో బాలిక కుటుంబసభ్యులు కేసు వేశారు. విచారణ చేసిన కోర్టు ఆ వ్యక్తికి పోక్సో చట్టం కింద దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ కేసు క్రమంగా సుప్రీంకోర్టును చేరింది. 'బాధితురాలు ఇప్పుడు ఆ వ్యక్తి భార్య' అని విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం ప్రత్యేకంగా ప్రస్తావించింది. 'తన భర్తను శిక్ష నుంచి కాపాడుకునేందుకు ఆమె పోరాటం చేస్తోంది. ప్రస్తుతం ఆ దంపతులకు బిడ్డ కూడా ఉంది. ఈ కేసులో నిందితుడికి శిక్ష విధిస్తే న్యాయం జరగదు. అలా చేస్తే కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసినట్లవుతుంది" అని పేర్కొంది.

నేషనల్ హెరాల్డ్ విరాళాలపై మళ్లీ కలకలం

పదవుల ఆశ చూపి వసూలు చేశారు

» ఇది క్విడ్ ప్రో కో కిందే వస్తుంది: ఈడీ



న్యూఢిల్లీ, మే 23: కాంగ్రెస్ అధికార పత్రిక నేషనల్ హెరాల్డ్ కోసం ఆ పార్టీ నేతల నుంచి విరాళాలు సేకరించిన వ్యవహారం మరోసారి కలకలం రేపింది. రేవంత్‌రెడ్డి, అహ్మద్ పటేల్, పవన్ బన్సల్ లాంటి ముఖ్యమైన నేతలు పార్టీ టికెట్లు, పదవులిస్తామని ఆశ చూపి కాంగ్రెస్ నేతల దగ్గర నుంచి విరాళాలు సేకరించారని, ఇది క్విడ్ ప్రో కో కిందకు వస్తుందంటూ గత నెల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ కోర్టులో దాఖలు చేసిన చార్జిషీటు తాజాగా వెలుగులోకి రావడంతో రాజకీయ దుమారం రాజుకుంది. నిజానికి 2022లోనే తెలంగాణకు చెందిన పలువురు నేతలను ఈడీ విరాళాల వ్యవహారంలో ప్రశ్నించింది. తాజాగా వెలుగులోకి వచ్చిన చార్జిషీటులో రేవంత్‌రెడ్డి సూచన మేరకే రాష్ట్ర నాయకులు రూ.80 లక్షలు విరాళంగా ఇచ్చారని పేర్కొంది. బయటి వ్యక్తులను కూడా విరాళాలు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి కోరారని తెలిపింది. డీకే శివకుమార్ స్వయంగా రూ.25 లక్షలు విరాళమిచ్చారని, ఆయనకు సంబంధించిన ట్రస్ట్ నుంచి రూ.2 కోట్లు ఇప్పించారని పేర్కొంది. యంగ్ ఇండియా కార్యకలాపాలేమిటో తనకు తెలియదని, పార్టీ కోశాధికారి పవన్ బన్సల్ కోరితే విరాళమిచ్చానని శివకుమార్ చెప్పారని వెల్లడించింది. ఈ కేసులో ఈడీ కాంగ్రెస్ ముఖ్యనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలను ప్రధాన నిందితులుగా పేర్కొంది. అభియోగ పత్రాల్లో రేవంత్‌రెడ్డి, పవన్ బన్సల్, అహ్మద్ పటేల్‌ల పేర్లను ప్రస్తావించినా వారిని నిందితులుగా పేర్కొనలేదు. ఈ కేసు విచారణ బుధవారం రౌస్ ఎవెన్యూ కోర్టులో జరగడంతో చార్జిషీటు వెలుగులోకి వచ్చింది. ఈడీ అభియోగపత్రం ప్రతీకార రాజకీయాల్లో భాగమని కాంగ్రెస్ పేర్కొంది. ముగ్గురు నేతల మనసు కష్టపెట్టడం పార్టీలో తమ భవిష్యత్తుకు నష్టం చేస్తుందనే అభిప్రాయాన్ని విరాళాలు ఇచ్చిన నేతలు చెప్పినట్లు ఈడీ తెలిపింది. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ నేతలు, ఇతరులు ఇచ్చిన సొమ్మును విరాళాలుగా పరిగణించరాదని, అవి స్వచ్ఛందంగా ఇచ్చినవి కాదని, రాజకీయంగా ప్రయోజనాన్ని ఆశించి ఇచ్చినవని ఈడీ అభియోగ పత్రంలో పేర్కొంది. విరాళాలను కాంగ్రెస్ పార్టీ ఆదాయ పన్ను శాఖకు చెల్లించాల్సిన పన్ను బకాయిలపై అప్పీలుకు డిపాజిట్‌గా వాడిందని పేర్కొంది. విరాళాలు వసూలు చేయాలన్న నిర్ణయాన్ని పార్టీ నేతలతో పంచుకున్నది దివంగత నేత ఆస్కార్ ఫెర్నాండెజ్ అని ఈడీ వెల్లడించింది.

తెలంగాణలో 3 కొత్త కేంద్ర సంస్థలు

- అంతర్జాతీయ స్థాయి మిల్లెట్స్ పరిశోధన కేంద్రం.. కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం కూడా
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త సంస్థలను ఏర్పాటు చేయబోతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. 2014 నుంచి రాష్ట్రానికి కొత్తగా పలు కేంద్ర సంస్థలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మూడు కేంద్ర సంస్థల గురించి వెల్లడించారు. మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని పెంచే క్రమంలో భాగంగా మోదీ సర్కారు తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి మిల్లెట్స్ పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. రూ.250 కోట్లతో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్'ను కేంద్ర వ్యవసాయ శాఖ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుందని ఆయన పేర్కొన్నారు. అలాగే.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 'కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ప్రారంభం కానుందని.. జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని (నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను) కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గర నుంచి, పరిశ్రమల నుంచి 'ట్రిపుల్ ఆర్ ట్యాక్స్' పేరిట భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

భవనాలకు అనుమతి కోసం 8 లక్షలు డిమాండ్

(మొదటి పేజీ తరువాయి) రెండు భవనాలు నిర్మించుకున్నారు. వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది మార్చి 4న ఆ భవనాలను పరిశీలించిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ విఠల్.. ఓసీలు ఇచ్చేందుకు రూ.8లక్షలు లంచం డిమాండ్ చేశారు. దీంతో వెంకట్‌రావు చేసేదేమీ ఈ నెల 12న విఠల్‌కు రూ.4 లక్షలు ఇచ్చారు. తర్వాత మిగతా రూ.4లక్షలు ఇవ్వాలని విఠల్ పట్టుబట్టగా, ఇవ్వలేనని వెంకట్‌రావు చెప్పడంతో.. ఓసీ దరఖాస్తులను విఠల్ తిరస్కరించారు. దీనితో 3 రోజుల క్రితం వెంకట్‌రావు ఏసీబీని ఆశ్రయించగా.. అధికారులు శుక్రవారం దాడి చేసి విఠల్‌ను అరెస్టు చేశారు. నల్లకుంటలోని విఠల్ ప్రైవేటు కార్యాలయంతోపాటు మేడిపల్లిలోని విఠల్ నివాసంలో సోదాలు చేపట్టామని ఏసీబీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఇక కామారెడ్డి పోలీసు స్టేషన్‌లో 2018లో నమోదైన ఓ కేసులో.. ఓ వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించేందుకు కామారెడ్డి జిల్లా జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) గుగులోత్ అశోక్ శివరామ్‌నాయక్, పట్టణ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ నిమ్మ సంజయ్ రూ.10 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఇక మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం ఇన్‌చార్జి ఎంపీడీవో విఠల్‌రెడ్డి.. డ్రైనేజీ పనుల బిల్లులు మంజూరు చేసేందుకు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయారు.

మావోయిస్టు దళపతి ఎలా చిక్కారు?

- నంబాలను కంటికి రెప్పలా కాపాడే బలగాలేవి?
- నక్సల్స్‌ను అత్యంత సమీపం నుంచి కాల్చిచంపారు
- ముఖాలపై తుపాకీ బాయ్‌నెట్‌తో కొట్టిన గుర్తులు
- ఎన్‌కౌంటర్‌పై ప్రజాసంఘాల అనుమానాలు







పోలీసులు గురువారం విడుదల చేసిన ఎన్‌కౌంటర్ మృతుల ఫొటోలు వరుసగా: జంగు నవీన్, సంగీత, భూమిక, యుగేంద్ర, రాజేశ్ తెలం

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌పై ప్రజా సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అడవుల్లో ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావుతో పాటు మరో 26 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌పై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగిందని చెబుతున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు.. ఏ ప్రాంతంలో జరిగిందనేది చెప్పడం చేయలేదు. అలాగే మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడం అనుమానాలకు తావిస్తోందని ప్రజా సంఘాల నేతలు అంటున్నారు. కేశవరావుకు రక్షణగా కనీసం 50 మంది సాయుధ మావోయిస్టులు కాపలా ఉంటారని, ఎన్‌కౌంటర్‌లో కేవలం 26 మందినే చూపించడం అనుమానాస్పదంగా ఉందని చెబుతున్నారు. పోలీసులు విడుదల చేసిన కేశవరావు ఫొటోను చూస్తే ఆయన గడ్డం చేసుకోవడం, తలపై జుట్టుకు రంగు వేసుకున్నట్లు కనిపించడం, తల కింద ఎర్రదస్తీ ఉండడం అనుమానాలకు తావిస్తుందని పేర్కొంటున్నారు. ఆయన ఎప్పుడు దస్తీ అలా వాడరని, అది కొత్తగా పెట్టినట్లు కనిపిస్తోందని గతంలో కేశవరావుతో కలిసి పనిచేసిన వారు చెబుతున్నారు. ఇక, ఆయన్ను పడుకోబెట్టిన ప్రదేశంలోని ఆకులను గమనిస్తుంటే ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలాగా లేదని అంటున్నారు. ఆయనతో పాటు మరణించిన మావోయిస్టుల ఫొటోలను చూస్తుంటే చాలామందిని అత్యంత సమీపం నుంచి కాల్చివేసినట్లు ఉందని, వారి ముఖాలపై తుపాకీ బాయ్‌నెట్‌తో కొట్టిన గుర్తులు కనిపిస్తున్నాయని ప్రజాసంఘాల నాయకులు పేర్కొంటున్నారు. కేశవరావుతో పాటు మధు తప్పనిసరిగా ఉంటాడని, ఇద్దరికీ రక్షణగా ఉండాల్సిన వారి విషయంలోనే అనుమానాలు కలుగుతున్నాయని చెబుతున్నారు. కేశవరావు అనారోగ్యంతో బాధ పడుతున్నారని, చికిత్స తీసుకుంటుండగా పట్టుకొచ్చి, కాల్చి చంపారన్న ఆరోపణలూ ఉన్నాయి. కేశవరావు తన కదలికల విషయంలో జాగ్రత్తగా ఉంటారని, రక్షణగా కంపెనీ ఎప్పుడూ సర్వసన్నద్ధంగా ఉంటుందని ప్రజా సంఘాల నేతలు అంటున్నారు. వారిలో కనీసం పది మంది దగ్గరైనా ఏకే 47 తుపాకులు ఉంటాయని, పోలీసులు 3 తుపాకులే స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించడంతో మిగతా వారు ఏమయ్యారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్లుగా ఒకే చోట?

కేశవరావు పదేళ్లుగా అబూజ్‌మడ్ అడవుల్లోని ఒకే ప్రాంతంలో ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. వరస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నా ఆయన అక్కడే ఉన్నట్లు చెబుతున్నారు. పసిగట్టిన పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేసుకొని, ఈ నెల 21న ఆయన క్యాంప్‌పై విరుచుకుపడినట్లు చర్చ జరుగుతోంది. కేశవరావు అతి విశ్వాసమే ఎన్‌కౌంటర్‌కు దారితీసిందన్న వాదన కూడా వినిపిస్తోంది.

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ యువతి మృతి

ఓయూ నుంచి అబూజ్‌మడ్ వరకు.. 12 ఏళ్ల కిందట మావోయిస్టు ఉద్యమంలోకి విజయలక్ష్మి

- స్వస్థలం రంగారెడ్డి జిల్లా వేములనర్వ
- మృతుల్లో ముగ్గురు తెలంగాణ వాసులు
- ఛత్తీస్‌గఢ్‌లో 33 మంది లొంగుబాటు



భూమిక(ఫైల్)



చర్ల/షాద్‌నగర్/కేశంపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావుతో పాటు తెలంగాణ యువతి వన్నాడ విజయలక్ష్మి(36) అలియాస్ భూమిక కూడా మృతి చెందింది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కూడా భూమిక కీలక పాత్ర పోషించింది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం వేములనర్వకు చెందిన వన్నాడ సాయిలు, రాధమ్మకు ముగ్గురు ఆడపిల్లలు. మూడో సంతానమైన భూమిక పుట్టిన ఏడాదికే తల్లి పాము కాటుతో మరణించింది. భూమిక కేశంపేటలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. చదువుకుంటూనే ఇంట్లో పిల్లలకు ట్యూషన్లు చెప్పేది. మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. 2009-10లో హైదరాబాద్‌లోని ఓయూలో పీజీ పొలిటికల్ సైన్స్‌లో చేరింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంది. పలుమార్లు జైలుకూ వెళ్లింది. పోలవరం ముంపునకు గురవుతున్న ఆదివాసీ గూడేలను సందర్శించి, వారి కష్టాలకు చలించిపోయింది. అదే ఆమెపై ప్రభావం చూపిందని సన్నిహితులంటున్నారు. 2013-14 మధ్యకాలంలో విజయలక్ష్మి అజ్ఞాతంలోకి వెళ్లింది. మావోయిస్టు పార్టీలో చేరిన మొదటి రోజు విషయాలను 'వసంత మేఘం' అనే వెబ్‌సైట్‌లో ఓ కథను రాసింది. తానెందుకు గెరిల్లాగా మారాననే విషయాలతో పాటు ఓయూలో జరిగిన ఉద్యమాన్ని గుర్తు చేసుకుంది. విజయలక్ష్మి దాదాపు 12 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీలో పనిచేసి, చివరికి ప్రధాన కార్యదర్శి నంబాల రక్షణ బృందంలో ఉంటూ మరణించింది. విజయలక్ష్మి మృతిపై ఓయూ జేఏసీ నేతలు దిగ్భ్రాంతికి గురయ్యారు. తెలంగాణ ఉద్యమంలో ఆమెతో కలిసి చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. అయితే, 13 ఏళ్ల కిందట హైదరాబాద్ వెళ్లిన విజయలక్ష్మి ఎక్కడుందో.. ఏం చేస్తుందో తండ్రికి, బంధువులకు తెలియదు. ఎన్నడూ తనను పలకరించలేదని.. కనీసం ఫోన్ కూడా చేయలేదని తండ్రి సాయిలు తెలిపారు. ఆమె మావోయిస్టుల్లో చేరిన విషయం కూడా తెలియదని, మృతి చెందింది విజయలక్ష్మా? కాదా? అన్నది కూడా సమాచారం లేదని బంధువులు చెప్పారు. అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేశవరావుతో పాటు తెలంగాణ, ఏపీకి చెందిన నలుగురు చనిపోయారు. వీరిలో జంగు నవీన్ అలియాస్ మధు ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నాడు. ఇతని స్వస్థలం ప్రకాశం జిల్లా. అలాగే సంగీత, భూమిక తెలంగాణ వాసులని పోలీసులు చెబుతున్నారు. అలాగే యుగేంద్ర అలియాస్ వివేక్‌ది తెలంగాణ అని పేర్కొన్నారు.

నంబాల ఎన్‌కౌంటర్‌తో బలగాల సంబరాలు

అబూజ్‌మడ్ అడవుల్లో ఎన్‌కౌంటర్ జరిగిన అనంతరం నారాయణపూర్ జిల్లాకు చెందిన డీఆర్‌జీ బలగాలు సంబరాలు చేసుకున్నాయి. మృతదేహాల ఎదుట అడవిలో డ్యాన్సులు వేశారు. గురువారం సాయంత్రం నారాయణపూర్ జిల్లా పోలీస్ కేంద్రంలోనూ డీజేలు పెట్టుకొని నృత్యాలు చేశారు. బలగాల కుటుంబ సభ్యులు వారికి తిలకాలు దిద్దారు.

ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టుల మృతి

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల్లో రెండు ఎన్‌కౌంటర్లు జరిగాయి. మహారాష్ట్రలోని గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు, సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు మృతి చెందారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో 24 మంది, దంతెవాడలో 9 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

నక్సల్స్ మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించాలి

- పలు ప్రజా సంఘాల నేతల డిమాండ్
- కగార్‌ను నిలిపి వేయాలంటూ గవర్నర్‌కు గద్దర్ సతీమణి, కూతురు వెన్నెల వినతి



మాట్లాడుతున్న విమల, వెన్నెల

బర్కత్‌పుర/పంజాగుట్ట/మిర్యాలగూడ, మే 23 (ఆంధ్రజ్యోతి): నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో అమరులైన మావోయిస్టుల మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలని పలు ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో అమరుల బంధుమిత్రుల సంఘం నేత భవాని, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఐఎఫ్‌టీయూ నేత అనురాధ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమప్రతినిధి రాజు, అరుణోదయ సాంస్కృతిక ప్రతినిధి పోతుల సురేశ్‌తో పాటు తెలంగాణ ప్రజా ఫ్రంట్, ఐపీఎల్ తదితర సంఘాల నేతలు మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని, చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలకు బంధువుల సమక్షంలో శవ పంచనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా, మానవతా దృక్పథంతో ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను దివంగత గద్దర్ సతీమణి విమల, కూతురు వెన్నెల కోరారు. ఈమేరకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. కాగా, ఆపరేషన్ కగార్ విషయంలో మానవ హక్కులవేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్)మౌనం వహించడం క్షమించరానిదని ఆ సంస్థ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పి.సుబ్బారావు అన్నారు. మాట్లాడాల్సిన సమయంలో హెచ్‌ఆర్‌ఎఫ్ మౌనం వహించినందుకు నిరసనగా ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు, ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన నంబాల కేశవరావు, సజ్జా వెంకట నాగేశ్వరరావు మృత దేహాలను తనకు అప్పగించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులు శుక్రవారం హైకోర్టులో హౌజ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు.



నదికి నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితులు

కాళేశ్వరంలో నవరత్న మాల హారతి!

- ఏకాదశి సందర్భంగా కాశీ వేదపండితుల నిర్వహణ
- 9వ రోజు సరస్వతి పుష్కరాలకు 1.30 లక్షల మంది భక్తులు

భూపాలపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం త్రివేణి సంగమంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఏకాదశి కావడంతో కాశీ నుంచి వచ్చిన వేద పండితులు కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో ప్రత్యేకంగా నవరత్న మాల హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హంపి పీఠాధిపతి విరుపాక్ష విద్యారణ్య స్వామీజీ 9వ రోజు పుష్కర కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై సరస్వతి నదిలో పుణ్యస్నానం చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. శుక్రవారం 1.3 లక్షల మంది భక్తులు తరలిచ్చి పుణ్యస్నానాలు చేశారు. వర్షంతో వాహనాలు బురదలో దిగబడే ప్రమాదం ఉండటంతో అన్నారం క్రాస్ నుంచి పూస్కుపల్లి మీదుగా ప్రైవేటు వాహనాలను కాళేశ్వరం పార్కింగ్ స్థలాలకు మళ్లించారు. ఉదయం దాదాపు రెండు గంటల పాటు పుస్కుపల్లి వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడినా అధికారులు స్పందించి క్రమబద్ధీకరించారు.

రోడ్డెక్కిన అన్నదాతలు

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

- పలు జిల్లాల్లో ఆందోళనలు
- తడిసిన సన్నధాన్యం బాయిల్డ్ విల్లింగ్‌కు ప్రభుత్వ అనుమతి
- నిజామాబాద్, వరంగల్ జిల్లాలకు ప్రత్యేక ఉత్తర్వులు



కుమరం భీం జిల్లా సిర్పూర్(టి)లో రైతులతో కలిసి బైఠాయించిన ఎమ్మెల్యే హరీశ్ బాబు

హైదరాబాద్, జగిత్యాల, సిర్పూర్(టి), ఆర్మూర్ టౌన్/ఖానాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో రాష్ట్రంలోని అన్నదాతలు రోడ్డెక్కారు. తడిసిన ధాన్యాన్ని రహదారిపై పోసి రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. జగిత్యాల, ఆసిఫాబాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో శుక్రవారం ఈ ఆందోళనలు జరిగాయి. జగిత్యాల జిల్లా సింగరావుపేట, తిప్పన్నపేట, గోపాలరావుపేట గ్రామాల్లో రైతులు రాస్తారోకో చేశారు. అలాగే, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం పారి గాంలోని సిర్పూర్(టి)- కౌటాల ప్రధాన రహదారిపై రైతులు చేపట్టిన రాస్తారోకోకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మద్దతు తెలిపారు. మరోపక్క, నిజామాబాద్ జిల్లా మామిడిపల్లిలోని గోవింద్‌పేట్ రోడ్డులో రైతులు ధర్నా చేశారు. అలాగే, నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ వద్ద ఖానాపూర్-మెట్‌పెల్లి రహదారిపై సుర్జాపూర్, మస్కాపూర్, బాదనకుర్తి గ్రామాల రైతులు బైఠాయించారు. కొనుగోళ్లను ప్రారంభించేలా చర్యలు తీసుకోవడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, వర్షాలకు తడిచిన సన్నధాన్యాన్ని ముడిబియ్యంగా కాకుండా బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం)గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 13,850 టన్నుల ధాన్యాన్ని ఉప్పుడు బియ్యంగా మార్చేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ బియ్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) రూపంలో ఎఫ్‌సీఐకి అప్పగించాలని నిర్ణయించింది. నిజామాబాద్, వరంగల్ కలెక్టర్ల ప్రతిపాదనల మేరకు పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ప్రసాద్ ఆ జిల్లాల వరకు శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

ప్లేస్‌మెంట్స్‌లో వరంగల్ నిట్ అద్భుతాలు

- 79.7 శాతం మందికి ప్లేస్‌మెంట్
- సోమిల్ మాల్దానికి రూ.64.3 లక్షల ప్యాకేజీ



సోమిల్ మాల్దాని

హనుమకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ కళాశాల ప్లేస్‌మెంట్స్‌లో అద్భుత ఫలితాలను సాధించింది. ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థుల్లో 79.7శాతం మందికి ఉద్యోగాలు లభించాయి. సోమిల్ మాల్దాని (సీఈసీ) అనే విద్యార్థికి రూ.64.3లక్షల గరిష్ఠ వేతన ప్యాకేజీ లభించింది. ఈ సంవత్సరం 290కిపైగా పేరున్న సంస్థలు క్యాంపస్‌ను సందర్శించాయి. ఈ ఏడాది మొత్తం 1,508 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ కోసం నమోదు కాగా, వీరిలో 791 మంది అండర్ గ్రాడ్యుయేట్‌లు, 717 మంది పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మొత్తం 1201 మంది ఉద్యోగాలు పొందారు. యూజీలో 679 మంది, పీజీలో 522 మంది ఉద్యోగాలు పొందినవారిలో ఉన్నారు. మొత్తంగా ప్లేస్‌మెంట్స్ రేటు 79.7 శాతంగా ఉంది. గత సంవత్సరం 76శాతం ప్లేస్‌మెంట్స్‌తో పోల్చితే 3.7 శాతం ఎక్కువ. యూజీ విద్యార్థులకు 85.8 శాతం, పీజీ విద్యార్థులకు 72.8 శాతం ప్లేస్‌మెంట్స్ రేటు నమోదైంది. ఈ సంవత్సరం గరిష్ఠంగా రూ.64.3లక్షల వేతన ప్యాకేజీని సోమిల్ మాల్దాని పొందారు. ఆయన ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ (ఎస్‌డీఈ)గా ఉద్యోగం సాధించారు. మొత్తం విద్యార్థులందరికీ సగటు ప్యాకేజీ రూ.14.35లక్షలు ఉండగా యూజీ విద్యార్థులకు రూ.16లక్షలు, పీజీ విద్యార్థులకు రూ.12.20 లక్షలు ఉంది. తొలిసారిగా పీహెచ్‌డీ విద్యార్థుల ప్లేస్‌మెంట్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రత్యేక ప్రయత్నాలు చేపట్టగా ఆరుగురు పీహెచ్‌డీ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. వీరి సగటు ప్యాకేజీ రూ.9లక్షలుగా ఉంది. కాగా ప్లేస్‌మెంట్ విజయాలు తమ వ్యూహాత్మక దృష్టి, విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది అని వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుద్ధి పేర్కొన్నారు. ఈ విజయానికి సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెట్ వివిధ విభాగాల వారీగా నిర్వహించిన పూర్వ శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని సీసీపీడీ అధిపతి ప్రొఫెసర్ పి.హరికృష్ణ పేర్కొన్నారు.

210 కిలోల గంజాయి పట్టివేత.. నలుగురి అరెస్టు

వరంగల్ క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 210 కిలోల ఎండు గంజాయిని వరంగల్ నార్కోటిక్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.1 కోటి 5 లక్షల 38 వేల వరకు ఉంటుందని వారు పేర్కొన్నారు. గంజాయి తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసి, వారు ఉపయోగించిన ట్రాక్టర్, కారు, 5 సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు నార్కోటిక్స్ డీఎస్పీ కె.సైదులు తెలిపారు. నార్కోటిక్స్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరణిస్తున్న మానవత

గాజా మొత్తాన్ని ఖాళీచేయిస్తాం, పసిపిల్లలను కూడా వదిలేది లేదంటూ ఇజ్రాయెల్ పాలకులు చేస్తున్న ప్రకటనలు, తదనుగుణంగా మరింత హెచ్చుస్థాయిలో అమానుషంగా సాగుతున్న దాడులు మానవత్వం ఉన్నవారి మనసులు కలిచివేస్తున్నాయి. అత్యంత ఘోరమైన, క్రూరమైన పరిస్థితులను గాజా ఎదుర్కొంటున్నదని, కాస్తంత దయతలచాలని ఇజ్రాయెల్ ప్రధానిని ఐక్యరాజ్యసమితి అధినేత బతిమాలుతున్నారు. గురు,శుక్రవారాల్లో ఇజ్రాయెల్ దాడుల్లో 140మంది పాలస్తీనియన్లు చనిపోతే, ఆకలి మరో నలభైమందిని చంపేసింది. ఆయుధాలతో పాటు ఆకలిని కూడా మారణాయుధంగా ప్రయోగించి ప్రాణాలు తీస్తున్న నెతన్యాహూను అమెరికా మాత్రమే ఆపగలదన్నట్టుగా మిగతాప్రపంచం, మరీముఖ్యంగా అరబ్‌దేశాలు చేతులెత్తేయడం ఆశ్చర్యం, అమానుషం.

దాదాపు వందరోజులైంది గాజాలోకి ఆహారం అడుగుపెట్టి. వేలాదిమంది పిల్లలు చావుఅంచున ఉన్నా ఇజ్రాయెల్ అధినేతకు మనసు కరగ లేదు. గాజాలో ప్రవేశం కోసం సరిహద్దుల్లో నిరీక్షిస్తున్న ఆహారపు ట్రక్కులను ఆయన లోపలకు రానివ్వలేదు. అస్త్రాలతో పాటు, ఆకలిని కూడా వాడి ఒక్క పసిగుడ్డును కూడా గాజాలో మిగలనివ్వకుండా మొత్తం ఖాళీచేయించే దిశగా ఆయన పావులుకదుపుతున్నాడు. గాజాను స్వాధీనం చేసుకొని, ఖాళీచేయించి, దానిని ఒక టూరిస్టు రిసార్టుగా మార్చేందుకు అమెరికాకు అప్పగించడం కోసమే ఈ ఊచకోత కొనసాగుతోందన్నది స్పష్టం. కాల్పుల విరమణ ఒప్పందం చక్కగా అమలుజరుగుతూ, తనవద్ద ఉన్న బందీలను అనుకున్నప్రకారం హమాస్ సవ్యంగా అప్పగిస్తున్న దశలో, అమెరికా అధ్యక్షుడు తన మనసులో మాట చెప్పడం, ఆ కాస్తంత శాంతినీ బద్దలు కొడుతూ, ఒక అర్ధరాత్రివేళ ఇజ్రాయెల్ మారణాయుధాలతో విరుచుకుపడి ఒకేరోజు ఏకంగా ఆరువందల మందిని హతమార్చడం చూశాం. అలా ఆరంభమైన ఆ ప్రయత్నం నానాటికీ మరింత దుర్మార్గంగా, అమానుషంగా అమలు జరుగుతోంది. ట్రంప్ కళ్ళలో ఆనందం చూడటానికి, ఆయన అనుమతితోనే ఈ మారణకాండను మళ్ళీ మొదలెట్టానని అప్పట్లో చెప్పిన నెతన్యాహూ ఇప్పుడు అదే ఆప్తమిత్రుడి కోరిక మీద కాసిన్ని ఆహారధాన్యాలు గాజాలోకి అనుమతించాలని నిర్ణయించుకున్నారు. ఆకలిచావుల చిత్రాలు చూడటానికి ట్రంప్ దొరవారు ఇష్టపడకపోవడంతో కడివెడు అవసరమైనచోటకు ఒక గరిటెడు పంపడానికి నెతన్యాహూ సరేనన్నారు.

ఐదునెలల తరువాత విలేకరుల సమావేశంలో మాట్లాడిన నెతన్యాహూ గాజా మొత్తం ఖాళీ అయ్యేదాకా యుద్ధం ఆగదంటూ ఒకేఒక్కముక్కలో అసలు విషయాన్ని తేల్చేశారు. అమెరికా అధ్యక్షుడి ఆలోచన అద్భుతం, అమోఘం అని తెగమెచ్చుకుంటూ, ఇది పశ్చిమాసియా తీరుతెన్నులనే మార్చేస్తుందన్నారు. లక్ష్యసాధనలో కచ్చితంగా విజయం సాధిస్తామని, ఏడాదిన్నరలోనే అనుకున్నది సాధిస్తానని అంటున్నారు. ఇప్పటికే ఓ అరవైవేలమంది సామాన్యులను ఊచకోతకోసి, సగటున రోజుకోవందమందిని హతమారుస్తున్న నెతన్యాహూ ఈ లక్ష్యసాధనకోసం మరింత దుర్మార్గంగా ప్రవర్తించబోతున్నారని అర్థం. ఇజ్రాయెల్‌మీద దాడిచేసిన హమాస్‌ను దుంపనాశనం చేస్తానంటూ ఆరంభించిన ఈ యుద్ధాన్ని ఆయన ఇంకా అవేమాటలు వాడుతూ మరో అవసరం కోసం కొనసాగిస్తున్నారు. లక్షలాదిమంది ప్రాణాలను, జీవితాలను ఇజ్రాయెల్‌కు బలిపెట్టిన హమాస్‌ను ఇప్పటివరకూ నెతన్యాహూ ఎంత మేరకు దెబ్బతీయగలిగారో తెలియదు కానీ, గాజామొత్తం నామరూపాల్లేకుండా పోయింది. కంటిఎదుట కన్నబిడ్డలు కన్నుమూస్తున్నా ఏడ్చే ఓపికలేని తల్లులు, ఆకలితో మరణిస్తున్న పిల్లలూ వృద్ధులతో స్మశానంలాగా మారిన గాజాలో ఒక్క ఆస్పత్రిని కూడా మిగలనివ్వలేదు నెతన్యాహూ. బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలకు కాస్తంత మనసుకరిగి, ఆగ్రహం కలిగి, వాణిజ్యచర్చలను బందుపెట్టినందువల్ల ఇజ్రాయెల్ అధినేత ఈ కాస్తంతైనా దిగివచ్చి, నాలుగుమెతుకులు అందించడానికి ఒప్పుకున్నాడు. అంతే కాని, గాజావాసులకు కడుపునిండా అన్నంపెట్టి, పుట్టినచోటే ఉండనిచ్చే ఆలోచన తనకు లేదని ఆయన తేల్చేశాడు. అగ్రరాజ్యాధినేత అభీష్టానికి అనుగుణంగా, ఆకలితో పూర్తిగా చావనివ్వకుండా ఉంచి, ఆయుధాలతో మిగతాపని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు ఆయన.

ఇప్పుడు అంబేడ్కర్ ఉంటే ఏం చేసేవారు?

మావోయిస్టులది ప్రకటిత హింసామార్గం. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలూ లేవు. హింసామార్గాన్ని చేపట్టిన మావోయిస్టుల్ని హింసతోనే అంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. కగార్, బ్లాక్ ఫారెస్ట్ తదితర ఆపరేషన్లు ఆ లక్ష్యంతోనే పనిచేస్తున్నాయి. ఈ విషయంలోనూ ఎవరికీ ఎలాంటి సందేహాలూ లేవు. అయితే, ప్రభుత్వం చేపట్టిన హింసామార్గం రాజ్యాంగ ఆదర్శాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా? లేదా? అన్నది వర్తమాన ప్రజాస్వామిక వాదుల్ని కుదిపేస్తున్న సందేహం.



అంబుజ్‌మడ్‌లోని నారాయణ్‌పూర్ అడవుల్లో మే 21న సీపీఐ –మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును భద్రతాదళాలు హతమార్చాయి. ఆయనతో పాటు మరో పాతికమంది స్త్రీ–పురుష మావోయిస్టుల్నీ మట్టుబెట్టారు. ఈ సంఘటనపై ఎక్స్ వేదిక మీద స్పందించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా, “నక్సలిజాన్ని నిర్మూలించే పోరాటంలో ఇది ఒక మైలురాయి విజయం” అన్నారు.

హింసావాదుల్ని హింసతోనే అంతం చేయడం ధర్మబద్ధమే అని కొందరు అనవచ్చు. కేంద్ర హోం మంత్రి ప్రకటనలు కొందరికి సమంజసంగా అనిపించవచ్చు. మరికొందరికి గొప్ప ఉత్సాహాన్ని కూడ కలిగించవచ్చు. ఇంకొందరు ఉన్మాదంతో ఊగిపోనూ వచ్చు. కమ్యూనిస్టుల్ని చీదరించుకునేవారో, విప్లవ వ్యతిరేకులో అలా అనుకుంటే అదో ఇది. కానీ, ప్రజలకూ ప్రభుత్వానికి మధ్య భారత రాజ్యాంగం అనే ఆధునిక పవిత్రగ్రంథం ఒకటుందని మరచిపోవడం ఆలోచనాపరులకు సమంజసం కాదు. రాజ్యాంగ ప్రకటిత ఆదర్శాలను మార్గదర్శకాలనూ ప్రభుత్వాలు సరిగ్గా పాటిస్తే తిరుగుబాట్లు తలెత్తాల్సిన అవసరమే ఉండదు. ప్రభుత్వాలు రాజ్యాంగ ఆదర్శాలను తుంగలో తొక్కినపుడే తిరుగుబాట్లు తలెత్తుతాయి. ఇది అందరికీ తెలిసిన సమాజ నియమం.

జాతీయోద్యమ కాలంలోనే రాజకీయాల్లో రెండు స్రవంతులు ఏర్పడ్డాయి. మనం ఎంతగానో ఉద్వేగ భరితంగా తలచుకునే భగత్‌సింగ్, అల్లూరి శ్రీరామ రాజు, ఉద్ధామ్‌సింగ్ తదితరులది బాహాటంగా హింసామార్గం. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌లది అహింసామార్గం. వాళ్ళ మధ్య అభిప్రాయ బేధాలు, ఇతర వివాదాలు కూడ ఉండవచ్చుగాక; ఉన్నాయి కూడ. అయితే, అంతిమంగా వాళ్ళది అహింసా మార్గం. చాలామంది వాళ్ల మధ్య ఘర్షణను మాత్రమే చూస్తుంటారు గానీ ఐక్యతను చూడరు. ఇదొక సెలెక్టివ్ విజన్.

రాజ్యాంగ రచన సాగుతున్న కాలంలోనే పొరుగు దేశం చైనాలో రక్తపాత విప్లవం విజయవంతమై ఒక రకం సామ్యవాద సమాజం ఏర్పడింది. మనదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ సాయుధపోరాట పంథాను కొనసాగిస్తున్నది. పైగా, అల్లూరి, భగత్‌సింగ్‌ల మీద ప్రజలకు ఆరాధనాభావం ఉంది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వాల పనితీరుతో విసిగిపోయిన ప్రజలు సాయుధులై తిరగబడే ప్రమాదాన్ని నివారించాలనేది భారత రాజ్యాంగ రచనకు ప్రధాన లక్ష్యంగా మారింది. రాజ్యాంగ రచనా కమిటీ ఛైర్మన్ బిఆర్ అంబేడ్కర్ ఇదే విషయాన్ని ఇంకో పద్ధతిలో చెప్పాడు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత.. ముందు రాజకీయరంగంలో సమానత్వాన్ని సాధిస్తుంది. ఆ తరువాత, భావి ప్రభుత్వాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించడానికి ప్రత్యేకంగా ప్రయత్నించాలి అన్నాడు. పాలకులు అలా చేయకపోతే, వివిధ రంగాల్లో కొనసాగుతున్న అసమానత్వానికి బాధితులైనవారు తిరగబడి ఏకంగా ‘ప్రజాస్వామ్య భవనాన్ని’ పేల్చేస్తారు అని హెచ్చరించాడు.

వివిధ రంగాల్లో కొనసాగుతున్న అసమానత్వాన్ని రూపుమాపని ప్రభుత్వాలను మనం ఏమీ అనం. వాళ్ళు అసమానత్వాన్ని పెంచిపోషిస్తున్నా అభ్యంతరం చెప్పం. అసమానత్వం మీద తిరగబడే ప్రజల్ని మాత్రం దోషులుగా, దారి తప్పినవారిగా, హింసావాదులుగా, నైరాశ్యంలో కూరుకుపోయినవారిగా నిందార్థంలో చూస్తాం. మన ఆలోచనల్లో ఇదొక ద్వంద్వం.

19వ శతాబ్దం చివర్లో మద్రాసు–కలకత్తా ఈస్ట్ కోస్ట్ రైల్వే లైన్ నిర్మించడానికి, దారి కోసం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆదివాసుల్ని అడవి నుంచి తరిమేసింది. రైలు పట్టాల కింద వేసే చెక్క స్లీపర్ల కోసం తూర్పు కనుమల్లోని అడవుల్ని విచక్షణా రహితంగా నరికి వేసింది. అడవిని కోల్పోయి, రోడ్డు నిర్మాణ కూలీలుగా మారిన ఆదివాసుల్ని అణా (6 నయాపైసలు), అర్ధణా (3 నయాపైసలు) వేతనం ఇవ్వడానికి కూడ వేధించింది. అణిచివేత ఈ స్థాయికి చేరుకోవడంతో అత్యంత సహజంగానే మన్యంలో తిరుగుబాటు తలెత్తింది.

మన్యంకు వాయువ్య దిశలోనే బస్తర్ ఉంటుంది. అక్కడా అప్పట్లో మన్యం వంటి తిరుగుబాట్లు సాగాయి. అక్కడా అల్లూరి వంటి పోరాట వీరులు పుట్టుకొచ్చారు. అక్కడి ఆదివాసులు ఇప్పటికీ ఆ వీరుల్ని ఏడాదికి ఒకసారైనా తలుచుకుంటుంటారు. ఇప్పుడూ బస్తర్‌లో వందేళ్ల నాటి వేధింపులు సాగుతున్నాయి. ఆదివాసుల్ని అడవుల నుంచి తరిమేసి అటవీ సంపదనీ, ఖనిజ వనరుల్ని అస్మదీయ కార్పొరేట్లకు అప్పగించేందుకు ఒక మహాయజ్ఞం అక్కడ సాగుతోంది. ఆదివాసులకు అప్పుడూ, ఇప్పుడూ అణిచివేత స్వీయ అనుభవమే. తెల్లవాళ్ళ మీద తిరగబడడం న్యాయమేగానీ, నల్లవాళ్ల మీద తిరగబడడం అన్యాయం అని ఆదివాసులకు మన మైదానవాసులు హితవు చెపుతారా?

అల్లూరిని చంపినపుడూ ఇంగ్లండులో సహితం మారుమోగేలా అదొక మైలురాయి విజయం అంటూ చాలా గట్టిగానే వికటాట్టహాసం చేశారు బ్రిటిష్ అధికారులు. భగత్‌సింగ్‌ను ఉరి వేసిన తరువాత 1931 ఏప్రిల్ 13 నాటి జనతా వార్తాపత్రికలో ‘ముగ్గురు బాధితులు’ శీర్షికతో అంబేడ్కర్ ఒక వ్యాసం రాశాడు. న్యాయదేవత మీద భక్తివిశ్వాసాలతో వాళ్ళీ పని చేయలేదు; ఇంగ్లండ్‌లోని కన్జర్వేటివ్ పార్టీ పెద్దల్నీ,



బస్తర్ ఆదివాసులు మావోయిస్టులుగా మారాలని ఏమీ అనుకోలేదు. అణిచివేతను అడ్డుకోవాలనుకున్నారు. అందుబాటులో మావోయిస్టులు ఉన్నారు కాబట్టి వాళ్లలో చేరారు. రేపు మరొకరితో చేతులు కలపవచ్చు. ఆయుధాలను చేపట్టడాన్ని తప్పుపడుతున్నవాళ్ళు అణిచివేతనూ తప్పుపట్టాలి. లేకుంటే మనలోనే ఏదో తప్పు ఉన్నట్టు లెక్క.

అక్కడి మూర్ఖులయిన జనాన్నీ సంతృప్తిపరచడానికి ఒక బలిదానాన్ని ఉరికంబం ఎక్కించారన్న వాస్తవం ఈ ప్రభుత్వానికే కాదు; మొత్తం ప్రపంచానికి కూడ స్పష్టంగా తెలుసు అంటూ తీవ్రంగా విమర్శించాడు. ఇప్పుడు నంబాల కేశవరావును చంపి, సరిగ్గా అలాంటి ప్రకటనలే చేస్తున్నారు ఏలినవారు. ఇప్పుడు అంబేడ్కర్ ఉంటే ఏం రాసేవాడో?

చరిత్ర ఒక ప్రహసనంగా పునరావృతం అవుతోందో లేదో గానీ, మన మధ్యనే మరో ప్రపంచం, మరో సమాజం, మరో జాతి, మరో తెగ కొనసాగుతున్నాయని గుర్తించకపోవడం మాత్రం మన కాలపు విషాదం.

రాజ్యాంగం తొలి ప్రతిలో ప్రజాస్వామ్యం అనే ఆదర్శం ఒక్కటే ఉంది. దానికి మరింత వివరణ ఇస్తూ, దాని పరిధిని పెంచుతూ సామ్యవాద, మత సామరస్య రాజ్యాంగం అని పునర్ నిర్వచించుకున్నాం. ఆ తరువాత లెక్క ప్రకారం ప్రజల కష్టాలు తగ్గిపోవాలి. కానీ, అలా జరగడంలేదు. రాజ్యాంగాన్ని నెత్తిన పెట్టుకుని మోస్తున్నవారు, పార్లమెంటు భవన మెట్లను ముద్దాడుతున్నవారు అనుక్షణం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు. దేశ సంపదలో 70 శాతం కేవలం పది శాతం కుటుంబాల చేతుల్లో ఉందట. 40 శాతం సంపద ఒక శాతం కుటుంబాల చేతుల్లో ఉందట. 70 నుంచి 80 శాతం జనాభా కేవలం 3 శాతం దేశ సంపదతో జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నది. రాజ్యాంగ ఆదర్శమయిన సామ్యవాదాన్ని ఇంతగా అపహాస్యం చేస్తున్నది ఎవరూ?

దేశంలో మతసామరస్యం గురించి ఇక చెప్పనక్కరలేదు. దేశంలోని ఒక సమూహాన్ని బాహాటంగా శత్రువర్గం జాబితాలో పడేశారు. ఒక చట్టం తెచ్చి వాళ్ళ పడకగదుల్లోకి ప్రవేశించారు. ఇంకో చట్టం తెచ్చి వాళ్ళ పౌరసత్వాన్ని సందిగ్ధంలో పడేశారు. మరో చట్టంతో వాళ్ళ ఆస్తి హక్కుని నిరాకరిస్తామన్నారు. వాణిజ్య కూడళ్ళలో హాకర్లు, చిరు వ్యాపారులుగా మారి, కాస్త ఊపిరి పీల్చుకుంటున్నా సహించలేక వాళ్ళ బతుకుల్ని బుల్‌డోజర్లతో నేలమట్టం చేస్తున్నారు. అయినా, మతసామరస్యం అనే అక్షరాలు రాజ్యాంగంలో మెరుస్తూనే ఉన్నాయి. ఇంతటి వైరుధ్యాన్ని భరించడం మనుషులకు ఎక్కువ కాలం సాధ్యం కాకపోవచ్చు.

మైదాన ప్రాంతాల్లో ముస్లింలను భయపెట్టి కొత్త అస్పృశ్యులుగా మార్చాలనీ, అడవుల్లో ఆదివాసుల్ని తుడిపెట్టేయాలనీ ఏలినవారు ఒక దృఢ నిశ్చయంతో ఉన్నట్టు ఇప్పుడు అందరికీ స్పష్టంగానే కనపడుతోంది. చర్యల మీద మనకు అభ్యంతరాలు లేనపుడు ప్రతిచర్యల మీద మాత్రమే అభ్యంతరాలుండడం సబబు కాదు.

బస్తర్ ఆదివాసులు మావోయిస్టులుగా మారాలని ఏమీ అనుకోలేదు. అణిచివేతను అడ్డుకోవాలనుకున్నారు. అందుబాటులో మావోయిస్టులు ఉన్నారు కాబట్టి వాళ్లలో చేరారు. రేపు మరొకరితో చేతులు కలపవచ్చు. ఆయుధాలను చేపట్టడాన్ని తప్పుపడుతున్నవాళ్ళు అణిచివేతనూ తప్పుపట్టాలి. లేకుంటే మనలోనే ఏదో తప్పు ఉన్నట్టు లెక్క. నారాయణపూర్ మృతుల ఫొటోల్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పుడు సర్వత్రా అవి అందుబాటులో ఉన్నాయి. వాళ్ళ తలలకు గురిపెట్టి తుపాకులు కాల్చినట్టు చాలా స్పష్టంగా కనిపిస్తున్నది.

రాజ్యాంగం చెడ్డదయినా సరే అమలు చేసేవాడు మంచోడయితే అది మంచిదయిపోతుంది. రాజ్యాంగం మంచిదయినా సరే అమలు చేసేవాడు చెడ్డోడయితే అది చెడ్డదయిపోతుంది అని అంబేడ్కరే అన్నాడు. ఇప్పుడు అంబేడ్కర్ ఉంటే ఏం చేసేవాడో?

▪ డానీ
సమాజ విశ్లేషకులు

మోదీపై అక్కసుతోనే ఇన్ని అవాస్తవాలు!

‘తిరోగమనంలో పురోగామి భారత్’ శీర్షికతో మే 17వ తేదీన రామచంద్ర గుహ రాసిన వ్యాసంలో మోదీ ప్రభుత్వ వ్యతిరేకత, హిందూ సమాజంపై ద్వేషం కొట్టొచ్చినట్లు కనపడుతున్నాయి. తమ మత ఔన్నత్యం ఉత్కృష్టమైనదని హిందూ మత దురభిమానులు విశ్వసిస్తారని గుహ అన్నారు. వాస్తవంగా హిందూ మతానికి సంబంధించిన ఏ గ్రంథాలైనా, ఏ పీఠాధిపతి అయినా హిందూ మతమే అన్ని మతాల కంటే శ్రేష్ఠమైనదని, ఈ మతాన్ని అనుసరిస్తే మాత్రమే స్వర్గానికి అర్హత పొందుతారని చెప్పలేదు. మన మహర్షులు ‘ఏకం సత్ విప్రా బహుదా వదన్తి’ (సత్యం అంటే భగవంతుడు ఒక్కడే, ఆయనను అనేక రూపాల్లో కొలుచుకోవచ్చు) అని ఉద్బోధించిన మార్గాన్ని హిందూ సమాజం నేటికీ అనుసరిస్తూనే ఉంది. హిందువులకు ఉండే ఈ ఔన్నత్యమే మైనారిటీలైన ముస్లింలు, క్రైస్తవులు హిందూత్వ విలువలను ద్వేషించడానికి, దూషించడానికి మార్గాన్ని సుగమం చేసిందంటే అతిశయోక్తి కాదేమో! మతం ఆధారంగా రెండు భూభాగాలు ఈ దేశం నుంచి విడిపోయిన తర్వాత ఈ దేశం లౌకిక విలువలకు పట్టం కట్టిందంటే, ఈ దేశంలో మెజారిటీ ప్రజలైన హిందువుల ఆలోచన విధానమే ఇందుకు ప్రధాన కారణం. ఈ విషయాన్ని ఒప్పుకొనే మానసిక స్థితి వ్యాసకర్త రామచంద్ర గుహకు ఉన్నట్లు కనిపించలేదు.

రిపబ్లిక్ సంస్థాపక విలువలైన ప్రజాస్వామ్యం, బహుళత్వవాదం ఈ దేశంలో ఆచరించబడలేదని ఒక పేరాలో చెప్పి, ఈ విలువలు సుస్థిరంగా ఉన్నాయని మరొక పేరాలో చెప్పడంలో ఆంతర్యం ఏమిటి? చెప్పాలనుకున్న విషయంలో స్పష్టత ఉండాలి కదా? భారత రాజ్యాంగం పురాతన హిందూ రాజరికపు నమూనాను తిరస్కరించిన మాట వాస్తవమే. కానీ ఆచరణలో 1947 నుంచి 2014 వరకు ఈ దేశంలో ప్రజాస్వామ్యం పేరుతో కుటుంబ పరిపాలన కొనసాగిందనే విషయం దేశ ప్రజలకు బాగా ఎరుక. ఇక మతాన్ని రాజ్య వ్యవస్థలో మిళితం చేయలేదని చెప్పడం పచ్చి అబద్ధం. మతం ఆధారంగానే దేశాన్ని పంచారు. కొన్ని మతాల వాళ్లకు ప్రత్యేక చట్టాలు కూడా తయారు చేసి ఇచ్చారు. రాజ్యాంగం సాక్షిగా ప్రజలందరూ కట్టిన పన్నుల నుంచి వచ్చిన ఆదాయాన్ని ఒక మతం వారికి విదేశీ యాత్రలకు ఖర్చు చేయడం, రాష్ట్రపతి భవనాన్ని ఇఫ్తార్ విందులకు కేంద్రంగా మార్చడం మన ప్రజాస్వామ్యంలో భాగమే!



మతం ఆధారంగా రెండు భూభాగాలు ఈ దేశం నుంచి విడిపోయిన తర్వాత ఈ దేశం లౌకిక విలువలకు పట్టం కట్టిందంటే, ఈ దేశంలో మెజారిటీ ప్రజలైన హిందువుల ఆలోచన విధానమే ఇందుకు ప్రధాన కారణం. రామచంద్రగుహ వ్యాసంలో మోదీ ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది.

ఇక కశ్మీర్ సమస్యపై అంతర్జాతీయ సమాజం పాకిస్థాన్‌ను, ఇండియాను ఒకే గాటన కట్టేసి మాట్లాడడానికి కారణాలు ఉన్నాయి. అంతర్జాతీయ సమాజం అమెరికా చెప్పినట్లు వినాల్సిందే. అక్కడ ప్రభుత్వంలో ట్రంప్ ఉండొచ్చు మరొకరు ఉండొచ్చు. అమెరికాకు భారత్ కంటే పాకిస్థాన్ ప్రియమైన దేశం. దక్షిణాసియాలో అమెరికా పెత్తనం కొనసాగాలంటే పాకిస్థాన్‌కు ఆ దేశ సహాయ సహకారాలు అందాల్సిందే. మరొక కోణంలో భారత్ ఆర్థికంగా ఎదగడం అమెరికాకు ఇష్టం ఉండదు. క్రయోజనిక్ టెక్నాలజీని రష్యా మనకు ఇవ్వకుండా అమెరికా మోకాలొడ్డింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితో 562 సంస్థానాలు సులభంగా విలీకరణ చెందితే, మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జోక్యంతో కశ్మీర్ సంస్థానం అంతర్జాతీయ సమస్యగా మారింది. ఈ కోణంలో ఆలోచిస్తే వాస్తవం బోధపడుతుంది.

కశ్మీర్ సమస్యపై పాకిస్థాన్ భారత్‌తో మూడు యుద్ధాలు కాదు, నాలుగు యుద్ధాలు చేసింది. ఇక పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్థాన్‌లోని తీవ్రవాద కేంద్రాలపై దాడి మాత్రమే చేసింది. దానిని యుద్ధంగా కొందరు స్వయంప్రకటిత మేధావులు, దేశ వ్యతిరేక మీడియా ప్రచారం చేయడం, ‘యుద్ధాన్ని నేనే నిలుపుదల చేసినాను’ అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు ఇచ్చుకోవడం బుద్ధి మాంద్యంగా భావించాలి. భారత సైన్యం జరిపిన లక్ష్య నిర్దేశిత దాడులకు బెదిరిపోయిన పాక్ నాయకులు, సైన్యం తోక ముడిచి ట్రంప్‌కు దాసోహం అయింది. ఈ విషయంలో తీవ్రవాద శిక్షణా కేంద్రాలు మాత్రమే తమ టార్గెట్ అని భారత్ ముందుగానే ప్రకటించింది ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకున్నది. ట్రంప్ మాటలు అబద్ధాలని ప్రపంచంలోని రాజకీయ విశ్లేషకులందరికీ తెలుసు. అన్ని విధాల చెడిపోయిన పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలని మోదీ ప్రభుత్వం కోరుకోలేదు. ‘నా మాట వినకపోతే వాణిజ్య సంబంధాలను తెంచేసుకుంటాన’ని ట్రంప్ చెప్పిన మాటలను భారత ప్రభుత్వం లెక్క చేయలేదు అనే విషయం ఇక్కడ గమనార్హం. పోఖ్రాన్ అణుపరీక్షల తర్వాత అమెరికా మన దేశంపై ఆర్థిక ఆంక్షలు విధించి, భంగపాటుకు గురైందనే విషయం ట్రంప్‌కు తెలుసు.

ఇక కశ్మీరు, ఈశాన్య రాష్ట్రాలలో రాజ్య హింస ఉందని చెప్పడం వాస్తవాలను దాచడమే. జమ్మూ కశ్మీర్‌లో వేర్పాటువాదుల దుశ్చర్యల వల్ల మూడు లక్షల మంది హిందువులు లోయ నుండి పారిపోయి వచ్చారు. అనేక మంది హిందువులు హత్య గావించబడ్డారు. ఇక నాగాలాండ్, మిజోరం, అస్సాం, మణిపూర్ రాష్ట్రాలలో అంతర్జాతీయ ప్రాయోజిత వేర్పాటువాద గ్రూపుల వల్ల అక్కడ హింస చెలరేగి, శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతున్నది. వాస్తవ విషయాలు ఇలా ఉంటే రాజ్య హింస అని బుకాయింపు ఏమిటి?

ఈ వ్యాసంలో అత్యంత సెలెక్టివ్ డిస్క్రిమినేషన్ ఎక్కడంటే– ఈ దశాబ్ది కాలంలో అంటే మోదీ ప్రభుత్వ హయాంలో భారతదేశం తిరోగమించిందని చెప్పడం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో తొమ్మిదవ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ ఐదవ స్థానానికి వచ్చింది. కరోనా విపత్కర పరిస్థితిని తట్టుకొని, గుణాత్మకమైన ఆర్థికాభివృద్ధిని సాధించింది. కరోనా టీకాలను అభివృద్ధి చేసి ప్రపంచ దేశాలకు అందించి, వసుధైక కుటుంబ భావనకు నాంది పలికింది మోదీ ప్రభుత్వం అనే విషయం దేశాన్ని ప్రేమించే వాళ్లకు మాత్రమే తెలుస్తుంది.

ఇక పహల్గాం దాడి తర్వాత కశ్మీర్‌లో అమాయకులపై కేసులు బనాయించి ఇబ్బంది పెడుతున్నారని చెప్పడం వ్యాసకర్త వక్రబుద్ధికి పరాకాష్ఠ! తీవ్రవాద కార్యకలాపాలలో పాలు పంచుకున్న వారిని మాత్రమే ప్రభుత్వం అరెస్టు చేసింది. వాస్తవంగా కశ్మీర్‌లో వేర్పాటువాదులు, తీవ్రవాదులు పేట్రేగిపోవడానికి ప్రధాన కారణం కశ్మీరీ ముస్లింల భారత వ్యతిరేకత.

మోదీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ వ్యతిరేక హిందువులు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముస్లిములను రెచ్చగొట్టే పనిలో ఉన్నారు. ఇలాంటి వారి వలన భారతదేశం భవిష్యత్తులో అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ దేశంలో ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని ప్రేరేపించి, దేశాన్ని అతలాకుతలం చేయడానికి అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలకు వీరి ఆలోచనలు బాగా ఉపయోగపడతాయి. ఈ విషయంలో దేశ హితాన్ని కోరే ప్రజా సమూహం అప్రమత్తంగా ఉండాలి.

• ఉల్లి బాలరంగయ్య



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ఉద్యోగాలు సృష్టించగల చిన్న, మధ్యతరహా పరిశ్రమల యాజమానులు రుణ సదుపాయం లోటు, నిర్వహణపరమైన కఠిన నిబంధనలతో నానా సమస్యల నెదుర్కొంటున్నారు. ఉద్యోగార్థులకు సరైన విద్యార్హతలు, నైపుణ్యాలు ఉండడం లేదు. ఈ లోపాలను అధిగమించేందుకు ప్రభుత్వం తొలుత నైపుణ్యాల శిక్షణతో కూడిన పాఠశాల విద్యను సమకూర్చాలి. ఆ తరువాత చిన్న, మధ్యతరహా పరిశ్రమల వ్యవస్థాపకులకు ఉదారంగా స్వల్ప వడ్డీతో కూడిన పరపతి సదుపాయాన్ని సమకూర్చాలి.

యువతకు ఉద్యోగాలు ఎందుకు లేవు?

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ – ఎమ్ఎస్ఎమ్ఈ) రంగంపై ఇటీవల రెండు నివేదికలు విడుదలయ్యాయి. ఒకటి ‘స్మాల్ ఇండస్ట్రీస్ డెవెలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యయనం కాగా మరొకటి నీతిఆయోగ్ రూపొందించినది. రెండూ అధికారిక నివేదికలే. ఇవేకాక మరొకటి– ‘యాన్యువల్ సర్వే ఆఫ్ అన్ఇన్‌కార్పొరేటెడ్ సెక్టోర్ ఎంటర్‌ప్రైజెస్’ నివేదిక కూడా ఉన్నది.

ఎమ్ఎస్ఎమ్ఈల గురించి ఈ రెండు అధికారిక నివేదికలు వెల్లడించిన ప్రాథమిక వాస్తవాలు ఏమిటి? ప్రస్తుత వర్గీకరణ ప్రకారం సూక్ష్మ పరిశ్రమలలో పెట్టుబడుల గరిష్ఠ పరిమితి రూ.2.5 కోట్లు కాగా అవి చేసే మొత్తం వ్యాపారం గరిష్ఠంగా రూ.10 కోట్ల మేరకు ఉంటుంది; చిన్న తరహా పరిశ్రమలలో మదుపుల గరిష్ఠ పరిమితి రూ.25 కోట్లు కాగా, వాటి మొత్తం వ్యాపారం గరిష్ఠంగా రూ.100 కోట్లు దాకా ఉంటుంది; మధ్యతరహా పరిశ్రమలలో పెట్టుబడుల గరిష్ఠ పరిమితి రూ. 125 కోట్లు కాగా, వాటి గరిష్ఠ వ్యాపారం రూ.500కోట్లు దాకా ఉంటుంది. ఈ వర్గీకరణ ప్రకారం భారతదేశంలో పరిశ్రమలు అత్యధికం ఎమ్ఎస్ఎమ్ఈలేనని స్పష్టమవుతుంది.

ఎమ్ఎస్ఎమ్ఈలలో సూక్ష్మ పరిశ్రమలే అత్యధికంగా ఉన్నాయి. మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో సూక్ష్మ పరిశ్రమలు 98.64 శాతం కాగా, చిన్నతరహా పరిశ్రమలు 1.24 శాతంగా ఉంటే, మధ్యతరహా పరిశ్రమలు కేవలం 0.12 శాతం మాత్రమే. యాజమాన్యం విషయానికి వస్తే ఒక వ్యక్తి లేదా కుటుంబ యాజమాన్యంలో ఉన్నవి 59 శాతం కాగా భాగస్వామ్య కంపెనీలు 16 శాతం మేరకు ఉన్నాయి. ఎల్ఎల్‌పి 1 శాతం కాగా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు 23 శాతం, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు 1 శాతం మేరకు ఉన్నాయి.

యావద్భారతదేశంలో ఇంచుమించు 7,34,00,000 ఎమ్ఎస్ఎమ్ఈలు ఉన్నాయి. మార్చి 2025 నాటికి ఉద్యామ్ పోర్టల్‌లో నమోదయి ఉన్న కంపెనీలు 6,20,00,000.

ఎమ్ఎస్ఎమ్ఈల రంగంలో పరపతి లోటు (అవసరమైన ఆర్థిక వనరులు, వాస్తవంగా అందుతున్న రుణ సదుపాయం మధ్య వ్యత్యాసం) 24 శాతం (రూ. 30లక్షల కోట్లు) కాగా, సర్వీసెస్ సబ్ సెక్టార్‌లో ఈ లోటు 27 శాతం కాగా మహిళల యాజమాన్యంలో ఉన్న కంపెనీలకు పరపతి లోటు 35 శాతం మేరకు ఉన్నది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ సరుకుల ఎగుమతులలో ఎమ్ఎస్ఎమ్ఈల వాటా 45 శాతం. 2024–25లో తమ ఉత్పత్తులను ఎగుమతి చేసిన కంపెనీలు 1,73,350 మాత్రమే. (మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో ఇవి కేవలం 1 శాతం మాత్రమే) ఇవి ఎగుమతి చేస్తున్న ప్రధాన సరుకులు రెడీమేడ్ వస్త్రాలు, ఆభరణాలు, చర్మ ఉత్పత్తులు, చేతి వృత్తుల ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఆహారాలు, ఆటోమొబైల్స్ విడిభాగాలు. వీటిలో ఒకటి మినహా మిగతావన్నీ ఉత్పత్తికి ఖరీదైన సాంకేతికతలు అవసరం లేని సామాన్య వస్తువులే.

ఎమ్ఎస్ఎమ్ఈల పురోగతికి రుణ సదుపాయ పథకాలు, అభివృద్ధి సహాయ కార్యక్రమాలు చాలా ఉన్నాయి. ప్రస్తావిత అధికారిక నివేదికలను బట్టి కనీసం రెండు సబ్సిడీ పథకాలు, నాలుగు క్రెడిట్ గ్యారంటీ పథకాలు, కనీసం 13 అభివృద్ధి సహాయ పథకాలు ఉన్నట్టు నాకు అర్థమయింది. 2025–26 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ కొత్తగా ఈ రంగంలోకి ప్రవేశించిన వారికి ఒక సబ్సిడీ పథకాన్ని, ఒక క్రెడిట్ కార్డ్ పథకాన్ని ప్రకటించింది. అంతే కాకుండా ఒక కొత్త ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఒక డీప్ టెక్ ఫండ్ ఆఫ్ ఫండ్స్, వీధుల్లో బళ్లపై వివిధ సరుకులు పెట్టుకుని అమ్ముకునే వారికి ఒక నిధి (పీఎమ్ స్వనిధి)ని ప్రకటించింది. ఉద్యోగాల సృష్టికి ప్రధాన ఆధారం ఎమ్ఎస్ఎమ్ఈలే. ఈ రంగం మొత్తం 26 కోట్ల మందికి ఉద్యోగ సదుపాయాన్ని కల్పిస్తోందని ప్రభుత్వం ప్రకటించింది.

ఇక ఇప్పుడు ఒక ప్రధాన ప్రశ్నను తరచి చూద్దాం. ప్రస్తావిత అధికారిక నివేదికల ప్రకారం ఎమ్ఎస్ఎమ్ఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు: నిపుణ కార్మికుల కొరత, నైపుణ్యాల లోటు, ప్రతిభావంతులను ఆకట్టుకోవడంలో కష్టసాధ్యాలు. ఈ నివేదికలు వెల్లడించిన వాస్తవాలు మన దేశంలో నిరుద్యోగిత సంపూర్ణ కథను విశదం చేస్తున్నాయి. రూ.125 కోట్ల గరిష్ఠ పెట్టుబడులతో మొత్తం రూ.500 కోట్ల వ్యాపారం చేస్తున్న పెద్ద పరిశ్రమలు ఉన్నత విద్యార్హతలు, మెరుగైన నైపుణ్యాలు ఉన్నవారిని కార్మికులుగా, ఉద్యోగులుగా నియమించుకుంటున్నాయి. నిరుద్యోగులుగా ఉన్నవారిలో అత్యధికులకు అటువంటి విద్యార్హతలు, నైపుణ్యాలు కొరవడడం ఒక వాస్తవం. ఎమ్ఎస్ఎమ్ఈలకు కార్మికుల అవసరం చాలా ఉంది. అయితే ఈ పరిశ్రమలు కూడా కార్మికుల కొరత నెదుర్కొంటున్నాయి, ప్రతిభావంతులను ఆకర్షించలేకపోతున్నాయి. ఎందుకని? మొదటి కారణం– ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్నవారికి సంబంధిత ఉద్యోగాలకు అవసరమైన విద్యార్హతలు, నైపుణ్యాలు ఉండడం లేదు; రెండో కారణం– ఈ పరిశ్రమలు సమకూరుస్తున్న ఉద్యోగాలలో చేరేందుకు యువజనులు ఆసక్తి చూపడం లేదు. అవి ఇవ్వజూపుతున్న వేతన భత్యాలు సంతృప్తికరంగా లేకపోవడం వల్లే ఆ ఉద్యోగాల పట్ల యువత విముఖత చూపుతోంది. పైగా ఈ పరిశ్రమలు నిర్వహిస్తున్న కంపెనీలలో చేరడమనేది సమాజంలో ప్రతిష్ఠాకరం కాకపోవడం కూడా ఆ విముఖతకు కారణమవుతోంది.




ఎమ్ఎస్ఎమ్ఈల వ్యవస్థాగత వాస్తవాలు, ఉద్యోగిత పరిణామాలను బట్టి యువ భారతీయులలో నిరుద్యోగిత అధికంగా ఎందుకు ఉన్నదో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. ఏప్రిల్ 2025లో భారత జనాభా 146 కోట్లు. కార్మిక శక్తి భాగస్వామ్యం (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ – ఎల్ఎఫ్‌పిఆర్) అంటే ఉద్యోగాలలో ఉన్నవారు, ఉద్యోగం కోసం క్రియాశీలంగా ప్రయత్నిస్తున్నవారు వెరసి మొత్తం ప్రజలు 81 కోట్లు (55.6 శాతం). ఉపాధి పొందుతున్న జనాభా నిష్పత్తి (వర్కర్ పాపులేషన్ రేషియో –డబ్ల్యుపిఆర్) 52.8 శాతం (77 కోట్లు). ఈ రెండు గణాంకాల మధ్య వ్యత్యాసం (4 కోట్లు) నిరుద్యోగుల సంఖ్యను వెల్లడిస్తుంది. వీరంతా నిరుద్యోగులు. నిరుద్యోగుల సంఖ్య చాలా హెచ్చుగా ఉన్నది, సందేహం లేదు. అయితే ఈ నిరుద్యోగులు అదరూ ‘ఉద్యోగానికి క్రియాశీలంగా ప్రయత్నిస్తున్న జనాభా’లోని వారేనన్న విషయాన్ని విస్మరించకూడదు. వివిధ కారణాలతో ఉద్యోగ ప్రయత్నాలను విరమించిన వారు లక్షల సంఖ్యలో ఉన్నారనేది కూడా మరువకూడదు. 81 కోట్ల శ్రామిక జనావళిలో నిరుద్యోగులు 4 కోట్ల మంది అంటే నిరుద్యోగిత 5.0 శాతం. ఇది అధికారిక గణాంకం.

ఎమ్ఎస్ఎమ్ఈలలో అత్యధికం (98.64 శాతం) సూక్ష్మ పరిశ్రమలే. యాజమాన్యం, భాగస్వామ్యం మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో 75 శాతం మేరకు ఉన్నదనే వాస్తవాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ రంగం కంపెనీలలో ఉద్యోగులు లేదా కార్మికులుగా ఉన్న 26 కోట్ల మందిలో చాలా మంది కుటుంబ సభ్యులు లేదా యాజమానుల బంధువులే అయివుంటారన్నది స్పష్టం. చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల (మొత్తం ఎమ్ఎస్ఎమ్ఈలలో 1.36 శాతం లేదా ఇంచుమించు 10,00,000)లో మాత్రమే కుటుంబ, బంధుత్వాల వెలుపలి వారిని నియోగించుకోవడం జరుగుతోంది. దీన్నిబట్టి యజమాని– సేవకుడు సంబంధం ఉన్నది చిన్న, మధ్యతరహా పరిశ్రమలలోనే అని విశదమవుతుంది. పది లక్షల ఎమ్ఎస్ఎమ్ఈలు తమ వ్యాపారాలను పెంపొందించుకుంటూ కొత్త ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. పాఠశాల విద్యను మధ్యలోనే ఆపివేసిన వారు లేదా పాఠశాల విద్యార్హతలు మాత్రమే ఉన్నవారు లేదా ఒక ప్రాథమిక ఆర్ట్స్ లేదా సైన్స్ డిగ్రీ ఉన్న వారి నుంచి ఉద్యోగాలకు డిమాండ్ వస్తోంది. ఈ డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. మరి వీరికి ఉద్యోగ సదుపాయం కల్పించగల చిన్న, మధ్యతరహా పరిశ్రమల యాజమానులు రుణ సదుపాయంలోటు, పరిశ్రమల నిర్వహణకు సంబంధించిన కఠిన నిబంధనలతో నానా సమస్యల నెదుర్కొంటున్నారు. ఉద్యోగాలను కోరుకుంటున్నవారికి సరైన విద్యార్హతలు, నైపుణ్యాలు ఉండడం లేదు. వృత్తిపరమైన శిక్షణ లేకపోవడం వారి ఉద్యోగావకాశాలకు అవరోధంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఉద్యోగాభిలాషులలో ‘ప్రతిభా లోపం’ సమృద్ధిగా ఉన్నది. ఈ లోపాలను అధిగమించేందుకు ప్రభుత్వం ఏమి చెయ్యాలి? తొలుత నైపుణ్యాల శిక్షణతో కూడిన పాఠశాల విద్యను సమకూర్చాలి. ఆ తరువాత సూక్ష్మపరిశ్రమలను వదిలివేసి చిన్న, మధ్యతరహా పరిశ్రమల వ్యవస్థాపకులకు ఉదారంగా స్వల్ప వడ్డీతో కూడిన పరపతి సదుపాయాన్ని సమకూర్చాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన సన్నధాన్యం బోనస్ హామీ ప్రహసనంగా మారుతోందా..? గత ఖరీఫ్‌లో 'గ్యారంటీ' పేరుతో ఇచ్చిన రూ.500 బోనస్ ఈ యాసంగికి బోగస్‌గా మిగులుతుందా..? పరిస్థితులు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. మొన్నటి రబీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,60,699 ఎకరాల్లో వరి పంటసాగు చేశారు. ఇందులో సుమారు 2.52 లక్షల ఎకరాల్లో సన్న వడ్లను పండించారు. మార్చి చివరి నుంచి కొనుగోలు కేంద్రాల్లో సన్నాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు సన్న, దొడ్డు రకం ధాన్యం 6లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేశారు. ఇందులో 2.47లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉంది. కనీస మద్దతు ధర రూ.2,320 చొప్పున సన్న దొడ్డు ధాన్యానికి సంబంధించిన డబ్బులను 80శాతం వరకు చెల్లించింది. ఇక్కడివరకు బాగానే వున్నా, సన్నాల బోనస్ డబ్బుల జాడ మాత్రం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులకు అందాల్సిన బోనస్ మొత్తం ఎంతో తెలుసా.. అక్షరాలా రూ.123.30 కోట్లు. రెండు నెలలు కావస్తున్నా బోనస్ డబ్బులు జమ కాకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇవే కాకుండా గత ఖరీఫ్‌లో సన్నాలు విక్రయించిన కొంతమంది రైతులకు బోనస్ డబ్బులు అందలేదు. ఇక కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. 'నన్ను కోసినా ఇంతకంటే ఎక్కువ ఇవ్వలేను' అని రాష్ట్ర ఖజానా దుస్థితిని కళ్లకు కట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. సన్నధాన్యం బోనస్ విషయంలో మాట నిలబెట్టుకుంటారో... లేదో... కాలమే చెప్పాలి.



- యాసంగిలోనూ సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- ఇప్పటి వరకు 2.47లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు
- 80 శాతం కొనుగోళ్లు పూర్తయినా పైసా బోనస్ ఇవ్వని ప్రభుత్వం
- రెండు నెలలుగా బోనస్ డబ్బుల కోసం రైతుల ఎదురుచూపులు
- ఖరీఫ్ సన్నాల బోనస్ సైతం ఇంకా అనేకమందికి అందని వైనం

సన్నాల బోనస్ సున్నాయేనా!?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.123.30 కోట్ల బకాయిలు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

అన్నదాతలకు సన్నాల బోనస్ టెన్షన్ పట్టుకుంది. ఖరీఫ్ తరహాలోనే యాసంగిలో కూడా సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులు సన్నాల సాగుకు మొగ్గుచూపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ రబీలో 6,60,699ఎకరాల్లో వరి పంటసాగు చేశారు. మార్చి చివరిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, సన్నాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. సన్న, దొడ్డు ధాన్యానికి సంబంధించిన డబ్బులను 80శాతం వరకు ప్రభుత్వం రైతులకు చెల్లించింది. అయితే రెండు నెలలు గడుస్తున్నా సన్నాల బోనస్ సుమారు రూ.123.30కోట్లు రైతులకు అందక పోవటంతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు కూడా పూర్తి కావస్తుండటంతో సన్నాల బోనస్ కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకు కూడా బోనస్ జమ కాకపోవటంతో.. ప్రభుత్వం యాసంగి సన్నాలకు బోనస్ ఇస్తుందా.. ఇవ్వదా అనే టెన్షన్‌లో రైతుల్లో నెలకొంది.

బోనస్‌తో సన్నాలపై ఆసక్తి..

ప్రభుత్వం సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించటంతో సన్న వడ్ల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,320 చెల్లిస్తున్నారు. వీటితో పాటు అదనంగా సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. గత ఖరీఫ్ తరహాలోనే యాసంగి సన్నాలకు కూడా బోనస్ ఇస్తామని ప్రభుత్వం తెలపటంతో ఆశతో రైతులు సన్నాల సాగుకు మొగ్గు చూపారు. 2024-25 యాసంగిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,26,459 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా, 6,60,699లో వరి, 2,46,802 మొక్కజొన్న, 18,958 ఇతర పంటలు సాగు చేశారు. యాసంగిలో సుమారు 2.52లక్షల ఎకరాల్లో రైతులు సన్నవడ్లను పండించారు. 9.73లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరణే లక్ష్యంగా గత మార్చి నెల నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,130కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్న, దొడ్డు రకం ధాన్యం 6లక్షల మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేశారు. ఇందులో 2.47లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉంది. అయితే సన్న, దొడ్డు ధాన్యంకు సంబంధించిన డబ్బులు 80శాతంకు పైగా రైతు ఖతాల్లో జమ చేశారు. రెండు నెలలుగా సన్న ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు.

రూ.123.30 కోట్ల బకాయిలు

ప్రభుత్వం సన్నాలకు ఇస్తామన్న బోనస్ ఇప్పటి వరకు

మిగతా 6వ పేజీలో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అందాల్సిన యాసంగి బోనస్ వివరాలు

జిల్లా	విక్రయించిన సన్నధాన్యం	రావాల్సిన బోనస్
వరంగల్	63,520 టన్నులు	రూ.31.76 కోట్లు
హనుమకొండ	15,171 టన్నులు	రూ.7.58 కోట్లు
జనగామ	20,082 టన్నులు	రూ.10.04 కోట్లు
మహబూబాబాద్	1,17,345.8 టన్నులు	రూ.58.67 కోట్లు
భూపాలపల్లి	8,057 టన్నులు	రూ.4.02 కోట్లు
ములుగు	22,461 టన్నులు	రూ.11.23 కోట్లు
మొత్తం	2,46,636 టన్నులు	రూ.123.30 కోట్లు



బోనస్ డబ్బులు రాలేదు

కనుకుల మల్లారెడ్డి, రైతు, చిట్యాల, భూపాలపల్లి జిల్లా

ప్రభుత్వం సన్నాలపై బోనస్ ప్రకటించటంతో రెండు ఎకరాల్లో సాగు చేశాను. 65క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ధాన్యం డబ్బులు వచ్చినప్పటికి 65క్వింటాళ్లకు రావాల్సిన బోనస్ డబ్బులు రూ.32,500లు ఇప్పటి వరకు ఖాతాలో జమ కాలేదు. ప్రభుత్వం బోనస్ ఇస్తుందనే ఆశతోనే సన్నాలు సాగు చేశాను. ఇప్పటి వరకు బోనస్ డబ్బులు రాకపోవటంతో అధికారుల చుట్టు తిరుగాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బుల ఖాతాల్లో జమ చేయాలి.



గరిష్ఠ ప్యాకేజీ పొందిన సోమిల్ మాల్దాని

ప్యాకేజీ అదుర్స్..

నిట్ విద్యార్థి సోమిల్ మల్దానికి రూ.64.3 లక్షల వేతనంతో ఉద్యోగం

- ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నిట్ అద్భుత ఫలితాలు
- 79.7శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు
- ఈ ఏడాది 1,201 మందికి ప్లేస్‌మెంట్

హనుమకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రతిష్టాత్మక నిట్ కళాశాల ప్లేస్‌మెంట్‌లలో అద్భుత ఫలితాలను సాధించింది. ఈ కళాశాలలో చదువుకున్న 79.7శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. సోమిల్ మాల్దాని (ఈసీఈ)కి రూ.64.3లక్షల గరిష్ట వేతన ప్యాకేజీ లభించింది. ఈ సంవత్సరం 290కిపైగా పేరున్న సంస్థలు క్యాంపస్‌ను సందర్శించాయి. ఈ యేడు మొత్తం 1,508 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ కోసం నమోదు కాగా, వీరిలో 791 మంది అండర్ గ్యాడ్యుయేట్‌లు, 717 మంది పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మొత్తం 1201 మంది ఉద్యోగాలు పొందారు. యూజీలో 679 మంది, పీజీలో 522 మంది ఉద్యోగాలు పొందినవారిలో ఉన్నారు. మొత్తంగా ప్లేస్‌మెంట్ రేటు 79.7 శాతంగా ఉంది. గత సంవత్సరం 76శాతం ప్లేస్‌మెంట్‌తో పోల్చితే 3.7 శాతం ఎక్కువ. వరంగల్ ఎన్ఐటీ ప్లేస్‌మెంట్ పురోగతికి ఇది స్పష్టమైన నిదర్శనం. యూజీ విద్యార్థులకు 85.8 శాతం, పీజీ విద్యార్థులకు 72.8 శాతం ప్లేస్‌మెంట్ రేటు నమోదైంది. ఈ సంవత్సరం గరిష్ఠంగా రూ.64.3లక్షల వేతన ప్యాకేజీని రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన సోమిల్ మాల్దాని పొందారు. ఆయన ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ (ఎస్‌డీఈ)గా ఉద్యోగాన్ని పొందాడు. మొత్తం విద్యార్థులందరికీ సగటు ప్యాకేజీ రూ.14.35లక్షలు ఉండగా యూజీ విద్యార్థులకు రూ.16లక్షలు, పీజీ విద్యార్థులకు రూ.12.20 లక్షలు ఉంది. తొలిసారిగా పీహెచ్‌డీ విద్యార్థుల ప్లేస్‌మెంట్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రత్యేక ప్రయత్నాలు చేపట్టగా ఆరుగురు పీహెచ్‌డీ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. వీరి సగటు ప్యాకేజీ రూ.9లక్షలుగా ఉంది.

ప్లేస్‌మెంట్ విజయాలపై వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి స్పందిస్తూ.. క్లిష్ట పరిస్థితుల్లో విద్యార్థులు తమ నైపుణ్యం, సర్దుబాటు సామర్థ్యం, వృత్తిపరమైన ప్రవర్తన ద్వారా తమ విలువలను నిరూపించుకున్నారన్నారు. సీసీపీడీ అధిపతి ప్రొఫెసర్ పి.హరిక్రిష్ణ ప్లేస్‌మెంట్‌కు దోహదపడ్డ కారణాలను వివరిస్తూ ఈ విజయానికి సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెట్ వివిధ విభాగాల వారీగా నిర్వహించిన పూర్వ శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు.

నమ్మించి నట్టేట ముంచాడు..

క్రెడిట్ కార్డులను వాడుకొని రూ.50 లక్షలకు కుచ్చుటోపీ



- నగరంలో ఆన్‌లైన్ బ్యాంకింగ్ సెంటర్ నిర్వాహకుడి ఘరానా మోసం
- లబోదిబోమంటున్న బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు

హనుమకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి): నగదు కోసం తన వద్దకు వచ్చినవారిని ఓ ఆన్‌లైన్ బ్యాంకింగ్ సెంటర్ నిర్వాహకుడు నిలువునా ముంచేశాడు. రూ.50లక్షల వర కు కుచ్చుటోపి పెట్టాడు. రాత్రికి రాత్రే బిచానా ఎత్తేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. పోలీసు లను ఆశ్రయించి న్యాయం చేయాలని అర్థిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆర్థిక అవసరాల కోసం చాలా మంది క్రెడిట్ కార్డులు వాడటం ఇప్పుడు సర్వసాధారణమైంది. మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు కానీ, లేదా ఇతరత్రా సామగ్రిని కొనుగోలు చేయడానికి, లేదా తాము పొందిన సేవలకు గాను చెల్లింపులకు క్రెడిట్‌కార్డును వాడడం అందరికి తెలిసిందే. కానీ డబ్బు అవసరం ఉన్నవారు ఈ క్రెడిట్‌కార్డు ద్వారా థర్డ్‌పార్టీ సాయంతో నగదును కూడా తీసుకుంటారు. సరిగ్గా ఇక్కడే ఓ ఆన్‌లైన్ నిర్వాహకుడు మోసానికి తెరలేపాడు. నగదు కోసం వచ్చినవారిని మాయమాటలతో బురిడీ కొట్టించాడు. వారిని నిలువునా ముంచాడు.

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపెల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల అరుణ్ అనే వ్యక్తి కొంత కాలం కిందట బతుకుదెరువు కోసం హనుమకొండకు వచ్చాడు. యాదవనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఇదే ప్రాంతంలో ఓ కిరాణ దుకాణాన్ని ఏర్పాటు తెరిచాడు. ఇందులోనే ఆన్‌లైన్ బ్యాంకింగ్ సెంటర్ ఏర్పాటు చేశాడు. డబ్బు అవసరమైనవారికి కొంత కమీషన్‌పై వారి క్రెడిట్ ద్వారా నగదు డ్రా

మిగతా 8వ పేజీలో...

పుష్కర తీరం.. భక్తజన సందోహం



పుష్కరిణికి హారతి ఇస్తున్న కాశీ పండితులు

త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- 9వ రోజూ భక్త జనహోరు
- హాజరైన హంపి పీఠాధిపతి
- కొనసాగిన ట్రాఫిక్ సమస్య.. 3 కిలోమీటర్లు నడిచిన భక్తులు
- 1.30 లక్షల భక్తుల పుణ్యస్నానాలు.. శాంతించని వరుణుడు

7



పనులను పరిశీలిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి

ఇన్నర్‌రింగ్ రోడ్డు పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, మే23(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాకలో జరుగుతున్న ఇన్నర్‌రింగ్ రోడ్డు పనులను కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామ్‌రెడ్డి శుక్రవారం పర్యవేక్షించారు. ఇన్నర్‌రింగ్ రోడ్డుతో పాటు కల్వర్టు పనులను పరిశీలించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా ఇన్నర్‌రింగ్ రోడ్డు పనులతో పాలు కల్వర్టు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుడా అధికారులు పాల్గొన్నారు.

పస్తులతో పరీక్షలకు..

- సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల అవస్థలు
- డిగ్రీ పరీక్షల వేళ అర్ధాకలితో అలమటిస్తున్న బాలికలు
- అధ్వానంగా భోజనం.. పెట్టేది కూడా కొంతే.. పాటించని మెనూ..
- ఇంటి భోజనాన్ని అనుమతించని సిబ్బంది
- సందర్శకులపై జులుం చలాయిస్తున్న వైనం

6

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

- మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులతో అధికారుల నిర్ణయం
- ఈ నెల 29వ తేదీ వరకు ఇదే పరిస్థితి..

6

గంజాయి ముఠా ఆటకట్టు

- రూ.కోటి విలువైన 210 కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- రవాణా చేస్తున్న నలుగురి అరెస్టు
- ట్రాక్టర్, కారు, 5 సెల్‌ఫోన్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

వరంగల్ క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి వరంగల్ మీదుగా హైదరాబాద్‌కు ట్రాక్టర్‌లో గంజాయి తరలిస్తున్న నలుగురిని ఆదుపులోకి తీసుకొని, రూ.1,05,38,000 విలువ చేసే ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని నార్కోటిక్స్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కె.సైదులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి... ఆంధ్రప్రదేశ్‌లోని అడవి అన్నవరం నుంచి వరంగల్ మీదుగా హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై రాజు, సిబ్బంది శుక్రవారం వరంగల్ ఉర్సు గుట్ట జంక్షన్‌లో కాపు కాశారన్నారు. ఈ క్రమంలో గంజాయితో వస్తున్న ట్రాక్టర్, ముందు పైలట్‌గా వస్తున్న కారు పట్టుబడ్డాయని, వారిని ఆదుపులోకి తీసుకొని విచారించామన్నారు. ఏపీలోని అనకాపల్లి జిల్లా వలసంపేటకు చెందిన విరోధుల శ్రీను ఏపీలో గంజాయి కొనుగోలు చేసి అక్కడి నుంచి ఖమ్మంకు వచ్చాడని, అక్కడ తన వ్యాపార భాగస్వాములైన

మిగతా 8వ పేజీలో...

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

- రెండు నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం
- సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి..
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముల్కనూర్‌లో కాంగ్రెస్ పార్టీ సంస్థగత, నిర్మాణ సన్నాహక సమావేశం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి ఐలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రెండునెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుల్లో అన్ని గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జీడ్పీటీసీలను గెలిపించుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీ కార్యాకర్తలపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజల కోసం



ముల్కనూర్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అందిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు, ఇతర హామీలను సైతం అమలు చేస్తోందన్నారు. గతంలో నియోజకవర్గంలో ఒక గ్రామానికి మాత్రమే బీఆర్ఎస్ పార్టీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చిందన్నారు. కానీ ప్రజాపాలనలో అన్ని గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. గ్రామాల్లో సీసీ తాగునీటి అవసరాల కోసం నిధులు కేటాయిస్తున్నామన్నారు. వంగరకు నవోదయ విద్యాలయాన్ని త్వరలోనే తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, పీసీసీ పరిశీలకుడు మక్సూద్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీలు అశోక్‌ముఖర్జీ, కొడూరి సరోజన, కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, పిడిశెట్టి కనకయ్య, ఆర్ వెంకటొరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్ ప్రకటనపై సీఎం విచారణకు ఆదేశించాలి..

కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడిన తీరుపై ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి సీబీఐ విచారణకు ఆదేశించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సాగునీటి ప్రాజెక్టులను నిర్మించడమే కాంగ్రెస్ పార్టీకి తెలుసని, ప్రాజెక్టు లను విధ్వంసం చేసే కుట్రలు పన్నదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ బాంబులు పెట్టి పేల్చేసిందని కేటీఆర్ అన్న మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనన్నారు. బీజేపీపై కేసీఆర్ మాట్లాడడం లేదని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించడం ఇందుకు ఉదాహరణ అని మంత్రి పొన్నం పేర్కొన్నారు.



మార్కెట్ పత్తియార్డులో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న జేడీ శ్రీనివాస్

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్

వరంగల్ వ్యవసాయం, మే 23: (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులు సమయపాలన పాటించాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(జేడీ), మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన డీడీఎం పద్మావతి, డీఎంవో సురేఖ, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డితో కలిసి ఏనుమాముల మార్కెట్లో ఆకస్మిక తనిఖీ చేశారు. పత్తి, మిర్చి యార్డును, రైతులు తీసుకువచ్చిన సరుకులను పరిశీలించారు. ధరల హెచ్చుతగ్గుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీగార్డ్స్, దడువాయిల ముఖ గుర్తింపు(ఫేషియల్ రికగ్నషన్)హాజరు విధానాన్ని అమలు చేయాలని మార్కెట్ కార్యదర్శిని ఆదేశించారు. రైతులకు, కార్మికులకు మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. కాంటాలు ఆలస్యం కాకుండా పత్తి యార్డులో సరిపడా దడువాయిలను కేటాయించాలన్నారు. దడువాయిల రిజిస్టర్ పరిశీలించి క్రమపద్ధతిలో కేటాయించకపోవడంపై పర్యవేక్షకులను మందలించారు. అదే విధంగా విధులకు ఆలస్యంగా హాజరవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 2కార్యదర్శులు ఎస్.రాము, అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్, గంగాదర్, నర్సింగరావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఏసీపీలను కలిసిన హడుప్సా ప్రతినిధులు



హనుమకొండ ఏసీపీ నరసింహారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హడుప్సా ప్రతినిధులు

వరంగల్ క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హనుమకొండ, కాజీపేట ఏసీపీలుగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నర్సింహారావు, ప్రశాంత్‌రెడ్డిలను హనుమకొండ జిల్లా అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (హడుప్సా) ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండేలా, ట్రాఫిక్ రూల్స్ పాటించేలా, దాతృత్వం గుణం పెంపొందేలా తీర్చిదిద్దాలని హడుప్సా ప్రతినిధులకు ఏసీపీలు సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.వెంకటరమణ, కోశాధికారి డి.శంకర్, *. బుచ్చిబాబు, యన్.రవీందర్‌రెడ్డి, టి.రాజేశ్వర్‌రావు, వి.సిరామారావు, బి.వెంకట్ రెడ్డి, పి.సతీష్‌కుమార్, వై.వెంకటేశ్వర్‌రావు, యం.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, మే 23 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 20మంది వాహనదారులను శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్‌చారి రూ.18,600 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని నలుగురికి రూ.2,800 జరిమానా విధించారన్నారు.

పస్తులతో పరీక్షలకు..

● సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల అవస్థలు ● డిగ్రీ పరీక్షల వేళ అర్ధాకలితో అలమటిస్తున్న బాలికలు ● అధ్వానంగా భోజనం.. పెట్టేది కూడా కొంతే.. పాటించని మెనూ.. ● ఇంటి భోజనాన్ని అనుమతించని సిబ్బంది ● సందర్శకులపై జులుం



రంగశాయిపేటలో ఉన్న సోషల్ వెల్ఫేర్ డిగ్రీ గురుకుల కళాశాల

శంభునిపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రంగశాయిపేటలో ఉండే వరంగల్ తూర్పు సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పస్తులతో పరీక్షలకు హాజరవుతున్నారు. గురుకులంలో పెట్టే భోజనం నాసిరకంగా ఉండడంతోపాటు కొంత మేరకే పెడుతుండడంతో ఖాళీ కడుపుతో విద్యార్థినులు అలమటిస్తున్నారు. ఎవరికి చెప్పుకోలేక కన్నీరును దిగమింగుకుంటున్నారు. అర్ధాకలితో సరిగా పరీక్షలు రాయలేకపోతున్నారు. అంతేకాక గురుకులంలో వంట పనులను విద్యార్థినులతోనే చేయిస్తుండడంతో చదువుకునే సమయం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పరీక్షల కోసం..

వరంగల్ తూర్పు గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో డిగ్రీ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఇదే కళాశాల విద్యార్థినులతోపాటు ఇక్కడికి చుట్టుపక్కల ఉన్న కొన్ని గురుకుల కళాశాలల విద్యార్థినులను ఇక్కడే ఉంచి పరీక్షలను రాయిస్తున్నారు. అయితే ఇక్కడ భోజనం నాణ్యతగా వండడం లేదు. రుచీ పచీ లేకుండా ఉండడంతో విద్యార్థులు సరిగా తిన డం లేదు. పైగా కొంతమేరకు వడ్డిస్తున్నారు. మళ్లీ అడిగితే దబాయిస్తుండడంతో విద్యార్థినులు బెదురుతున్నారు. ఏం చేయాలో తెలియక ఆకలితో అలమటిస్తూ పరీక్షలకు హాజరవుతున్నారు. అంతేకాకుండా వంట పనులు సైతం విద్యార్థినులతో చేయించుకుంటున్న పరిస్థితి నెలకొంది. కూరగాయలు కోయడం, బియ్యం కడగడంలాంటివి చేయిస్తుండడంతో చదివే సమయం కుదరడం లేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసతులు లేక..

గురుకుల డిగ్రీ కళాశాలలో సరైన వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారు. హాస్టల్‌లో సరైన శుభ్రత ఉండటం లేదు. దోమలు విపరీతంగా పెరిగి విషజ్వరాలకు కారణమవుతున్నాయి. ప్రతీ నెలా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుల నిమిత్తం ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.275 చొప్పున చెల్లిస్తుంటుంది. అయితే అవి జనవరి నెల వరకు మాత్రమే విద్యార్థినులకు అందాయి అందాయి. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో కౌమార దశలో ఉన్న విద్యార్థినుల అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పాటించని మెనూ..

కళాశాలలో విద్యార్థులకు సరైన భోజన సదుపాయం కల్పించడం లేదని, మెనూ పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. సరిగా ఉడకని అన్నం, కూరలు వడ్డిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. నాణ్యత లేని ఆహారం తిని అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే సమస్య ఉత్పన్నమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతించని ఇంటి భోజనం

హాస్టల్‌లో సరైన భోజనం పెట్టడంలేదని తల్లిదండ్రులు ఇంటి వద్ద నుంచి భోజనం, తినుబండారాలు తీసుకొస్తే కళాశాల సిబ్బంది అనుమతించడం లేదు. కనీసం చూడటానికి కూడా ఒప్పుకోకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. గేటు వద్దే ఆపడంతో మండుటెండలోనే పిల్లలతో మాట్లాడుతున్నారు. చెట్టు కింద మాట్లాడుకుంటామని విజ్ఞప్తి చేసినప్పటికీ సిబ్బంది దబాయిస్తున్నారు. పైగా విద్యార్థినులకు తెచ్చిన బిస్కెట్లు, పచ్చళ్లను సైతం గేటు వద్ద ఉండే సిబ్బంది కాజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంలో తమ పేర్లు చెబితే ఇబ్బందులకు గురిచేస్తారని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కళాశాలలో అడ్మిషన్‌లు తగ్గే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కళాశాలను సందర్శించాలని, సమస్యలను పరిష్కరించాలని విద్యార్థినులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మామునూరు ఏసీపీగా వెంకటేశ్ బాధ్యతలు



మామునూరు, మే 23 (ఆంధ్రజ్యోతి): మామునూరు ఏసీపీగా ఎన్.వెంకటేశ్ శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం జిల్లా ఎస్‌బీ విభాగంలో ఏసీపీగా పనిచేసిన ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు మామునూరు సీఐ ఓ.రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన ఏసీపీ మాట్లాడుతూ.. ప్రజలకు ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తనని కలవాలని సూచించారు. నేరాలను అరికట్టేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకుంటానని అన్నారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన తిరుపతి ఇటీవల డీజీపీ ఆఫీస్‌కు అటాచ్డ్‌గా బదిలీపై వెళ్లారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న హనుమకొండ జేఎన్ఎస్‌లో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8, 10, 12 బాలబాలికల విభాగంలో 60, 100, 300, 600, మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, స్టాండింగ్ షాట్‌పుట్, జావెలిన్‌త్రో, టెన్నిస్‌బాల్‌త్రోలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు జూన్ 1వ తేదీ హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు ఈ నెల 25న ఉదయం 8గంటలకు హనుమకొండ జేఎన్ఎస్‌లో రిపోర్టు చేయాలని సారంగపాణి కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9390104499 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

సన్నాల బోనస్ సున్నాయేనా!?

5వ పేజీ తరువాయి

ఇవ్వకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,46,636 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. క్వింటాలుకు రూ.500 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం బోనస్ జమ చేయాల్సి ఉంది. మహబూబాబాద్ జిల్లాలో 1,17,345.8 మెట్రిక్ టన్నుల సన్నాలకు రూ.58.67కోట్ల బోనస్ 24,082 మంది రైతులకు రావాల్సి ఉంది. అలాగే వరంగల్ జిల్లాలో 63,520 క్వింటాళ్ల సన్నాలకు రూ.31.76కోట్లు, హనుమకొండ జిల్లాలో 15,171 క్వింటాళ్లకు రూ.7.58కోట్ల బోనస్ రైతులకు అందాల్సి ఉంది. జనగామ జిల్లాలో 20,082 క్వింటాల్‌కు సంబంధించిన రూ.10.04కోట్లు, భూపాలపల్లి జిల్లాలో 8,057క్వింటాల్స్‌కు రూ.4.02కోట్లు, ములుగు జిల్లాలో 22,461 క్వింటాళ్లకు రూ.11.23కోట్ల బోనస్ బకాయిలు రైతులకు అందాల్సి ఉంది. మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రూ.123.30కోట్ల బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. రెండు నెలలు కావస్తున్నా ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ కాకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇవే కాకుండా గత ఖరీఫ్‌లో సన్నాలు విక్రయించిన కొంతమంది రైతులకు బోనస్ డబ్బులు అందటం లేదు. ఖరీఫ్‌లో మొదటి విడత సన్నాల కొనుగోలు చేసిన రైతులకు వెంటనే డబ్బులు జమ చేసిన ప్రభుత్వం, నెల తరువాత విక్రయించిన రైతులకు మూడు నెలల వరకు బోనస్ డబ్బులు ఇవ్వలేదు. ఇప్పటికి వరంగల్ జిల్లాల్లో 66.16లక్షలు బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో ఇంకా జమ కాలేదు. అలాగే భూపాలపల్లి జిల్లాలో రూ.4.71లక్షలు రైతులకు బోనస్ చెల్లించాల్సి ఉంది.

బోనస్‌పై స్పష్టత ఏదీ..?

సన్నరకం ధాన్యంకు బోనస్ ఇచ్చే విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన లేకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కూడా బోనస్ చెల్లింపులపై చేతులు ఎత్తేస్తున్నారు. ప్రతి రోజు సేకరించే సన్నాధాన్యం బోనస్‌లపై ప్రభుత్వానికి నివేదికలు ఇస్తున్నామని అధికారులు అంటున్నారు. బోనస్ చెల్లించే విషయం ప్రభుత్వం చేతిలో ఉందని, తమకు సమాచారం లేదని అధికారులు పేర్కొంటుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. మార్చి నెలఖారున కొనుగోలు చేసిన రైతులకు కూడా ఇప్పటి వరకు బోనస్ డబ్బులు ఇవ్వలేదు. రెండు నెలలుగా ప్రభుత్వం పైసా కూడా బోనస్‌గా విడుదల చేయదలేదు. పైగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో రైతుల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే రూ.123కోట్లకు పైగా బోనస్ బకాయిలు ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రుపాయల బోనస్ రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రధానంగా కౌలు రైతులు బోనస్ ఎప్పుడు వస్తుందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. కౌలు చెల్లించటంతో పాటు మళ్లీ ఖరీఫ్ సీజన్ కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉందని కౌలు రైతులు వాపోతున్నారు. గత ఖరీఫ్‌కు సంబంధించిన బోనస్ డబ్బులు కూడా మూడు నెలల తరువాత రైతులకు చెల్లించారు. అయితే అప్పట్లో బోనస్ డబ్బులు జమ చేస్తామని ప్రభుత్వం పదే పదే ప్రకటించింది. అయితే ప్రస్తుతం రైతులకు అందాల్సిన బోనస్ డబ్బులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన లేకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. బోనస్ డబ్బులు వస్తాయా.. రావా అనే టెన్షన్‌లో అన్నదాతలు ఉన్నారు.

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

● మహబూబాబాద్‌లో మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులతో అధికారుల నిర్ణయం
● ఈ నెల 29వ తేదీ వరకు ఇదే పరిస్థితి..
● దక్షిణ మధ్య రైల్వే అధికారుల వెల్లడి

డోర్నకల్, మే23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - కాజీపేట సెక్షన్‌లోని మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో 3వ రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో భాగంగా ఈనెల 23వ తేదీ నుంచి 29 వరకు పలు రైళ్లను రద్దుచేసి, మరికొన్ని రైళ్లను దారిమళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట - డోర్నకల్, డోర్నకల్-విజయవాడ, విజయవాడ-డోర్నకల్ -కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్ ప్యాసింజర్, విజయవాడ-భద్రాచలంరోడ్, భద్రాచలంరోడ్ -విజయవాడ ప్యాసింజర్, గుంటూరు-సికింద్రాబాద్, సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, విజయవాడ-సికింద్రాబాద్, సికింద్రాబాద్-విజయవాడ మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్, గుంటూరు- సికింద్రాబాద్ (17201), సికింద్రాబాద్-గుంటూరు (17202) (23 నుంచి 28వ తేదీవరకు కాజీపేట-గుంటూరు స్టేషన్‌ల) మధ్య నడిచే గోల్కోండ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. అదే విధంగా రైలు నెంబర్ 18045 షాలిమార్-హైదరాబాద్ మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ (27,28 తేదీల్లో), విజయవాడ-గుంటూరు-పగిడిపల్లి- సికింద్రాబాద్ మీదుగా, 18046 హైదరాబాద్- షాలిమార్ (28,29 తేదీల్లో), 11019 ముంబై-భువనేశ్వర్, 11020 భువనేశ్వర్-ముంబై మధ్య నడిచే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (27,28 తేదీల్లో), 17205 శిరిడీ -కాకినాడ పోర్టు శిరిడీ ఎక్స్‌ప్రెస్ (27వ తేదీన), 17206 కాకినాడ పోర్టు-శిరిడీ వెళ్లే షిర్డీ ఎక్స్‌ప్రెస్, 17207 శిరిడీ -మచిలిపట్నం ఎక్స్‌ప్రెస్ (28వ తేదీన) విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి, సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించినట్లు అధికారులు చెప్పారు. రైలు నెంబర్ 22645 ఇండోర్-కొచ్చివెల్లి వెళ్లే ఎక్స్‌ప్రెస్ (26వ తేదీన), 22646 కొచ్చివెల్లి-ఇండోర్ (28వ తేదీన), 22647 కోర్బా-తిరువనంతపురం వెళ్లే ఎక్స్‌ప్రెస్ (26వ తేదీన), 22648 తిరువనంతపురం-కోర్బా వెళ్లే ఎక్స్‌ప్రెస్ (25వ తేదీన), 12511 గోరక్‌పూర్-కొచ్చివెల్లి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను (25,27,28 తేదీల్లో), 12512 కొచ్చివెల్లి-గోరక్‌పూర్ (27,28 తేదీల్లో), 20805 విశాఖపట్నం-న్యూఢిల్లీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (27,28 తేదీల్లో), 20806 న్యూఢిల్లీ-విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను (25వ తేదీన), 20804 దాండీదాం-విశాఖపట్నం వెళ్లే ఎక్స్‌ప్రెస్ (24వ తేదీన), 17482 సికింద్రాబాద్-తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

కేసముద్రంలో 'అప్'వైపు హోల్టింగ్ రైళ్లు

కేసముద్రం : మహబూబాబాద్‌లో మూడోలైను నాన్ - ఇంటర్‌లాకింగ్ పనులు కొనసాగుతుండడంతో అక్కడి స్టేషన్లో హోల్టింగ్ ఉన్న పలు రైళ్లకు అప్‌వైపునకు మాత్రమే మూడు రోజులపాటు కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నిలిపే విధంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 24 నుంచి 26 వరకు మణుగూరు-చర్లపల్లి (12746) సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-బీదర్ (12749) బీదర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, కాకినాడపోర్ట్-లింగంపల్లి (12737) గౌతమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గూడూరు జంక్షన్-సికింద్రాబాద్ (12709) సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-సికింద్రాబాద్ జంక్షన్ (12763) పద్మావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం జంక్షన్-హైదరాబాద్ (12727) గోదావరి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం జంక్షన్- మహబూబ్‌నగర్ (12861) మహబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తాంబరి-హైదరాబాద్ (12759) చార్మినార్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-చత్రపతి శివాజి మహారాజ్ టర్మినల్ (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, షాలిమార్-హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈనెల 25 నుంచి 27 వరకు చెన్నై-అహ్మదాబాద్ (12656) నవజీవన్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను మూడురోజుల పాటు హోల్టింగ్ ఇచ్చారు. అలాగే ఈనెల 24న తిరుపతి-కరీంనగర్ (12761) కరీంనగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 26న కాకినాడ పోర్ట్-సాయినగర్ షిర్డీ (17206) సాయినగర్ షిరిడీ ఎక్స్‌ప్రెస్, 26, 27 తేదీల్లో నర్సాపూర్-నాగర్‌సోల్ (12787) నాగర్‌సోల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 27న మచిలీపట్నం- సాయినగర్ షిరిడీ (17208) సాయినగర్ షిరిడీ ఎక్స్‌ప్రెస్, క్రాంతివీరా సంగోలి రాయ్నా బెంగళూరు-లాల్‌కువన్ జంక్షన్ (05073) లాల్ కువాన్ ప్రత్యేక రైలు, కోయంబత్తూరు జంక్షన్-ధన్బాద్ జంక్షన్ (03680) ధన్‌బాద్ ప్రత్యేక రైళ్లకు హోల్టింగ్ ఇచ్చారు.

ఈనెల 29వరకు..

గిర్మాజీపేట: మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో జరుగుతున్న మూడో రైల్వేలైన్ పనుల కారణంగా వరంగల్ రైల్వేస్టేషన్ మీదుగా వచ్చివెళ్లే కొన్ని రైళ్లను పూర్తిగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా ఈనెల 29వ వరకు రద్దు చేసినట్లు వరంగల్ రైల్వే అధికారులు తెలిపారు. అదేవిధంగా కొన్ని రైళ్లను దారిమళ్లించామని, కొన్ని రైళ్లకు మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో స్టాప్‌ను ఎత్తివేశామన్నారు. పూర్తి సమాచారం కోసం రైల్వేస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కాజీపేట - డోర్నకల్ - కాజీపేట (67765/67766) ప్యాసింజర్ రైళ్లు, గుంటూర్- సికింద్రాబాద్- గుంటూరు (12705/12706) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లు, సికింద్రాబాద్ - విజయవాడ-సికింద్రాబాద్ (12713/12714) శాతావాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 29 వరకు పూర్తిగా రద్దు చేశారు. అలాగే గుంటూర్-సికింద్రాబాద్-గూంటూరు (17201/17202) మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు-కాజీపేట మధ్య రద్దు చేశారు. గోల్కొండ రైలు కాజీపేట-సికింద్రాబాద్ మధ్యనే రాకపోకలు సాగిస్తుంది. కొత్తగూడెం-సికింద్రాబాద్-కొత్తగూడెం మధ్య నడిచే కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను కొత్తగూడెం-కాజీపేట మధ్య రద్దు చేశారు. కాజీపేట-సికింద్రాబాద్ మధ్యనే నడుస్తుంది. ఇక కొత్తగూడెం- బల్లార్ష, సిర్పూర్ కాగజ్‌నగర్ - కొత్తగూడెం మధ్య నడిచే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను కొత్తగూడెం-కాజీపేట మధ్య రద్దు చేశారు. ఇది కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షలకు రాకపోకలు సాగిస్తుంది. గోల్కొండ, కాకతీయ, సింగరేణి రైళ్లు ఈనెల 29వరకు వరంగల్‌కు రావు.

28వరకు మహబూబాబాద్‌లో స్టాప్ రద్దు

మణుగూరు-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, సింహపూరి, పద్మావతి, గోదావరి, చార్మినార్, విశాఖపట్టణం-మహబూబాబాద్ సూపర్‌ఫాస్ట్, కోణార్క్, కాకినాడ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, నవజీవన్, ఈస్ట్‌కోస్ట్, బీదర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈనెల 28 వరకు మహబూబాద్ రైల్వేస్టేషన్ స్టాప్ లేదని రైల్వే అధికారులు తెలిపారు




28వరకు దారిమళ్లింపు

విశాఖపట్టణం-ముంబయి-విశాఖపట్టణం ఎల్‌టీటీ, శాలిమార్-హైదరాబాద్-శాలిమార్ ఎక్స్‌ప్రెస్‌లు, ముంబై-భువనేశ్వర్-ముంబై, కాకినాడ-షిర్డీ-కాకినాడ ఎక్స్‌ప్రెస్‌లను విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి మీదుగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించారు.

ప్రతీ ఊరికి రెడ్‌క్రాస్ సేవలు అందించాలి

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య

పరకాల, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీఊరికి రెడ్‌క్రాస్ సేవలు అందించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. పరకాలలో నూతనంగా నిర్మించనున్న రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజీ సెంటర్‌కు శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీ డాక్టర్ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో సరైన రక్తం అందకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ జిల్లాలో రెడ్‌క్రాస్ ఉందని, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో రెడ్‌క్రాస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు బ్లడ్‌చాలా అవసరమని బ్లడ్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లాలోని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ ద్వారా అందుబాటులో ఉంటే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ నిర్వహణతోపాటు డ్రగ్ డిఅడిక్షన్ సెంటర్, ఆడపిల్లలకు రక్తహీనత పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని వివరించారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో తలసేమియా ఐసీఎంఆర్ పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పరకాల ఆస్పత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, మునిసిపల్ కమిషనర్, రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణలో విజయ డెయిరీ వరంగల్ షెడ్

నేడు మార్కెట్‌లోకి విడుదల కానున్న కొత్త ఉత్పత్తులు

హనుమకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలోని విజయా డెయిరీ వరంగల్ షెడ్ తన వ్యాపార విస్తరణకు శ్రీకారం చుట్టింది. ప్రైవేటు డెయిరీలకు ధీటుగా పాలు, పాల ఉత్పత్తులను విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం విజయా డెయరీ పాలు, పెరుగు ఉత్పత్తులు 500గ్రాముల ప్యాకెట్లలోనే విక్రయమవుతున్నాయి. ఇక నుంచి విజయా డెయిరీ వరంగల్ షెడ్ 5, 10 కేజీల డీటీఎం (డబుల్ టోన్డ్ మిల్క్) పెరుగు బకెట్లు మార్కెట్‌లో అందుబాటులో ఉండబోతున్నాయి. వీటితో పాటు రూ.10కి 150 మిలీ టోన్డ్ మిల్క్ (టీఎం), రూ.10కి 120 గ్రాముల టీఎం పెరుగు ప్యాకెట్లు, ఒక కేజీ టీఎం పెరుగు బకెట్, 400 గ్రాముల టీఎం పెరుగు ప్యాకెట్, 900 గ్రాముల డీటీఎం పెరుగు ప్యాకెట్ కూడా మార్కెట్‌లో విక్రయించనున్నది. మార్కెట్‌లోకి ఈ కొత్త ఉత్పతుల విడుదల కార్యక్రమం ఈనెల 24న ఉదయం 11.30 గంటలకు విజయ డెయిరీ వరంగల్ షెడ్‌లో నిర్వహిస్తున్నట్లు డెయిరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. విజయ డెయిరీ చైర్మెన్ అమిత్ రెడ్డి, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.


సరస్వతి నదితో పుణ్య స్నానాలాచరిస్తున్న భక్తులు



మరికొన్ని పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలు కదలకపోవడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్రేన్లు, ట్రాక్టర్లను ఉపయోగిస్తూ ఇరుక్కుపోయిన వాహనాలను క్లియర్ చేశారు.

శోభాయమానంగా హారతి

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కాశీ పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన హారతి శోభాయమానంగా జరిగింది. ముందుగా వారిని ఆలయానికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి వేదఘోషల నడుమ పూర్ణాహుతులతో హారతి సమర్పించారు. దీంతో ఆలయ ప్రాంగణం పుణ్య వాతావరణంతో మార్మోగింది. కాశీ పండితుల ఆలయ ఆచార సంప్రదాయాల మేరకు హారతి నిర్వహించి భక్తులకు దివ్యానుభూతిని అందజేశారు. ఈ హారతి కార్యక్రమం సరస్వతి నవరత్న మాల ఉత్సవాల్లో ఒక ముఖ్యమైన ఘట్టం అని పండితులు పేర్కొన్నారు.

హోమం నిర్వహణ

శుక్రవారం ఏకాదశిని పురస్కరించుకుని అర్చకులు ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. గ్రహ దోషాలు, పితృదోషం, వాస్తు దోషం వంటి అనేక దోషాలు నివృత్తి అవ్వడానికి, దీర్ఘాయుష్షు, శారీరక ఆరోగ్యం కలగడానికి, ఆర్థిక సంపద, ఆహార సంపద, ఆయురార్థం పెరగడానికి శ్రీ పురుష సూక్త హోమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు.

కలెక్టర్, ఎస్పీల నిరంతర పర్యవేక్షణ

సరస్వతి పుష్కరాల నిర్వహణను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు, భక్తుల ఇబ్బందులను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. రానున్న మూడు రోజులు అత్యంత కీలకమని, భక్తుల రద్దీ రోజు రోజుకు పెరుగుతుండడంతో సదుపాయాల కల్పనలో అధికారులు మరింత నిమగ్నమవ్వాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.

9వ రోజూ అదే భక్తజన హోరు

త్రివేణి సంగమం సరస్వతి నదిలో శుక్రవారం 1.30లక్షల మందికి పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. పుష్కరాలకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఉదయం 10 గంటల వరకు భక్తజన ప్రవాహం సాదాసీదాగా కొనసాగినా... ఆ తర్వాత రద్దీ పెరిగింది. వాతావరణం కూడా అనుకూలంగా ఉండడంతో భక్తులంతా ప్రశాంతంగా చల్లటి వాతావరణంలో ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది వాహనాల్లో తరలిరావచ్చారు. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో చీరె, సారె, పూలు, పండ్లు, దీపం సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పనాలు వదిలి దానధర్మాలు చేశారు. అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని మోక్షాన్ని ప్రాప్తించమంటూ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో కాళేశ్వర క్షేత్రం వేలాది మంది భక్తజనంతో కిటకిటలాడింది. అటు దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కూడా పూర్తి సామర్థ్యంతో రద్దీగా నడిచాయి.

పుష్కర తీరం.. పులకించిన భక్తులు

- 9వ రోజూ కొనసాగిన సందడి
- పలు రాష్ట్రాల నుంచి భక్తజన సందోహం
- హాజరైన హంపి పీఠాధిపతి
- కొనసాగిన ట్రాఫిక్ సమస్య.. 3 కిలోమీటర్లు నడిచిన భక్తులు
- 1.30 లక్షల భక్తుల పుణ్యస్నానాలు.. శాంతించని వరుణుడు

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రం అంతర్వాహిని సరస్వతి పుష్కరాల్లో భక్తజనం ఆధ్యాత్మిక భావంతో పులకించి పోతోంది. త్రివేణి సంగమంలో 9వ రోజు శుక్రవారం సైతం భక్తజన సందోహం నెలకొంది. పలు రాష్ట్రాల నుంచి భక్తులు వివిధ మార్గాల ద్వారా త్రివేణి సంగమం చేరుకుంటున్నారు. దీంతో భక్తజన హోరు వినిపిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి పుణ్య స్నానంతో పాటు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనంకై వచ్చే వేలాది మంది పుష్కర భక్తులకు ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. అధికార యంత్రాంగం పలు రకాల చర్యలు చేపట్టినా, చివరికి వన్‌వేలు ఏర్పాటు చేసినా వేలాదికి పైగా వాహనాల రాకతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. గురువారం కంటే శుక్రవారం ఆలయానికి భక్తుల సంఖ్య పెరిగింది. భూపాలపల్లి నుంచి కాళేశ్వరం చేరుకునే వాహనాలను అధికారులు వన్‌వేలోనే కొనసాగిస్తున్నారు. కురిసిన వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే లక్ష్యంతో కాళేశ్వరంకు వాహనాలను మళ్లించారు. దీంతో అన్నారం, చంద్రుపల్లి, పూస్కుపల్లి, ఇప్పలబోరు మీదుగా కాళేశ్వరం చేరుకున్నాయి. ఈ క్రమంలోనే క్షేత్రానికి 5కిలోమీటర్ల దూరం నుంచే భక్తులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా కాళేశ్వరం చేరుకునే సమీపంలోనే మరో రెండు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసి వాహనాలకు కాస్త ట్రాఫిక్‌కు ఉపశమనం కలిపించారు. మరికొందరు భక్తులు పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను నిలుపక ముందే ఆర్టీసీ బస్సుల నుంచి దిగి కాలినడకన త్రివేణి సంగమానికి బయలుదేరారు.


సరస్వతి విగ్రహం వద్ద భక్తుల రద్దీ

హాజరైన హంపి పీఠాధిపతి


నదిలో స్నానమాచరిస్తున్న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

దక్షిణ కాశీగా పిలువబడే కాళేశ్వర క్షేత్రం, త్రివేణి సంగమాన్ని హంపి విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి శుక్రవారం సరస్వతి నదిలో పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం ముక్తీశ్వర ఆలయంలో తూర్పు ద్వారం నుంచి మంగళ వాయిద్యాలతో, వేద మంత్రాలతో, పూర్ణకుంభ స్వాగతం పలకగా స్వామి వారి సన్నిదానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామీజీకి సరస్వతి విగ్రహంతో పాటు పట్టు వస్త్రాలను దేవాదాయ శాఖ అధికారులు అందజేశారు. భక్తులకు స్వామీజీ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం నర్సంపేట, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి కుటుంబ సభ్యులతో నదిలో స్నానం ఆచరించి ముక్తీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుభానంద దేవి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ శేష వస్త్రాలతో ఎమ్మెల్యేను సన్మానించారు.

3 కిలోమీటర్ల మేర కాలినడక

కాళేశ్వరం(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలో సరస్వతి పుష్కరాల్లో ఎన్ని ఏర్పాట్లు చేసినా లక్ష మందికి పైగా వస్తున్న భక్తజనంతో నిష్ప్రయోజనం అవుతున్నాయని చెప్పవచ్చు. శుక్రవారం పుష్కరాల తొమ్మిదో రోజు వేల సంఖ్యలో ప్రైవేట్ వాహనాల్లో వచ్చిన వేలాది మంది భక్తులు ఇబ్బందులు పడ్డారు. పుష్కర ఘాట్‌కు సుమారు 3కి.మీలకు పైగా దూరంలో ఉన్న పూసుకుపల్లి వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ఏరియాలో ప్రైవేట్ వాహనాలను నిలిపివేయడం, ఆర్టీసీ బస్సులు సైతం ట్రాఫిక్‌లో నెమ్మదిగా వెళ్తుండటంతో భక్తులు పుష్కర ఘాట్‌కు కాలినడకన వెళ్లారు. పలువురు భక్తులు పుష్కరాలకు పాదయాత్ర చేయిస్తున్నారని అధికారులపై అసహనం వ్యక్తం చేయడం కనిపించింది.


పార్కింగ్ ఏరియా నుంచి నడిచి వస్తున్న భక్తులు

కరుణించని వరుణుడు..

కురుస్తున్న వర్షాలు అటు భక్తులకు, ఇటు అధికార యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. ప్రతీ రోజు వర్షాలు కురవడంతో పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలు బయటకు తీసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా త్రివేణి సంగమానికి, ఆలయానికి వెళ్లే దారులు నిత్యం బురదమయం అవుతుండడం, అధికారులు మళ్లీ ఆదారులను కంకర, చూర వంటి వాటితో పునరుద్ధరించడం ప్రతీ రోజు ఇలానే కొనసాగుతుంది. ఓ వరణుడా కరునించవా.. అంటూ భక్తులు వాన దేవున్ని వేడుకుంటున్నారు.

వైభవంగా నవరత్నమాల హారతి

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతి పుష్కరాలను పురస్కరించుకుని తొమ్మిదో రోజైన శుక్రవారం రాత్రి 7.10 గంటల నుంచి 7.40 వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్నమాల హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ రాహుల్ శర్మ, వందలాది మంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా త్రివేణి సంగమం అంతర్వాహిని సరస్వతి మాతకు సమర్పించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సాంస్కృతిక విలువలు, ధార్మిక పరంపరను ఉత్సవాల ద్వారా భవిష్యత్ తరాలకు అందించడం సంతోషకరమన్నారు. వర్షంలో సైతం అర్ధగంట పాటు నిర్వహించిన నవరత్నమాల హారతి కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శివసత్తుల పూజలు


నది తీరంలో పూజలు చేస్తున్న శివసత్తులు

కాళేశ్వరం (ఆంధ్రజ్యోతి): సరస్వతి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శివసత్తులు నదీ తీరంలోని శివుడు, నంది విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టారు. అలాగే శివుడు, నంది విగ్రహాల వద్ద దీపాలను వెలిగించారు.

అమ్మా.. వసతులెలా ఉన్నాయి..

భక్తులతో కలెక్టర్ మాట ముచ్చట


భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): అమ్మా... పుష్కరాల వసతులు ఎలా ఉన్నాయి..? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అంటూ భక్తులతో నేరుగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముచ్చటించారు. శుక్రవారం ముక్తీశ్వర స్వామి ఆలయంలో క్యూలైన్‌లో ఉన్న భక్తులను ఆరా తీశారు. కురుస్తున్న వర్షాలతో కాస్త ఇబ్బందులు ఉన్నాయని మిగతా ఏర్పాట్లన్నీ బాగున్నాయని కలెక్టర్‌కు భక్తులు వివరించారు. కలెక్టర్ నేరుగా భక్తులను అడిగి తెలుసుకోవడంతో ఆనందం వ్యక్తం చేశారు.

టోల్ వసూలు చేయొద్దు

కాళేశ్వరానికి వచ్చే ప్రైవేట్ వాహనాలకు టోల్ వసూలు చేయొద్దని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. టోల్ వసూలుతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సిబ్బదిని ఏర్పాటు చేసి టోల్ వసూలు చేయకుండా పర్యవేక్షణ చేయాలని డీపీవోకు సూచించారు.

తాతాల్కిక రోడ్డు మార్గాన్ని పటిష్టం చేయాలి

గోదావరి నది ఒడ్డున ప్రధాన ఘాట్ నుంచి సరస్వతి ఘాట్ వరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డును పటిష్టం చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం రోడ్డును ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తులు, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని మట్టి రోడ్డును పటిష్టం చేయాలన్నారు. అనంతరం టెంట్ సిటీని పరిశీలించి బురద, మట్టి లేకుండా స్టోన్ డస్ట్ వేసి టెంట్లను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

పుష్కరాల్లో వైర్‌లెస్ కమ్యూనికేషన్ సేవలు

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా సత్వర సమాచార సేకరణకు వాకీ టాకీ(వైర్‌లెస్ కమ్యూనికేషన్) సేవలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఆధ్వర్యంలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసి అధికారులతో నేరుగా కమ్యూనికేషన్ జరిపేలా ఏర్పాట్లు చేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయాన్ని మెరుగుపర్చేందుకు వాకీటాకీల సేవలను వినియోగిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీరాజ్, ఆర్టీసీ, దేవాదాయ, విద్యుత్, డీఆర్డీవో, భద్రత, రవాణా, పారిశుధ్యం వంటి అంశాల్లో సమయానికి స్పందించేందుకు, విపత్తులను వెంటనే అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ సాంకేతిక సేవలను వినియోగిస్తున్నారు. వాకీటాకీల ద్వారా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పడే అత్యవసర పరిస్థితులను వెంటనే గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీటి వినియోగం ద్వారా అప్రమత్తత, వేగవంతమైన స్పందన, సమర్థవంతమైన నిర్వహణ సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు.


నది హారతి సమీపంలో ఉన్న చెత్త సంచులు

నదీ తీరంలో చెత్త కుప్పలు

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను ప్లాస్టిక్ సంచుల్లో వేసి అక్కడే వదిలేశారు. సరస్వతి నది హారతి ఇచ్చే ప్రాంతానికి సమీపంలో చెత్త సంచులను వదిలేశారు. చెత్త సంచులు భక్తులు నడిచే మార్గానికి దూరంగా ఉన్నా భారీగా భక్తులు తరలి రావడం వల్ల వాటి పక్క నుంచే నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సేకరించిన చెత్తను సంచుల్లో నింపి ట్రాక్టర్లలో వెంట వెంటనే తరలించాలని భక్తులు కోరుతున్నారు.

భక్తుల సేవలో పోలీసులు


వృద్ధురాలిని ప్లాస్టిక్ కుర్చీలో పైకి తీసుకెళ్తున్న పోలీసులు

కాళేశ్వరం (ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాల్లో భాగంగా నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని పోలీసులు ప్లాస్టిక్ కుర్చీలో కూర్చొబెట్టుకొని మెట్లు ఎక్కించారు. సరస్వతి పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానం ఆచరించి మెట్లు ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్న వృద్ధురాలిని అక్కడ ఉన్న పోలీసులు గమనించి ప్లాస్టిక్ చైర్‌లో కూర్చొబెట్టుకొని పైకి ఎక్కించారు. ఒకరిద్దరు పోలీసుల దురుస ప్రవర్తన మినహా పోలీసుల సేవలను పలువురు అభినందిస్తున్నారు.

లక్షలాదిగా వాటర్ బాటిళ్ల విక్రయాలు


ఓ వ్యాపారి వద్ద నిల్వ ఉంచిన వాటర్ బాటిళ్లు

కాళేశ్వరం (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలకు నిత్యం లక్షకు పైగా భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరిస్తుండగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ నిత్యం ప్రైవేట్‌గా వాటర్ బాటిల్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పుష్కరాలు ప్రారంభమై 9 రోజులు గడుస్తుండగా వివిధ కంపెనీలకు చెందిన మినరల్ వాటర్ బాటిల్స్ సుమారు 3లక్షలకు పైగా విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. లీటరు, అర లీటరు, 200 మి.లీ బాటిల్స్ అమ్మకాలు సాగుతున్నాయి.

పరిమితికి మించి భక్తుల తరలింపు



భక్తులతో కిక్కిరిసి వెళ్తున్న ప్రైవేటు వాహనం

సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా తాత్కాలిక బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్ వద్దకు ప్రైవేటు వాహనాల్లో భక్తులను పరిమితికి పంపిస్తున్నారు. ఒక్కో వాహనంలో 50 నుంచి 65 మంది వరకు భక్తులను ఎక్కిస్తున్నారు. అధికారులు వద్దని వారిస్తున్నా భక్తులు మాత్రం వినకుండా పరిమితికి మించి బస్సుల్లో ఎక్కి వెళ్తున్నారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్ వరకు రెండు కిలోమీటర్ల మేర ప్రయాణంలో భయం భయంగా వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.


తాత్కాలిక బస్టాండ్ వద్ద భక్తుల రద్దీ

ఆర్టీసీ బస్సుల్లో భక్తజన సందోహం

మహాలక్ష్మి పథకంతో భారీగా తరలివస్తున్న మహిళలు

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ బస్సుల్లో భక్తజనం తండోప తండాలుగా వస్తోంది. ప్రైవేట్ వాహనాల ద్వారా నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తుండగా ఆర్టీసీ బస్సుల్లోనూ సీట్ల సామర్థ్యానికి మించి భక్తులు తరలిరావడం గమనార్హం. శుక్రవారం పలు డిపోలకు చెందిన సుమారు 300 బస్సులు 20వేలకు పైగా భక్తులను రవాణా చేయడం విశేషం. కాళేశ్వరం తాత్కాలిక బస్టాండ్ వేలాది మంది భక్తులతో సందడిగా కనిపించింది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండటంతో మహిళా భక్తులు తమ బంధువులు, మిత్రులు, కుటుంబసభ్యులతో పుష్కరాలకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి బస్సులో 60-70 మంది ప్రయాణిస్తుండగా అందులో 75 శాతం మహిళలే ఉంటున్నారు.


అటవీ ప్రాంతంలో భోజనాలు చేస్తున్న భక్తులు

పుణ్య స్నానాలు.. వన భోజనాలు

కాళేశ్వరం(ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాలకు వస్తున్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందంతో తన్మయత్వం పొందుతుండటంతో పాటు ప్రకృతి ఒడిలో సేద తీరుతున్నారు. పుష్కర స్నానానికి వేలాది వాహనాల్లో తరలివస్తున్న భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానం, కాళేశ్వర-ముక్తీశ్వరస్వామి దర్శనం చేసుకుని అటవీ ప్రాంతంలో కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు వినోదాలతో గడుపుతున్నారు. కొందరు ఇంటి వద్దనే భోజనాన్ని తయారు చేసుకుని వచ్చి తింటుండగా, మరికొందరు వనభోజనాల్లాగా అటవీ ప్రాంతంలో భోజనాలు చేసుకుని ఆరగిస్తున్నారు.

కాళేశ్వర క్షేత్రంపై కమ్ముకున్న మేఘాలు..!

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్రంలో సరస్వతి పుష్కరాల సందర్భంగా గత నాలుగు రోజులుగా ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మారిపోతోంది. శుక్రవారం సాయంత్రం సైతం వాతావరణం మారి హఠాత్తుగా కాళేశ్వర క్షేత్రంపై కారుమేఘాలు కమ్ముకున్నాయి. ప్రధాన పుష్కర ఘాట్‌పై కారుమబ్బులు కమ్ముకోవడంతో 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.


ప్రధాన పుష్కర ఘాట్‌పై కమ్ముకున్న కారుమబ్బులు

పుష్కరాల్లో సింగరేణి సంస్థ విస్తృత సేవలు

- సౌకర్యాల కల్పనకు రూ.90 లక్షల సీఎస్ఆర్ నిధులు కేటాయింపు
- భక్తుల కోసం బట్టర్ మిల్క్, తాగునీరు అందజేత, వైద్య శిబిరం, 16 బస్సుల ఏర్పాటు


స్టాల్‌ను పరిశీలిస్తున్న సింగరేణి భూపాలపల్లి జీఎం, పీఎం

కాళేశ్వరం, మే 23 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వర క్షేత్రం త్రివేణి సంగమంలో అంతర్వాహిని సరస్వతి పుష్కరాల కోసం ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి విస్తృత సేవలందిస్తుంది. పుష్కర భక్తులకు తనవంతు బాధ్యతగా పలు రకాల సేవా కార్యక్రమాలు చేపట్టింది. పుష్కరాలను వైభవంగా నిర్వహించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా సింగరేణి యాజమాన్యం రూ.90 లక్షలు సీఎస్ఆర్(కార్పొరేట్ సామాజిక బాధ్యత) నిధులు కేటాయించింది. దీంతో పాటు సింగరేణి సంస్థ సీఎండీ బలరాంనాయక్ ఆదేశాల మేరకు భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ మారుతి ఆధ్వర్యంలో పలువురు అధికారులు, సిబ్బంది పుష్కర భక్తుల సేవల్లో నిమగ్నమయ్యారు. రామగుండం ప్రాంత సింగరేణి అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. నిత్యం పుష్కర క్షేత్రంలో 8వేల బట్టర్ మిల్క్(మజ్జిగ) ప్యాకెట్లు భక్తులకు పంపిణీ చేస్తున్నారు. ప్రతి రోజు 250 క్యాన్ల ద్వారా చల్లని తాగునీటిని అందిస్తున్నారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి భక్తులను 16 సింగరేణి బస్సుల ద్వారా పుష్కర ఘాటకు చేరుస్తున్నారు. ప్రధాన పుష్కర ఘాట్‌కు వెళ్లే దారిలో స్టాళ్ల వద్ద వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. పుష్కర ఘాట్లలో పుణ్యస్నానం చేసే భక్తులకు ఇబ్బందులు కలగకుండా 40 మంది సభ్యులు గల రెస్క్యూ టీమ్స్, 35 మంది గజ ఈతగాళ్లు, 25 మంది స్కౌట్స్, 10 మంది సివిల్ వర్కర్స్, వైద్యులు, సిబ్బంది షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. పర్సనల్ మేనేజర్ పర్యవేక్షణలో ఇద్దరు సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో సింగరేణి అధికారులు, సిబ్బంది వివిధ ప్రాంతాల్లో పుష్కర భక్తుల కోసం విస్తృతంగా సేవలందిస్తున్నారు.


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సింగరేణి సిబ్బంది


భక్తులకు చల్లని నీటిని అందిస్తున్న సింగరేణి సిబ్బంది


త్రివేణి సంగమంలో విధుల్లో రెస్క్యూ టీమ్

శ్మశానవాటికలో శివుడి విగ్రహావిష్కరణ

మడికొండ (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్ట దిగువన గల హిందూ శ్మశానవాటికలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ ఆధ్య క్షుడు పెట్టెం సాంబయ్య తన తల్లిదండ్రులు పెట్టెం కట్టమ్మ-మల్లయ్య, బం ధువుల స్మారకార్థం పరమశివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం 46వ డివి జన్ కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్‌తో కలిసి మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్, వస్కుల శంకర్, బొల్లి కొండ వినోద్, నర్మెటి భిక్షపతి గాండ్ల, వస్కుల నాగరాజు, అల్లం శ్రీని వాసరావు, బిల్ల రవీందర్, ఎడబోయిన ప్రభాకర్, గడ్డం అశోక్, దువ్వ విజ య్, పల్లపు శ్రీనివాస్, మానుపాటి సారయ్య, కొమ్మాలు, జిట్ట అనిల్ పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవి ష్కరిస్తున్న కార్పొరేటర్ సరోజన తదితరులు

రాకేష్ మృతదేహం కోసం ఎదురుచూపులు

నారాయణపూర్ వెళ్లిన బంధువులు

మృతదేహాన్ని పోలీసులు ఇవ్వకపోవడంతో నిరీక్షణ



బూర రాకేష్ (ఫైల్)

హసన్‌పర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ మాడ్ అటవీ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావో యిస్టు అగ్రనేత కేశవరావు అలియాస్ బసవరాజ్‌తో పాటు పలువురు మావో యిస్టుల మృతదేహాలను నారాయణపూర్ పోలీస్‌లైన్‌లో భద్రపరిచారు. వీరిలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన మావోయిస్టు అగ్రనేత బసవరాజ్ కంప్యూటర్ ఆపరేటర్ బూర రాకేష్ (32) మృతదేహం కూడా ఉంది. గురువారం రాత్రి చింతగట్టు నుంచి మృతుడి తండ్రి బాబుతో పాటు వారి బంధువులు నారాయణపూర్ పోలీస్‌లైన్‌కు తరలివెళ్లారు. అయితే అక్కడి పోలీసులు శుక్రవారం రాత్రి వరకు రాకేష్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆందోళనకు గురవుతున్నట్లు తెలి సింది. రాకేష్ మృతదేహాన్ని అప్పగించాలని కోరుతూ ప్రజాసంఘాల నాయ కులు, పౌర హక్కుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. రెండు రోజులుగా ఎన్‌కౌంటర్ మృతుల పార్థివదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్ప గించకపోవడంతో మృతుల బంధువులు అక్కడే నిరీక్షిస్తున్నారు. శనివారం కూడా అక్కడే ఉండి చత్తీస్‌గఢ్ పోలీస్‌లైన్ అధికారులతో మాట్లాడి మృతదేహాలను అప్పగించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అమరవీ రుల బంధువుల కమిటీ సంఘాలతో పాటు పలు సంఘాల నాయకులు కోరారు. శనివారం రోజు చత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయం ఎలా ఉంటుందోనని ఎన్‌కౌంటర్ మృతుల బంధువులు ఎదురు చూస్తున్నారు. ఒక వేళ అక్కడి పోలీసులు సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుంటే శనివా రం రాత్రి వరకు రాకేష్ మృతదేహం చింతగట్టుకు చేరుకునే అవకాశం ఉందని మృతుల కుటుంబ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భవనాలకు ఫైర్ సేఫ్టీ పరికరాలు తప్పనిసరి

డీఎఫ్‌వో శంకర్‌లింగం

ముఖాముఖి



ప్రశ్న : వేసవిలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరుగుతాయి?

జవాబు : వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో గడ్డివాములు, పాత ఇండ్లు, పూరి గుడిసెలు, పెద్దఎత్తును డంప్ చేసిన చెత్తపై అగ్ని ప్రమాదాలు జరుగుతాయి.

ప్ర : నగరంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరుగుతాయి?

జ : ప్రస్తుతం వరంగల్ నగరంతో పాటు హనుమకొండలో చాలా ప్రాంతాల్లో దగ్గర దగ్గరగా నిర్మించిన ఇండ్లు, కమర్షియల్ షాపులలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉంటాయి. చాలా షాపులు దగ్గరగా కలిసి ఉండడం, కరెంటు సరఫరాపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి.

ప్ర : ప్రమాదాలు సంభవించే ప్రదేశాలను వెల్లగిస్తారా?

జ : ప్రధానంగా వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, పిన్నవారిస్ట్రీట్, హనుమకొండ చౌరస్తాలోని కుమార్‌పల్లి మార్కెట్‌రోడ్డు, టైలర్‌స్ట్రీట్, అమృత థియేటర్ రోడ్డు, కొత్తబస్‌స్టేషన్ రోడ్డులో ప్రస్తుతం ఉన్న కమర్షియల్ షాపులు ప్రాంతాల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. దీనిపై షాపుల యజమానులకు కౌన్సెలింగ్ చేసి అవగాహన కల్పించాము.

ప్ర : అగ్ని ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

జ : కమర్షియల్ కాంప్లెక్స్‌లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులతోపాటు పెద్ద పెద్ద భవనాల యజమానులు నిబంధనలకు అనుగుణంగా ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చుకోవాలి. ఆర్నెళ్లకోసారి విద్యుత్ సరఫరాకు ఉపయోగిం చిన వైర్లను చెక్ చేయించాలి. సెల్లార్‌లలో చెత్తను డంప్ చేయకుండా జాగ్రత్త పడాలి.

- వరంగల్ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నమ్మించి నట్టేట ముంచాడు..

(5వ పేజీ తరువాయి)

చేసి ఇచ్చేవాడు. కార్డు నెంబరు, బ్యాంకు పేరు ఇతరత్రా వివరాలు ఇస్తే చా లు.. స్వైప్ చేసిన తర్వాత ఓటీపీ చెప్పగానే ఆ కార్డు పరిమితి మేరకు డబ్బు ను నగదు రూపంలో వెంటనే అందచేసేవాడు. దీంతో చాలా మంది క్రెడిట్ కార్డుదారులు ఈయన వద్దకు వచ్చి తమ కార్డులపై నగదు డ్రా చేసుకొని వెళ్లే వారు. మొదట్లో కార్డును స్వైప్ చేయగానే డబ్బులు ఇచ్చేవాడు. కానీ ఆ తర్వా త తన దగ్గరికి వచ్చేవారికి డబ్బును వెంటనే ఇవ్వకుండా తనకు అవసరముం దని, కొద్దిరోజుల తర్వాత ఇస్తానని, ఆ మేరకు వడ్డీ కూడా ఇస్తానని చెప్పి మభ్యపెట్టేవాడు. ఇట్లా చాలామంది నుంచి క్రెడిట్ కార్డు స్వైప్ చేసి సుమారు రూ. 50లక్షల వరకు డబ్బును తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. నాలుగు రోజుల కిందట ఎవరికీ కనిపించకుండా పోయాడు. షాపునకు తాళం వేసి ఉండడంతో లబోదిబోమంటున్నారు. ఈయన దగ్గరికి వచ్చిన వారిలో క్రెడిట్ పరిమితి రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు ఉన్నవారు ఉన్నారు. బాధితు లు ఈ మేరకు హనుమకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు న్యా యం చేయాలని అర్థిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హనుమకొండ సీఐ వై.సతీష్ తెలిపారు.

గంజాయి ముఠా ఆటకట్టు

(5వ పేజీ తరువాయి)

మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన గుగులోత్ భాస్కర్, నల్లగొండ జిల్లా పెద్దమునిగేడు గ్రామానికి చెందిన కేతావత్ రాము, మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లి పూరితండాకు చెందిన కొర్ర వినోద్‌లను కలిశాడన్నారు. అందరూ కలిసి వరంగల్ మీదుగా హైదరాబాద్‌కు గంజాయిని తరలించి అక్కడ ఎక్కువ రేటుకు విక్రయించాలని పూనుకున్నారని, ఈ క్రమం లో ఉర్సు వద్ద అరెస్టు అయ్యారని తెలిపారు. కాగా, నిందితుల్లో గుగులోత్ భా స్కర్, కొర్ర వినోద్, కేతావత్ రాము పలుసార్లు గంజాయి తరలిస్తూ పట్టుబడి జైలుకు వెళ్లగా, ఈ రవాణాలో పాలుపంచుకున్న మరో ముగ్గురు నిందితులు పోలీసులకు చిక్కకుండా పరారైనట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవ డంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సై శ్రీకాంత్, రాజు, మొగిలి, హెడ్ కానిస్టేబుళ్లు రంగయ్య, నిరంజన్, సోమలింగం, శ్రీనువాస్, కానిస్టేబుల్స్ ఎ.రాజు, కె.శ్రీనివాస్, రాజేశ్, బి.శ్రీనివాస్, పి.విజయ్, రహీమ్, కుమారస్వామి, సంపత్, సతీష్, సునిల్‌ను డీఎస్పీ అభినందించారు.

పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న నిర్వహించతలపెట్టిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ గ్రామపాలన అధికారుల పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పరీక్షల ఏర్పాట్లపై వివిధశాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల వద్ద నిబంధనల మేరకు ఏర్పాట్లు ఉండాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద తగిన పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. రెండు పరీక్షల నిర్వహణ దృష్ట్యా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ ఈ నెల 25న ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్ పరీక్ష, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుందన్నారు. ఈ పరీక్ష కోసం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షను 4,141 మంది అభ్యర్థులు రాయనున్నారని తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. అదేవిధంగా ఈ నెల 25వ తేదీన గ్రామ పాలన అధికారుల పరీక్ష ఉంటుందన్నారు. 132 మంది అభ్యర్థులు ఈపరీక్షను రాయనున్నట్లు తెలిపారు. గ్రామ పాలన అధికారుల పరీక్ష నిర్వహణకు హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యూపీఎస్సీ సివిల్స్, గ్రామ పాలన అధికారుల పరీక్ష నిర్వహణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ వై.వి .గణేష్, యూపీఎస్సీ అధికారి కేశ్‌రామ్‌మీనా, ఏసీపీ నర్సింహరావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీశంకర్, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పీ ప్రావీణ్య

చట్టబద్ధమైన దత్తతతోనే శిశువుల పరిరక్షణ

చట్టబద్ధమైన దత్తత ప్రక్రియతోనే శిశువుల పరిరక్షణ సాధ్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. హనుమకొండ బాలసదనంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అనుబంధ శిశు గృహ ఇంటర్ కంట్రీ అడాప్షన్ శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చట్టబద్ధమైన దత్తత ప్రక్రియలో భాగంగా బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న బాలిక (10) వి వరాలను దత్తత వనరుల విభాగంకు ఆన్‌లైన్ చేయగా అమెరికాకు చెందిన దంపతులు అంతర్ రాష్ట్ర దత్తత కోసం దరఖాస్తు చేసుకోగా వారికి అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాతృత్వం ఒక వరమని, అందుకు చట్టబద్ధమైన దత్తత ప్రధాన మార్గమని అన్నారు. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తతను తీసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 10 మంది పిల్లలను ఇంటర్ కంట్రీ అడాప్షన్‌లో భాగంగా ఇటలీ, మాల్టా, లండన్, అమెరికా దేశాలకు దత్తత ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సందసాని రాజేంద్రప్రసాద్, బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్.అవంతి, బాల సదనం సూపరింటెండెంట్ ఎం.కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.మౌనిక, దత్తత కేంద్రం సోషల్ వర్కర్ సంగిచైతన్య తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయండి

మున్సిపల్ కమిషనర్లతో సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి

వరంగల్ కార్పొరేషన్, మే 23 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణా ళికను పక్కాగా అమలు చేయాలని సీడీఎంఏ డాక్టర్ శ్రీదేవి అన్నా రు. రాష్ట్రంలోని పలు మున్సిపల్ కార్పొరేషన్‌ల కమిషనర్‌లతో హైద రాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లా డారు. సమర్థవంతంగా అమలుపరిచేందుకు తగు సూచనలు చేశారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్లలో ఇకపై అమలు చేయనున్న వంద రకాల సేవలు ప్రజలకు చేరువ య్యేలా ప్రణాళికలు చేయాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు ఎంపిక చేసిన బ్రాండ్ అంబాసిడర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అమృత్ మిత్ర పథకంలో భాగంగా మెప్మా సిబ్బంది పార్కులతోపాటు జంక్షన్‌లను గుర్తించి అభివృద్ధి చేస్తామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా తడి, పొడి చెత్తను వేరుగా చేసి స్వీకరించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. భువన్ యాప్ ద్వారా ప్రాపర్టీలను తనిఖీ చేయాలని అన్నారు. ఎన్‌జీవోలు, మెప్మా సిబ్బంది సమన్వయంలో వంద రోజుల కార్యక్రమాలను వి జయవంతం చేయాలని సూచించారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఇప్పటి వరకు బల్దియా పరిధిలో శానిటేషన్ పనులు వందశాతం పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో బల్దియా నుంచి సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, హెచ్‌వో రమేష్, ఈఈలు రవికుమార్, మాధవీలత పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

ఎన్‌కౌంటర్ మృతదేహాలను అప్పగించాలి

అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యురాలు శాంతక్క

హసన్‌పర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరులైన మృతుల కుటుంబసభ్యులకు వారి మృ తదేహాలను అప్పగించాలని అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యురాలు శాంతక్క ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. మాడ్ అటవీ ప్రాంతంలో జరిగి న ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన బూర రాకేష్ కుటుంబ సభ్యులను శుక్ర వారం చింతగట్టులోని వారి స్వగృహంలో ఆమె పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాకేష్ మృతదేహం కోసం ఎదురుచూస్తున్న కుటుం బసభ్యులను ఓదార్చారు. అనం తరం ఆమె మాట్లాడుతూ.. రాకేష్ మృత దేహాన్ని రెండురోజులుగా కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడం ప్రజా స్వామ్య విరుద్ధమన్నారు. మాడ్ అటవీ ప్రాంతంలో జరిగినట్లుగా చెబుతు న్న ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరపా లని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టింపులేనితనంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి రాకేష్ మృతదేహంతోపాటు మిగ తా వారి మృతదేహాలను వారివారి కుటుంబ సభ్యులకు అప్పగించి అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిం చాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె వెంట అమరుల బంధు మిత్రుల కమి టీ సభ్యురాలు భారతక్క, మృతుడి సోదరుడు రంజిత్‌కుమార్, వివిధ ప్రాంతా ల నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు, మిత్రులున్నారు.

లోతట్టు ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే నాయిని



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

రెడ్డికాలనీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లోతట్టు ప్రాంతాలను ఎంపిక చేసి ముందస్తు చర్యలు చేప డుతున్నట్లు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హను మ కొండలోని 4వ డివిజన్ పరిధిలోని యాదవనగర్, లోటస్ కాలనీలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు నగరంలో అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, మహ్మద్ జాఫర్, రఘుయాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి, మూగల విజయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

హనుమకొండ చౌరస్తా: హనుమకొండ 9వ డివిజన్ సుధానగర్‌లో జీ డబ్ల్యూఎంసీ సాధారణ నిధులు రూ.25లక్షల వ్యయంతో నిర్మించ తల పెట్టిన సీసీ రోడ్డు పనులకు మేయర్ గుండు సుధారాణితో కలిసి వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు డివిజన్లు, కాలనీల్లో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను గుర్తించి వెంటనే అభివృద్ధి చేస్తామన్నారు. నగర అభివృద్ధిలో ప్రజలు పాల్గొని సహకరిం చాలని రాజేందర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో 9వ డివిజన్ కార్పొరేటర్ చీకటి శారద-ఆనంద్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి. జాఫర్, నాయకులు చీకటి ఆనంద్, ప్రభాకర్, డాల్ఫిన్ రవి, సముద్రాల రవీందర్, శేషాద్రి నాగరాజు, సురాసి విక్రమ్, ముద్దం కుమార్, ఎండీ. కుర్షీద్, రవీందర్, మున్ని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంక్షేమమే లక్ష్యం


వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డ్రైవర్ల సంక్షేమమే తన లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జహంగీర్ అలీ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని కార్యాలయంలో అసోసియేషన్ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.డి.సాబీర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కరీంనగర్ జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా పని చేసిన సర్దార్ మంజిత్‌సింగ్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన సయ్యద్ హసమ్ హుస్సేని సంఘానికి సంబంధించిన నిధులను దుర్వినియోగం చేసినందున వారిని సంఘం నుంచి తొలగించినట్లు జహంగీర్ అలీ తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి సంబంధం లేని వ్యక్తులు సభ్యత్వ రుసుం వసూలు చేస్తున్నా రని ఆరోపించారు. ప్రభుత్వ డ్రైవర్ల ఉద్యోగాలను భర్తీ చేయడంతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నూతన వాహనాలను కొనుగోలు చేయా లని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ డ్రైవర్ల సంక్షేమ సంఘం వరం గల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ప్రకాశ్, ఉపాధ్యక్షుడు భాస్కర్, కోశాధికారి ఎం.డి.అబ్రహీం, జిల్లా నాయకులు ఎం.డి.వలీపాష, పోరిక పూల్‌సింగ్, సయ్యద్ ఇస్మాయిల్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో విచారణ

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డులో అవకతవకలు, అక్రమ డబ్బుల వసూళ్లతో పాటు తరగతుల నిర్వ హణ, ఇంటర్నల్ పరీక్షలతో పాటు పలు ఆరోపణలపై విచారణ ప్రారం భమైంది. ఈ మేరకు శుక్రవారం విచారణ కమిటీ చైర్మన్ కేయూ జియా లజీ విభాగాధిపతి ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, కమిటీ సభ్యులు ప్రొఫెసర్ టి. సవితాజ్యోత్స్న, ప్రొఫెసర్ ఎస్.జ్యోతిల కమిటీ విచారణ చేపట్టారు. మొదట గా కమిటీ బాధ్యులు కేయూ క్యాంపస్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏటీబీటీ ప్రసాద్, అధ్యాపకులు జోత్స్న, కిరణ్, కుమార్ ఒక్కొక్కరితో ప్రత్యేకంగా విడివిడిగా మాట్లాడారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సులలో విద్యా ర్థులు ఎందరు..? క్లాస్‌లు ఎవ్వరెవ్వరు తీసుకుంటున్నారు? ఏమేమీ సబ్జెక్టు లు బోధిస్తున్నారనే విషయాలను అడిగి నోట్ చేసుకున్నారు. సిలబస్ పూర్తి చేశారా..? లేదా? అన్ని ప్రశ్నించారు. విద్యార్థుల అటెండెన్స్ రిజిస్ట్రర్లు ఏవంటూ ప్రశ్నించారు. అధ్యాపకులందరూ సిలబస్ పూర్తి చేశామని కమి టీ బాధ్యులకు సమాధానం ఇచ్చారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఇద్దరు అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆయా సబ్జెక్టుల్లో సిల బస్ పూర్తికాలేదని కమిటీకి అధ్యాపకులు సమాచారం అందించారు. అయి తే అయా సబ్జెక్టులు పూర్తి కాకుండనే విద్యార్థులకు ఇంటర్నల్ పరీక్షలు ఎలా నిర్వహించారని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. కళాశాలకు సంబంధం లేని బయటి వ్యక్తి ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు డ్రెస్ ఇప్పిస్తామని డబ్బులు వసూళ్లు చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. కళాశాలలో వి ద్యార్థుల అటెండెన్స్ రిజస్ట్రర్లను నిర్వహించకపోవడాన్ని గుర్తించారు. బీపీఈడీ, ఎంపీఈడీ చాలా అడ్మిషన్లు ఉండగా స్వల్పంగానే క్లాస్‌లకు వి ద్యార్థులు హాజరవుతుండగా ప్రిన్సిపాల్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అలాగే గ్రౌండ్‌లో ఫిజికల్ ఈవెంట్ల నిర్వహణ అస్తవ్యస్థంగా మారిందని గుర్తించారు. కళాశాలలో విద్యార్థులతోనూ మాట్లాడిన తర్వాత కమిటీ ఓ నిర్ణయానికి వస్తోందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా విచారణ కమిటీ ప్రొఫెసర్లు స్పోర్ట్స్ బోర్డులో జరిగిన కార్యకపాలను పరిశీలించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు.

టీఆర్‌ఎల్‌డీ జిల్లా అధ్యక్షుడిగా చెన్నయ్య



వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణానికి చెందిన చెన్నయ్య తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ (టీ ఆర్‌ఎల్‌డీ) పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితుల య్యారు. టీఆర్‌ఎల్‌డీ జాతీయ అధ్యక్షుడు కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రి జయంత్‌సింగ్ ఆదేశం మేరకు మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి దిలీప్‌కుమార్ శుక్ర వారం నియా మక ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో టీఆర్‌ఎల్‌డీ పార్టీని బలో పేతం చేయడానికి కృషి చేసి, ప్రజాసమస్యలపై పోరాడుతానని చెన్నయ్య పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్య లు చేపట్టాలని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌ను ఆయన అకస్మికంగా సందర్శించి పోలీసుల పనితీరును, రికార్డులను అడిగి తెలుసుకున్నారు. మొట్టమొదటిసారిగా పోలీసుస్టేషన్‌ను పరిశీలిచేందుకు హాజరైన కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డిని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు పూల మొక్కను అందించి సాదరంగా ఆహ్వానించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏసీపీ వెంట ఇన్‌స్పెక్టర్ వట్టే చేరాలుతో పాటు ఎస్సైలు దేవేందర్, రవి, సిద్దయ్య, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది ఉన్నారు.

ఎంబీఏ పరీక్ష కేంద్రం తనిఖీ

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగంలో జరుగుతున్న ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షల కేంద్రా న్ని కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరవేణి, ప్రగతిలు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ఇంగ్లిష్ ప్రాధాన్యం తగ్గించడం సరికాదు

బీవోఎస్ చైర్‌పర్సన్ నిర్మల



సమావేశంలో పాల్గొన్న నిర్మల, దీపా జ్యోతి, నవీన్ తదితరులు

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సుల్లో మూడో ఏడాది ఇంగ్లిష్ సబ్జెక్టు ప్రాధాన్యతను తగ్గిస్తూ 20 క్రెడిట్స్ నుంచి 12 క్రెడిట్స్‌కు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కేయూ ఇంగ్లిష్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ పోల నిర్మల చెప్పారు. శుక్రవారం కేయూ ఇంగ్లిష్ విభాగంలో వర్సిటీ పరిధిలోని ఆంగ్ల విభాగం అధ్యాపకులు, బోధకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీవోఎస్ చైర్‌పర్సన్ నిర్మల అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యామండలి నేతృత్వంలో ఆన్‌లైన్‌లో సమావేశం జరిగిందన్నారు. ఆయా సమావేశంలో సంబంధిత అధికారులు ఇంగ్లిష్ క్రెడిట్స్‌ను 20 నుంచి 12కు తగ్గించారని పేర్కొన్నారు. అలాగే ఆంగ్లభాష బోధనను డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో తొలగిం చారని చెప్పారు. 20 ఉన్న క్రెడిట్స్‌ను 12కు తగ్గించారని వెల్లడించారు. ఇంగ్లిష్ క్రెడిట్స్ తగ్గింపుతో పోటీ ప్రపంచంలో విద్యార్థులలో భాషా నైపు ణ్యాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విదే శీ వర్సిటీలు ఆంగ్లభాషలో 20 క్రెడిట్స్‌ను తప్పనిసరి చేశాయని స్పష్టం చేశారు. 20 నుంచి 12 క్రెడిట్స్‌కు తగ్గించడం వల్ల విదేశీ ఉన్నత విద్యా అవకాశాలపై చాలా ప్రభావం పడుతోందని చెప్పారు. ఆంగ్లవిభాధిపతి డాక్టర్ బి.దీపాజ్యోతి, డాక్టర్ ఆర్.మేఘనారావు, హైదరాబాద్ ఇఫ్లూ ప్రొఫె సర్ సి.శారద, కేయూ పాలక మండలి సభ్యులు, ప్రిన్సిపాల్ ఎం. నవీన్, వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు డాక్టర్ రామ్ భాస్కర్‌రాజు, డాక్టర్ శ్రీనాథ్, సత్యనారాయణ, డాక్టర్ జులా సత్యం, చందూలాల్, సుజా త, డి.విజయప్రకాశ్, హెప్సిబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జీవ వైవిధ్య ప్రదర్శనలు

హనుమకొండ, మే 23 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణు మాధవ్ కళా ప్రాంగణంలో రెండోరోజు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జీవవైవిధ్యంపై అవగాహన కలిగించేందుకు ఏర్పాటు చేసిన అటవీ, సేంద్రియ, దేశీయ విత్తన, పల సంత సందర్శకులను వి శేషంగా ఆకట్టుకున్నది. చెట్ల పరిరక్షణపై గాయకులు ఎర్రన్న, వెంకన్న పాడిన పాటలు ప్రేక్షకులను ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. జయకర్ సర్ప సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. సర్పాల ప్రదర్శను ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో 150 మొక్కలను నాటారు. పెండ్లి ఉపేందర్ బట్ట సంచులను, మహర్షి గోశాల రమేష్ పిచ్చుక గూళ్లను, మున్సిపల్ ఉద్యానవన శాఖాధికారి అలంకరణ మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై ముద్రించిన కరపత్రాలను రతన్‌సింగ్ ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు జి.పురుషోత్తం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర బాధ్యుడు లక్ష్మారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్ కేయూ సెనేట్ మెంబర్ అనితారెడ్డి, సీనియర్ పర్యావరణ వేత్త సుదర్శన్ రెడ్డి, మండల పరుశరాములు, ఆచార్య రామేశ్వర్, పొన్నాల రామ్మోహన్, ప్రభాకర్ రావు, గ్రామ భారతి డాక్టర్ నాగభూషణం, డాక్టర్ జగదీష్ ప్రసాద్ అరసం బ్రహ్మచారి యూఎఫ్‌ఈపీ ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, వెంకటేశ్వర్‌రావు, రెహమాన్, వ్యాం సుందర్, రాములు, ప్రొఫెసర్ కేశవరావు, మ్యాజిక్ కల్యాణ్, జ్యోతి, జీవ వైవిధ్య మండలి జిల్లా కోఆర్డినేటర్ అన్నమనేని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో మొక్క నాటుతున్న దృశ్యం

భోజన కుతూహలం

దగ్గు మందు.. కసింద

ప్రకృతి మనకు అందించిన ఔషధ సంపదలో కసింద కూడా ఒకటి. దీనినే కసివింద అని కూడా పిలుస్తారు. ఇది సాధారణంగా మనకు రోడ్ల పక్కన.. పొలాల గట్ల మీద కనిపిస్తుంది. దీనికి సంస్కృతంలో కాసమర్ద అనే పేరు కూడా ఉంది. ఈ పేరు ప్రకారం చూస్తే.. కాస అంటే దగ్గు.. మర్ద అంటే దానిని తగ్గించేది అని అర్థం. అంటే ఇది దగ్గుకు మందు. ఈ మొక్క ఆకులు కొద్దిగా చేదు, తీపి రుచులు కలిగి ఉంటాయి. ఇవి వేడి చేస్తాయి. కానీ పైత్యాన్ని తగ్గిస్తాయి. కఫం, వాతం లాంటి దోషాలను తగ్గించడంతో పాటు అజీర్తిని సరిచేస్తాయి. ముఖ్యంగా గొంతుకు ఉపశమనం ఇస్తాయి. దగ్గు, ఆయాసం లాంటి సమస్యల్ని ఉపశమింపజేస్తాయి. కసింద వేరు, ఆకుల్ని ఎండించి పొడి తయారు చేసి వెన్నతో కలిపి తామర, ఎగ్జిమా, నల్ల మచ్చలపై రాస్తే ఉపశమనం కలుగుతుంది. గాయాలు త్వరగా మానతాయి. ఈ కసింద మొక్కతో కొన్ని ప్రాంతాల్లో రకరకాల వంటలు చేస్తారు. అవేమిటో ఇప్పుడు చూద్దాం.

కసింద ఆకుల పప్పు

లేత కసింద ఆకులను తీసుకొని బాగా కడగాలి. వీటిని పెసరపప్పు లేదా కందిపప్పు, కొద్దిగా బియ్యపు పిండి వేసి ఉడికించాలి. ఈ మిశ్రమంలో నెయ్యి, విరియాల పొడితో తాలింపు పెట్టాలి. తగినంత ఉప్పు కలుపుకోవాలి. కొందరు రుచి కోసం ఆవాలు, జీలకర్ర, ఎండు మిరపకాయలతో కూడా తాలింపు పెట్టుకుంటారు.

కసింద కూర...

లేత ఆకులను 8 గంటల పాటు మజ్జిగలో నానబెట్టాలి. దీని వల్ల ఈ ఆకుల్లో ఉండే చేదు పోతుంది. ఈ ఆకులను బాగా కడిగి వాటిలో పాలు పోసి ఉడికించాలి. కూర దగ్గర పడిన తర్వాత నెయ్యి, ఇంగువ వేసి తాలింపు పెట్టాలి. కొందరు దీనిలో దోరగా వేయించిన ఉల్లిపాయలు కూడా కలుపుతారు.

కసింద తంబుళీ (చారు)

కొంకణి ప్రజలు లేత ఆకులతో చారును తయారుచేస్తారు. మామూలు పద్ధతిలోనే చారును తయారుచేసి దానిలో కసింద ఆకులను వేస్తారు. ఇది జలుబు, ఎలర్జీ, నోటిపూత, రక్తస్రావం లాంటి సమస్యల్ని తగ్గిస్తుంది. పుండ్లు, ఆపరేషన్ గాయాలు మానేందుకు ఇది ఉపయుక్తం.

కసింద- తేనె

కసింద ఆకులను తేనెలో నానబెట్టి.. వాటిని క్రమం తప్పకుండా తింటే అనేక ప్రయోజనాలు ఉంటాయి. వస్తుగుణదీపిక అనే గ్రంథంలో దీనిని "కసిందపులవ" అని పేర్కొన్నారు.

• గంగరాజు అరుణాదేవి



రంగురంగుల స్పాంజ్‌లను ఇలా వాడాలి

మనం సాధారణంగా వంట పాత్రలు, భోజనం చేసిన కంచాలు, గ్లాసులు, ఇతర పింగాణీ వస్తువులను తోమడానికి స్పాంజ్‌లు వాడుతూ ఉంటాం. ఇవి పలు రంగుల్లో లభ్యమవుతూ ఉంటాయి. కొన్ని గరుకుగా ఉంటే మరికొన్ని మాత్రం మృదువుగా ఉంటాయి. ఏ రంగు స్పాంజ్‌తో ఎలాంటి పాత్రలను శుభ్రం చేయాలో తెలుసుకుందాం...

- మాంసాహార వంటల కోసం ఉపయోగించిన పాత్రలు, చాకులు, కటింగ్ బోర్డు తదితరాలను శుభ్రం చేయడానికి ఎరుపు లేదా గులాబీ రంగు స్పాంజ్‌ను వాడాలి. ఇవి కొద్దిగా గరుకుగా ఉంటాయి. స్పాంజ్ మీద కొద్దిగా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి తోమితే పాత్రలకు పట్టిన ఘాటైన వాసనలు తొలగిపోతాయి.
- సీసాలు, గాజు పాత్రలు, గాజు గ్లాసులను శుభ్రం చేయడానికి నీలి రంగు స్పాంజ్‌ను ఉపయోగించాలి. ఇది గట్టిగా ఉంటుంది కానీ గరుకుగా ఉండదు. దీనితో రుద్ది కడిగితే గాజు సామాన్ల మీద గీతలు పడవు.
- నాన్‌స్టిక్ పాత్రలు, పెనాలను తోమడానికి లేత పసుపు, తెలుపు రంగు స్పాంజ్‌లను వాడాలి. ఇవి మెత్తగా ఉంటాయి. వీటితో గట్టిగా తోమినప్పటికీ నాన్‌స్టిక్ వస్తువుల మీద ఉండే కోటింగ్ పోదు. గీతలు పడవు. పింగాణీతో తయారైన కప్పులు, సాసర్లు, గిన్నెలను కూడా ఈ స్పాంజ్‌లతోనే శుభ్రం చేయాలి.
- ఆకుపచ్చ, ముదురు గోధుమ రంగుల స్పాంజ్‌లు గరుకుగా గట్టిగా ఉంటాయి. వీటితో ఇత్తడి, స్టీల్, రాతెండి, అల్యూమినియం పాత్రలు, పళ్లాలను తోమవచ్చు. అడుగు మాడిన పాత్రలు, పాలు కాచిన గిన్నెలను కూడా శుభ్రం చేసుకోవచ్చు.





ప్రాణాంతకమైన గుండె సమస్యతో పుట్టిన చిన్నారులకు, వారికి చికిత్సలు చేయించే ఆర్థిక స్థోమత లేక తల్లడిల్లే తల్లిదండ్రులకు మేమున్నామంటూ భరోసా ఇస్తోంది తెలంగాణలోని కొండపాక 'ఆనందనిలయం' ఆవరణలో ఉన్న 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆసుపత్రి. అన్ని సేవలూ ఉచితంగా అందిస్తున్న ఈ ఆసుపత్రి ఇప్పటివరకూ 108 మంది పిల్లలకు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించింది.

పసి హృదయాలకు సంజీవని

నక్షత్ర... తెలంగాణలోని నారాయణపేట జిల్లా కొల్లంపల్లికి చెందిన బలికి శివకుమార్ కుమార్తె. నక్షత్రకు గుండెకు రంధ్రం ఉన్నట్టు.. ఆమె పుట్టిన 15 రోజులకే వైద్యులు నిర్ధారించారు. నాలుగేళ్ల వయసు వచ్చినా ఆమెలో ఎదుగుదల లేదు. పైగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో సతమతమయ్యేది. శస్త్రచికిత్స చేస్తే అన్నీ సర్దుకుంటాయని వైద్యులు చెప్పారు. దానికి కనీసం రూ. 5 లక్షలు కావాలి. ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాని గురించి కనీసం ఆలోచించలేని దుస్థితి ఆ కుటుంబానిది. కన్నబిడ్డ పడుతున్న నరకయాతన చూడలేక, శస్త్ర చికిత్స చేయించే దారి లేక వేదనలో ఉన్న ఆ కుటుంబం ముందు కాంతిరేఖలా ఆవిష్కృతమయ్యింది... 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆసుపత్రి. అక్కడ ఈ నెల 13న నక్షత్ర గుండెకు సర్జరీ జరిగింది. జీవితాంతం ఆమె గుండెకు ఎలాంటి ముప్పు రాకుండా... నిపుణులైన వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఇప్పుడు ఆ ఆసుపత్రిలోనే నక్షత్ర కోలుకుంటోంది. ఆమెకు మాత్రమే కాదు... 45 రోజుల వయసున్న పసికందుల నుంచి పదేళ్ల పిల్లల వరకూ... వారి గుండె సమస్యలకు 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆసుపత్రి పరిష్కారం చూపుతోంది.

అన్నీ ఉచితమే...

దేశంలో ఏటా 2.48 లక్షల మంది పిల్లలు పుట్టుకతోనే గుండె సమస్యలకు గురవుతున్నారని అంచనా. వారిలో 60 వేల మందికి శస్త్రచికిత్సలు అవసరం. కానీ 10 వేల మందికి మాత్రమే సర్జరీ చేసే అవకాశం ఉంది. గుండె సమస్యలతో బాధపడుతున్న ఎంతోమంది చిన్నారులు సరైన చికిత్స లేక మృతిచెందుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించడం కోసం పలు ప్రాంతాల్లో చైల్డ్ హార్ట్‌కేర్ ఆసుపత్రులను శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ప్రారంభించాయి. హరియాణా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తరువాత... 4వ 'శ్రీ సత్యసాయి సంజీవని హృదయ ఆసుపత్రి'ని సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రం శివారులోని ఆనంద నిలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. లక్షల రూపాయల విలువైన శస్త్రచికిత్సలను సైతం ఈ ఆసుపత్రిలో ఉచితంగానే చేస్తారు. వైద్యపరీక్షల్లో గుండె సమస్యలు బయటపడిన చిన్నారులెవరైనా ఇక్కడకు రావచ్చు. దేశంలో ఎక్కడివారికైనా ఇక్కడ సర్జరీ చేయించుకునే అవకాశం ఉంది. ప్రాంతాలతో సంబంధం లేదు. పైరవీలు, పలుకుబడిలతో పని లేదు. ఎంతటి తీవ్రమైన గుండె సమస్యకైనా అత్యాధునిక వైద్యపరికరాల ద్వారా పరిష్కారం చూపిస్తున్నారు. పిల్లల వెంట వచ్చిన తల్లిదండ్రులు, సంరక్షకులకు ఉచితంగా భోజన, వసతి ఏర్పాట్లు కూడా ఉన్నాయి. శస్త్రచికిత్స జరిగిన పిల్లలు పూర్తిగా కోలుకునే వరకు ఇక్కడే ఉండేలా వసతులు కల్పించారు. మందులు కూడా పూర్తిగా ఉచితం. ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, క్యాథ్‌ల్యాబ్, ఎకో పరికరాలతో ఓపీడీ భవనం, వంద పడకల భవనంతోపాటు క్రిటికల్ కేర్ యూనిట్, సర్జికల్ టీమ్ ఉన్నాయి.



వారి కృషి ఎనలేనిది...

ఈ ఆసుపత్రిని ఆనంద నిలయం ఆవరణలో నిర్మించడం వెనుక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, టీటీడీ మాజీ ఈవో రమణాచారి ఎనలేని పాత్ర పోషించారు. ఆయన ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న 'ఆనంద నిలయం ట్రస్టు'కు చెందిన 100 ఎకరాల్లో ఒక చోట ఈ ఆసుపత్రిని నిర్మించాలని, ఈ ప్రాంతంలో ఆసుపత్రి ఏర్పాటు చేస్తే తెలుగు రాష్ట్రాల్లోని చిన్నారులకు ప్రయోజనం కలుగుతుందని యోచించారు. అనుకున్నదే తడవుగా 5 ఎకరాలు కేటాయించారు. పరిశోధన కేంద్రం కోసం మరో 5 ఎకరాలు ఇచ్చారు. దీనికి అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కూడా సహకరించారు. ఈ సదుద్దేశానికి మద్దతుగా 'ఆనందనిలయం ట్రస్టు' సభ్యులు సైతం ముందుకొచ్చారు. దాంతో ఆసుపత్రి నిర్మాణాన్ని 'శ్రీ సత్యసాయి సంజీవని ట్రస్టు' ఛైర్మన్ శ్రీనివాస్, సభ్యులు తక్షణమే చేపట్టారు. అద్భుతంగా భవనాలు నిర్మించారు. అత్యాధునిక వైద్య పరికరాలను తెప్పించారు. పిల్లల గుండెలకు జీవం పోసే సత్కార్యానికి శ్రీకారం చుట్టారు. 2024 నవంబర్‌లో ఈ ఆసుపత్రి ప్రారంభమైంది. ఆ నెలలో 28 మందికి, ఫిబ్రవరిలో 32 మందికి, మార్చిలో 23 మందికి, ఆ తరువాత 25 మందికి... మొత్తం ఇప్పటివరకూ 108 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేశారు.

• పైడిపల్లి అరుణ్, సిద్దిపేట
ఫొటోలు: బాబు



మానవసేవే మాధవసేవ

సత్యసాయిబాబా ఆశయాలను ఆచరిస్తూ పసి హృదయాలకు చికిత్సలు అందించే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఒక బృందంగా ఏకాగ్రతతో పని చేస్తున్నారు. హరియాణాలోని పల్వల్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, ముంబయి లాంటి నగరాల్లోనే ఇప్పటివరకు 'సంజీవని హార్ట్‌కేర్ ఆస్పత్రుల'ను ఏర్పాటు చేశాం. మొదటిసారిగా గ్రామీణ ప్రాంత పిల్లల కోసం సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలోని ఆనందనిలయాన్ని ఎంచుకున్నాం. దాన్ని అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రిగా తీర్చిదిద్దాం. 'మానవసేవనే మాధవసేవ' అని సత్యసాయి అందించిన స్ఫూర్తితో సేవలు అందిస్తున్నాం.

- **శ్రీనివాస్,** ఛైర్మన్, శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు



ఇదొక దేవాలయం

మా అబ్బాయి జగదీశ్‌ప్రసాద్‌కు పుట్టుకతోనే గుండె సమస్య ఉంది. సూర్యాపేట, ఖమ్మం, హైదరాబాద్‌లలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చూపిస్తే ఆపరేషన్ చేయించాలన్నారు. అందుకు రూ.3 నుంచి 5 లక్షల ఖర్చవుతుందని చెప్పారు. దిక్కుతోచని స్థితిలో ఉండగా... ఇక్కడ ఆస్పత్రి ఉందని తెలిసి వచ్చాం. వెంటనే అడ్మిట్ చేసుకొని ఉచితంగా సర్జరీ చేశారు. మా బాబుతో పాటు మాకు కూడా వసతి, భోజనం కల్పిస్తున్నారు. వారి రుణం తీర్చుకోలేనిది. అందుకే ఇది కేవలం ఆసుపత్రి కాదు, ఇదొక దేవాలయం.

- **సుజాత,** భీమ్లాతండా, సూర్యాపేటజిల్లా



మూడో బిడ్డను దక్కించుకోగలిగాం

గతంలో మా ఇద్దరు పిల్లలు అనారోగ్య సమస్యలతో చనిపోయారు. మూడో అబ్బాయి జహంగీర్‌కు ఇప్పుడు మూడు సంవత్సరాలు. పుట్టిన కొద్దిరోజులకే తనకు గుండెకు సంబంధించిన వ్యాధి ఉందని తేలింది. ఆపరేషన్ చేయించాలంటేనే భయం వేసింది. ఒకరోజు సినీనటుడు సుమన్‌కు తాత్కాలికంగా కారు డ్రైవర్‌గా వెళ్లాను. ఆ సమయంలో సుమన్ ఈ ఆసుపత్రి వారితో ఫోన్లో మాట్లాడడం గమనించి, నా మా అబ్బాయి సమస్య గురించి చెప్పాను. వెంటనే ఆయన ఆసుపత్రి నిర్వాహకుడు జగన్నాథశర్మతో మాట్లాడారు. మా అబ్బాయిని తీసుకువెళ్లగానే... సర్జరీ చేసి బ్రతికించారు. సుమన్‌కు, శ్రీసత్యసాయి సంజీవని వైద్యులకు కృతజ్ఞతలు.

- **షరీఫ్,** చాంద్రాయణగుట్ట

వంటిల్లు

నోరూరించే మామిడి రుచులు

మామిడి పండును గానీ కాయను గానీ చూడగానే నోరూరని వారుండరు. తియ్యటి మామిడి పండ్లతో జ్యూస్, మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్ లాంటివి తయారుచేస్తూ ఉంటాం. అలాగే పుల్లటి మామిడి కాయలతో ఆవకాయ, మాగాయ లాంటి ఊరగాయలతోపాటు రకరకాల పచ్చళ్లు పెట్టేస్తూ ఉంటాం. ఇవికాక మామిడితో తయారు చేసే విభిన్న వంటకాలు మీ కోసం...





మామిడిపండు సలాడ్

కావాల్సిన పదార్థాలు

- మామిడి పండు- ఒకటి, ఉల్లిపాయ- ఒకటి, పాలకూర- ఒక కట్ట, ఎర్రటి క్యాప్సికమ్- ఒకటి, కొత్తిమీర- ఒక కట్ట, కీరా- ఒకటి, ఉప్పు- చిటికెడు, సలాడ్ ఆయిల్- రెండు చెంచాలు, నిమ్మకాయ- ఒకటి, మిరియాల పొడి- చిటికెడు

తయారీ విధానం

- మామిడి పండును శుభ్రంగా కడిగి తొక్క తీసి పెద్ద ముక్కలుగా కోయాలి. ఉలిపాయ, పాలకూర, కొత్తిమీరలను నీళ్లతో శుభ్రం చేసి సన్నగా తరగాలి. కీరా, క్యాప్సికమ్‌లను కూడా కడిగి ముక్కలుగా కోయాలి.
- ఒక వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో మామిడి పండు, కీరా, క్యాప్సికమ్, ఉల్లిపాయల ముక్కలు; పాలకూర, కొత్తిమీరల తరుగు; ఉప్పు, మిరియాల పొడి; నిమ్మరసం, సలాడ్ ఆయిల్ వేసి బాగా కలపాలి. పైన కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేయాలి.

జాగ్రత్తలు

- మరీ పండిన మామిడి పండు కాకుండా కొద్దిగా గట్టిగా ఉన్నదాన్ని ఎంచుకుంటే సలాడ్ తినడానికి బాగుంటుంది.
- మామిడి, కీరా, క్యాప్సికమ్, ఉల్లిపాయలను పొడవాటి ముక్కలుగా కోసుకుంటే సలాడ్ రుచి పెరుగుతుంది.
- ఈ సలాడ్‌లో ఒక చెంచా నువ్వులు కలుపుకోవచ్చు

మామిడికాయ మాంసం

కావాల్సిన పదార్థాలు


- పుల్లటి మామిడికాయ- ఒకటి, మటన్- అర కిలో, ఉల్లిపాయ ముక్కలు- అర కప్పు, టమాటాలు- రెండు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, మిరియాల పొడి- అర చెంచా, గరం మసాలా పొడి- ఒక చెంచా, కారం- ఒక చెంచా, ఉప్పు- తగినంత, జీలకర్ర పొడి- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, నూనె- నాలుగు చెంచాలు, పుదీనా ఆకులు- అయిదు

జాగ్రత్తలు

- మటన్ ముక్కలను కుక్కర్‌లోనే మెత్తగా ఉడికించాలి.
- కూర ఉడుకుతున్నప్పుడు.... కొద్దిగా కార్న్‌ఫ్లోర్ లేదా బియ్యప్పిండి కలిపిన నీళ్లు పోస్తే గ్రేవీ చిక్కగా వస్తుంది.
- మామిడికాయ పులుపును అనుసరించి ఉప్పు, కారం సరి చేసుకోవాలి.

తయారీ విధానం

- మటన్ ముక్కలను శుభ్రం చేసి కుక్కర్‌లో వేయాలి. ఒక గ్లాసు నీళ్లు పోసి ఆరు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. టమాటాలను కడిగి ముక్కలుగా కోసి మిక్సీలో వేసి పేస్టు చేయాలి. మామిడికాయను కడిగి తొక్క తీసి ముక్కలు కోయాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేసి కలిపి రెండు నిమిషాలు వేగనివ్వాలి. తరవాత టమాటా పేస్టు, మిరియాల పొడి, గరం మసాలా పొడి, కారం, ఉప్పు, జీలకర్ర పొడి, ధనియాల పొడి వేసి బాగా కలపాలి. ఇవి అయిదు నిమిషాలు మగ్గిన తరవాత మామిడికాయ ముక్కలు వేసి కలిపి మూతపెట్టి నాలుగు నిమిషాలు ఉడికించాలి. తరవాత మూత తీసి ముందుగా ఉడికించుకున్న మటన్ ముక్కలు వేసి కలిపి చిన్న మంటమీద పది నిమిషాలు మగ్గించాలి. కూర దగ్గరకు వచ్చిన తరవాత స్టవ్ మీద నుంచి దించి పుదీనా ఆకులు చల్లి సర్వ్ చేయాలి.



మామిడి పండు పాయసం

కావాల్సిన పదార్థాలు


- మామిడి పండ్లు- నాలుగు, సగ్గుబియ్యం- ఒక కప్పు, పంచదార- రెండు కప్పులు, పాలు- అయిదు కప్పులు, కోవా- అర కప్పు, పిస్తా పలుకులు- రెండు చెంచాలు, బాదం పలుకులు- రెండు చెంచాలు, నెయ్యి- రెండు చెంచాలు

తయారీ విధానం

- మామిడి పండ్లను కడిగి తొక్క తీయాలి. ఒక పండును చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టాలి. మిగిలిన పండ్లను కూడా ముక్కలుగా కోసి మిక్సీలో వేసి గుజ్జులా చేయాలి. సగ్గుబియ్యాన్ని రెండు గంటలపాటు నీళ్లలో నానబెట్టాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి నెయ్యి వేసి వేడిచేయాలి. తరవాత పాలు పోసి పంచదార, కోవా, నానబెట్టిన సగ్గుబియ్యం వేసి బాగా కలపాలి. సగ్గుబియ్యం మెత్తగా ఉడికేవరకూ గరిటెతో తిప్పుతూనే ఉండాలి. తరవాత మామిడిపండ్ల గుజ్జు వేసి కలపాలి. ఒక నిమిషం తరవాత స్టవ్ మీద నుంచి దించి పైన మామిడిపండు ముక్కలు, పిస్తా పలుకులు, బాదం పలుకులు చల్లి సర్వ్ చేయాలి.

జాగ్రత్తలు

- సగ్గుబియ్యాన్ని ముందుగా ఉడికించి మరుగుతున్న పాలలో కలిపితే సమయం కలిసి వస్తుంది.
- కోవా దొరకని పక్షంలో నాలుగు చెంచాల మిల్క్‌మెయిడ్ కలుపుకోవచ్చు. కానీ పంచదార కొద్దిగా తగ్గించి వేసుకోవాల్సి ఉంటుంది.





వెంకట్ యాదవ్
చెఫ్, గోల్కొండ హోటల్, హైదరాబాద్.

మేకప్

చర్మం పొడిబారిపోకుండా తేమను నిలిపి ఉంచే మేకప్ ఉత్పత్తులను ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా పొడి వాతావరణంలో తాజాగా కనిపించడం కోసం ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించాలి.

తేమతో... తాజాగా...

ఫేస్‌వాష్: చర్మంలో మిగిలి ఉన్న తేమను వదిలించే సబ్బులకు బదులుగా విటమిన్‌సిని కలిగి ఉండే ఫేస్‌వాష్ ఎంచుకోవాలి. దీంతో చర్మంలోని మలినాలు తొలగడంతో పాటు చర్మపు తేమ భద్రంగా ఉంటుంది. ఫేస్‌వాష్‌తో ముఖం శుభ్రం చేసుకున్న తర్వాత, అదనపు తేమ కోసం హైడ్రేటింగ్ సీరమ్‌ను పూసుకోవాలి. తర్వాత ప్రైమర్‌ను ముఖానికి అద్దుకుని, ఆ తర్వాతే మేకప్ వేసుకోవడం మొదలుపెట్టాలి.

ఫౌండేషన్: తేమను కలిగి ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకుంటే, ముఖం మరింత పొడిబారకుండా ఉంటుంది. అలాగే దీన్ని ముఖానికి పూసుకోవడం కోసం తడిపి పిండిన స్పాంజి వాడుకోవాలి. ఫౌండేషన్‌లో కొద్దిగా ఫేసియల్ నూనెను కలిపి ముఖం మీద సమంగా అద్దుకోవాలి.



ఉత్పత్తులు: పౌడర్ ఆధారిత ఉత్పత్తులకు బదులుగా క్రీమ్ ఆధారిత ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవైతే చర్మంలో చక్కగా ఇంకిపోయి, చక్కని మెరుపునూ, మృదుత్వాన్నీ ఇస్తాయి.

ఐ మేకప్: కళ్ల చుట్టూ ముడతలు, వలయాలను కనిపించకుండా చేయడం కోసం, వీలైనంత తక్కువ ఫౌండేషన్ అద్దుకోవాలి. దీన్లో కాస్త ముదురు రంగు బ్లష్‌ను కలిపి కనురెప్పల దిగువన అద్దుకుంటే కళ్ల కింద నలుపు చర్మంలో కలిసిపోతుంది. కనురెప్పల పైన వేసుకునే ఐషాడో కూడా లేత రంగులో క్రీమ్ ఆధారితమైనదై ఉండేలా చూసుకోవాలి.

లిప్‌స్టిక్: లిప్‌స్టిక్ వేసుకునే ముందు పెదవుల మీద మృతకణాలను తొలగించి, తేమ కోసం అదనపు ఉత్పత్తులు వాడుకోవాలి. ఇలా పెదవులను మృదువుగా మార్చుకున్న తర్వాత లిప్‌స్టిక్ వేసుకుంటే, పెదవులు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. పెదవుల పగుళ్లు కూడా దూరమవుతాయి.

సెట్టింగ్ పౌడర్: మేపక్ పూర్తయిన తర్వాత, ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ పౌడర్‌ను అద్దుకోవాలి.

హెయిర్ స్ప్రే: గాలులకు తలకట్టు చెదిరిపోకుండా ఉండడం కోసం, సెట్టింగ్ స్ప్రే వాడుకోవచ్చు. అయితే తలకు నాలుగు అంగుళాల దూరం నుంచే స్ప్రే చేసుకుని, వెంట్రుకలను సెట్ చేసుకోవాలి.

కేసీఆర్ దేవుడైతే.. దెయ్యం ఎవరు?

- బీఆర్‌ఎస్‌లో కోవర్టులెవరు.. కుట్రదారులెవరు?
- కవితకు ప్రశ్నలు సంధించిన ఆది శ్రీనివాస్



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ దేవుడు అయితే దెయ్యం ఎవరంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. తన లేఖను ఎవరో బయటకు లీక్ చేశారంటూ విమానాశ్రయంలో కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఆమెకు 11 ప్రశ్నలు సంధిస్తూ.. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'కవిత గారు.. మీ లేఖను లీక్ చేసిందెవరు.. కేసీఆర్ దేవుడైతే దెయ్యం ఎవరు.. కేసీఆర్ పక్కనున్న కోవర్టులెవరు.. బీఆర్‌ఎస్‌లో మీపైన కుట్ర చేస్తున్నదెవరు.. సొంత తండ్రిని కలిసి మాట్లాడకుండా లేఖ ఎందుకు రాయాల్సి వచ్చింది.. మీకు ఫాంహౌస్‌లోకి ప్రవేశం లేదా..? ఎవరు మిమ్మల్ని అడ్డుకుంటున్నారు.. లేఖ లీక్ కావడంపై వివరణ ఇవ్వాలని కేసీఆర్‌ని అడుగుతారా.. మీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురించి ఎందుకు మాట్లాడట్లేదు..? ఇంత జరుగుతుంటే మీ కుటుంబం ఎందుకు అండగా నిలబడటం లేదు.. ఎయిర్‌పోర్టులో మీకు స్వాగతం పలకడానికి బీఆర్‌ఎస్ నేతలు ఎందుకు రాలేదు.. మీ లేఖ నకిలీదని మీ సొంత పత్రిక నమస్తే తెలంగాణలో రాయించిందెవరు..?' అంటూ అడిగారు.

రేవంత్, కవిత మంచి స్నేహితులు

- కేసీఆర్ పిల్లలు రాజకీయాల్లోకి రావడం వల్లే బీఆర్‌ఎస్‌కు ఈ దుస్థితి
- వాస్తవానికి.. కేసీఆర్ తర్వాతి స్థానం హరీశ్‌దే
- మాకు ప్రాధాన్యత పెరుగుతుందనే బీఆర్‌ఎస్ ప్లీనరీలో బీజేపీ గురించి ఎక్కువ మాట్లాడలేదు: అర్వింద్



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్, ఎమ్మెల్సీ కవిత మంచి స్నేహితులని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సీఎంగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్, ఎప్పుడు కూడా కవితను విమర్శించలేదని చెప్పారు. శుక్రవారం ఏబీఎన్ డిబేట్‌లో అర్వింద్ మాట్లాడుతూ.. కేసీఆర్ తన పిల్లలను రాజకీయాల్లోకి తీసుకురావడం వల్లనే బీఆర్‌ఎస్‌కు ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. న్యాయంగా మాట్లాడితే కేసీఆర్ తర్వాతి స్థానం హరీశ్‌దే అని చెప్పారు. కేసీఆర్ తెలివైన నేత అని, ఆయనకు రాజకీయాలు తెలుసునని, ఒకరి గురించి ఎక్కువ మాట్లాడడం వల్ల వారికి అనవసరంగా ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని, ఈ విషయం కవితకు తెలియదని అన్నారు. బీజేపీకి ప్రాధాన్యత పెరుగుతుందని గుర్తించే బీఆర్‌ఎస్ ప్లీనరీలో కేసీఆర్ తమ పార్టీ గురించి ఎక్కువ మాట్లాడలేదని పేర్కొన్నారు. కేసీఆర్ అందర్నీ కలుపుకొనిపోయే నాయకుడని, ఆయన పదమూడేళ్ల పోరాటం వల్లనే తెలంగాణ వచ్చిందని చెప్పారు. ఆంధ్రావాళ్లను తట్టుకుని రాష్ట్రాన్ని సాధించడం ఆయనకే సాధ్యమైందని, లేదంటే ప్రత్యేక రాష్ట్రం వచ్చేదే కాదన్నారు. తామెంత విమర్శించినా ఈ విషయంలో ఆయనదే ఘనత అని పేర్కొన్నారు. వాస్తవానికి నాడు కేసీఆర్‌పై విశ్వసనీయత లేదని, కానీ ప్రజల్లో ప్రత్యేక రాష్ట్రం కావాలనే కాంక్ష ఉందని, ఆ వాదాన్ని ఎత్తుకున్న కేసీఆర్‌కు విషయ పరిజ్ఞానం, భాషలో పట్టు ఉందని చెప్పారు. తన వాగ్ధాటితో అందర్నీ ఒప్పించే సత్తా ఆయనకు ఉందని చెప్పారు. తాను వేర్వేరు అంశాలపై కేసీఆర్‌ను విమర్శించినా, సుదీర్ఘ పోరాటంలో ఆయన అందర్నీ కలుపుకొని వెళ్లారని చెప్పారు.

కుల సర్వే జరిపించడం నాకు గర్వకారణం

ముఖ్యమంత్రి రేవంత్‌తో పయనం సంతృప్తికరం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆయన మద్దతుతోనే పీసీసీ చీఫ్ పదవి
- కేసీఆర్ నియంత, రేవంత్ ప్రజాస్వామికవాది
- మంత్రులు స్వేచ్ఛగా పనిచేస్తున్నారు
- బీఆర్‌ఎస్ మూడు ముక్కలవడం ఖాయం
- 2028లో మళ్లీ తెలంగాణలో.. 2029లో కేంద్రంలో అధికారంలోకి..
- నెలాఖరులోపు పీసీసీ కార్యవర్గం
- రెండు నెలాల్లో మండల, జిల్లా అధ్యక్షుల నియామకం: మహేశ్‌గౌడ్

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా తన ఏడు నెలల పదవీకాలంలో అత్యంత సంతృప్తికర అంశం కుల సర్వే అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణలో చేసిన కుల సర్వే దేశానికే ఆదర్శంగా నిలవడం, బీసీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతుండటంతో ప్రధాని మోదీ సైతం కలవరపడి దేశవ్యాప్తంగా కులగణన జరిపిస్తామని ప్రకటించారని చెప్పారు. ఇందుకు తాను గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిజానికి ఆర్‌ఎస్‌ఎస్ కులగణనను వ్యతిరేకించిందన్న విషయాన్ని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ సమక్షంలో కులగణనపై ఇతర రాష్ట్రాల నేతలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశాన్ని తనకు ఇచ్చారని తెలిపారు. శనివారం తన జన్మదినం సందర్భంగా ఢిల్లీలో ఆంధ్రజ్యోతి ప్రతినిధికి మహేశ్‌గౌడ్ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో.. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా, తాను కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కులగణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్ వాగ్దానం చేశామని, ఆరు గ్యారంటీలను ప్రకటించామని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కారణమయ్యాయని చెప్పారు. ఆ హామీలన్నీ నెరవేర్చడంతో దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. రేవంత్ రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి కాకపోయినా ... రేవంత్ రెడ్డి వర్గానికి చెందిన ప్పటికీ రాష్ట్రంలో బీసీలు కాంగ్రెస్‌కు సానుకూలంగా మారేందుకు తోడ్పడ్డారని.. సోనియా, రాహుల్ వాగ్దానాలు, రేవంత్ ఆకర్షణ కాంగ్రెస్‌ను గెలిపించాయని పేర్కొన్నారు.

కలసికట్టుగా పనిచేస్తున్నాం..

గత ఏడు నెలలుగా పార్టీ, ప్రభుత్వం చక్కటి సమన్వయంతో పనిచేశాయని, అందువల్లే ప్రజల్లో ప్రభావం చూపించగలిగామని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు రేవంత్ తనకు పూర్తి స్వేచ్ఛనిచ్చారని.. ఇప్పుడు రేవంత్ సీఎంగా, తాను పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని ప్రజల్లోకి విజయవంతంగా తీసుకువెళుతున్నామని పేర్కొన్నారు. రేవంత్‌తో ప్రయాణం అత్యంత సంతృప్తికరంగా ఉందని తెలిపారు. కేసీఆర్ నియంత అని, ప్రజాస్వామ్య లక్షణాలు మచ్చుకైనా లేవని విమర్శించారు. అదే రేవంత్ ప్రజాస్వామికవాది అని, ఆయన నాయకత్వంలో మంత్రులు స్వేచ్ఛగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. చెన్నారెడ్డి, డి.శ్రీనివాస్ తనను రాజకీయాల్లో ప్రోత్సహించారని చెప్పారు. రేవంత్ మద్దతుతోనే తాను పీసీసీ అధ్యక్షుడు కాగలిగానని వివరించారు.

నెలాఖరులోపు పీసీసీ కార్యవర్గం

గత ఏడు నెలల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎంతో బలోపేతమైందని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ఈ నెలాఖరులోపు పీసీసీ కార్యవర్గం ఏర్పాటవుతుందని తెలిపారు. అందులో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, మహిళలకు స్థానం దక్కుతుందని వెల్లడించారు. తర్వాత రెండు నెలల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధ్యక్షులను నియమిస్తామని.. ఎంపికలో కార్యకర్తలకే పెద్దపీట వేస్తామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల ఎంపికలో జిల్లా అధ్యక్షుల అభిప్రాయాలకే విలువ ఉంటుందని తెలిపారు. వికేంద్రీకరణ, బూత్ స్థాయి నుంచి కమిటీల నియామకం వంటి చర్యలతో పార్టీని పటిష్ఠం చేయాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారన్నారు.

కవిత లేఖతో కుమ్మక్కు తేలిపోయింది

బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని కేసీఆర్ కుమార్తె కవిత లేఖతో తేలిపోయిందని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. బీజేపీని కేసీఆర్ సరిగా విమర్శించలేదని కవిత గుర్తుచేశారన్నారు. ఈ లేఖతో కేసీఆర్ కుటుంబంలో కుమ్ములాటలు బహిర్గతం అయ్యాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ భవిష్యత్తులో మూడు ముక్కలు అవుతుందని వ్యాఖ్యానించారు. అందులో ఒక ముక్క బీజేపీతో చేతులు కలుపుతుందని.. దీనివల్ల కాంగ్రెస్‌కు ఎలాంటి ఢోకా ఉండదని పేర్కొన్నారు. పహల్గాం ఘటన తర్వాత పాకిస్థాన్‌కు దీటుగా జవాబు చెప్పలేదని ప్రజలు మోదీ పట్ల ఆగ్రహంతో ఉన్నారని.. మోదీ గ్రాఫ్ రోజురోజుకూ పడిపోతోందని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. 2028లో మళ్లీ తెలంగాణలో, 2029లో కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

అందరికీ తెలంగాణ రోల్‌మోడల్

- రాహుల్ ఆశయాలకు అనుగుణంగా కులగణన
- ఏఐసీసీ ముఖ్యుల భేటీలో టీపీసీసీ చీఫ్
- ఆ తర్వాత రాహుల్‌తో ప్రత్యేక భేటీ!

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): కులగణనలో దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆశయాలకు అనుగుణంగా కులగణన సర్వే నిర్వహించామని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యాలయం(ఇందిరా భవన్)లో రాహుల్ నేతృత్వంలో ఏఐసీసీ కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కులగణనపై మహేశ్ గౌడ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సుమారు 2 గంటల పాటు కులగణన జరిపిన తీరును వివరించారు.

అసెంబ్లీలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపిన తర్వాత పార్లమెంట్‌కు పంపామని మహేశ్ గౌడ్ చెప్పారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ కులగణన హామీనివ్వడంతో బీసీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ కులగణనపై అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి సహా మంత్రి వర్గమంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వేగంగా ప్రత్యేక కార్యాచరణను చేపట్టిందని తెలిపారు. దేశంలోనే తొలిసారి కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో కులగణన జరగడం గర్వంగా ఉందని చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తర్వాత రాహుల్‌తో మహేశ్ గౌడ్ ప్రత్యేకంగా భేటీ అయినట్లు తెలిసింది. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై వారు చర్చించినట్లు సమాచారం.

మీ పోస్టులు శ్రుతిమించాయ్!

- సజ్జల భార్గవ్‌రెడ్డిపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- అవి మాకు అర్థం కాలేదనుకున్నారా?
- అసభ్య పోస్టులను వ్యవస్థ క్షమించదు
- సోషల్ మీడియా దుర్వినియోగం కేసుల్లో త్వరగా బెయిల్ వస్తుందనుకోవద్దు: ధర్మాసనం

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవ్‌రెడ్డిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమం వేదికగా ఆయన పెట్టిన పోస్టులపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. అవి శ్రుతిమించాయని.. భరించరాని స్థాయికి వెళ్లాయని స్పష్టంచేసింది. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. 2023లో టీడీపీ అధినేత చంద్రబాబు, అప్పటి తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగలపై అనుచిత పోస్టులు పెట్టారని.. అవి తీసివేయాలని అడిగినందుకు తనను చంపుతానని బెదిరించి.. కులం పేరుతో తనను, అనితను దూషించారని పులివెందులలో కొండప్పగారి హరి అనే దళితుడి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గతేడాది నవంబరులో సజ్జల భార్గవ్‌రెడ్డి, జగన్‌కు వరుసకు మేనల్లుడయ్యే సింగారెడ్డి అర్జున్‌రెడ్డి, వైసీపీ సోషల్ మీడియాకు చెందిన వర్రా రవీందర్‌రెడ్డిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఆ కేసులో బెయిల్ కోరుతూ భార్గవ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా నిరాశే ఎదురైంది. దీంతో ఈ నెల 13న ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. భార్గవ్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. ఇది రాజకీయ దురుద్దేశంలో పెట్టిన కేసన్నారు. అయితే ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఇప్పుడు సామాజిక మాధ్యమాల దుర్వినియోగం ఎక్కువైపోయిందని.. ఇలాంటి కేసుల్లో బెయిల్ సులభంగా దొరికితే.. ఆ తర్వాత సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసే వారిని నియంత్రించలేమని అభిప్రాయపడింది. 'మీరు ఎటువంటి పోస్టులు పెట్టారో మాకు తెలియదని అనుకుంటున్నారా? మీ పోస్టులు మాకు అర్థం కాలేదనుకున్నారా? మీ పోస్టులు శ్రుతిమించాయి. ఇది రాజకీయమా.. మరొకటా అనేది మాకు అనవసరం. ఇలాంటి అంశాల్లో రాజకీయాలు అప్రస్తుతం. మీరు పెట్టిన పోస్టుల గురించి మాత్రమే మేం మాట్లాడుతున్నాం. తప్పు ఎవరు చేసినా తప్పే. ఇలాంటి వాటిని వ్యవస్థ క్షమించదు. తప్పక శిక్షిస్తుంది. సోషల్ మీడియా దుర్వినియోగం కేసుల్లో త్వరగా బెయిల్ వస్తుందనుకోవద్దు. అలా బెయిల్ వస్తే ప్రతి ఒక్కరూ ఇష్టారీతిన వ్యవహరిస్తారు. ఇటువంటి చర్యలు మేమెప్పటికీ క్షమించం' అని తేల్చిచెప్పింది. ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ, ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. అయితే రెగ్యులర్ బెయిల్ కోసం ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టులో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

చిత్రజ్యోతి

SINCE 1965

సెట్‌లోకి చిరు



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం (మెగా 157-వర్కింగ్ టైటిల్) రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. చిరంజీవితో పాటు ఇతర నటీనటులు షూటింగ్‌లో పాల్గొనగా కీలక సన్నివేశాలను అనిల్ రావిపూడి తెరకెక్కించారు. తనదైన శైలిలో సాగే విభిన్న కథాంశంతో ఈ సినిమాను ఆయన తెరకెక్కిస్తున్నారు. ఇందులో చిరంజీవి పాత్ర వినోదభరితంగా ఉండనుంది. ఈ చిత్రంలో నయనతార చిరంజీవికి జోడీగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహూ గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి.

అలరించే ప్రేమగీతం



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ కథానాయకులుగా తెరకెక్కిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మించారు. అదితి శంకర్, ఆనంది, దివ్యపిళ్లై కథానాయికలు. డాక్టర్ జయంతిలాల్ గడ సమర్పిస్తున్నారు. ఈనెల 30న విడుదలవుతోంది. 'గిచ్చమాకే' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అదితి శంకర్‌పై చిత్రీకరించిన ఈ డ్యూయెట్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, శ్రీ చరణ్ పాకాల స్వరపరిచారు. ధనుంజయ్ సీపాన, సౌజన్య ఆలపించారు. ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది. ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: హరి కే వేదాంతం, ఎడిటర్: చోటా కే ప్రసాద్.

హరిహర వీరమల్లుపై ఆ నలుగురి కుట్ర

- తేల్చాలంటూ హోం శాఖకు ఏపీ మంత్రి కందుల దుర్గేష్ ఫిర్యాదు



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలకు ముందే థియేటర్లు మూసివేయాలంటూ నలుగురు పెద్ద నిర్మాతలు ఒత్తిడి చేశారని, వారి సంగతి తేల్చాలంటూ ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హోం శాఖకు ఫిర్యాదు చేశారు. జూన్ 12న 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల కానున్న నేపథ్యంలో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు మూసి వేయాలనే ఒత్తిడి వెనుక దాగున్న కుట్రను వెలికి తీయాలంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్‌కు మంత్రి కందుల దుర్గేష్ ఫిర్యాదు చేశారు. తెలుగులో పెద్ద నిర్మాతలుగా పేరున్న ఆ నలుగురు ఇటీవల ఒక చోట సమావేశం అయ్యారని, వారు పన్నిన కుట్రలో భాగమే థియేటర్ల మూసివేత అని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన హోంశాఖ ముఖ్య కార్యదర్శి నిష్పక్షపాత దర్యాప్తునకు ఆదేశిస్తామంటూ మాటిచ్చినట్లు సినిమాటోగ్రఫీ వర్గాలు తెలిపాయి. ఆ నలుగురు నిర్మాతల్లో ఒకరు పవన్ కల్యాణ్ సమీప బంధువు కాగా మరొకరు విశాఖపట్నంలో భారీ స్టూడియో నిర్మించిన ప్రొడ్యూసర్, ఇంకొకరు తెలంగాణలో డిస్ట్రిబ్యూటర్ నుంచి పెద్ద సినిమాలు నిర్మించే స్థాయికి ఎదిగిన నిర్మాతగా సినీ పరిశ్రమలో ప్రచారం జరుగుతోంది. నాలుగో నిర్మాత ఎవరన్నది తేలాల్సి ఉంది.

అమరావతి (ఆంధ్రజ్యోతి)



మిత్రబృందం స్నేహగీతం

గ్రామీణ నేపథ్యంలో ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'బద్మాషులు'. మహేశ్, విద్యాసాగర్, మురళీధర్‌గౌడ్ ప్రధాన తారాగణం. శంకర్ చేగూరి దర్శకత్వంలో బి. బాలకృష్ణ, సి. రామశంకర్ నిర్మిస్తున్నారు. జూన్ 6న ఈ చిత్రం విడుదలవుతోంది. తాజాగా చిత్రబృందం 'జిందగీ బిలాలే' అంటూ సాగే గీతాన్ని విడుదల చేసింది. మిత్రబృందంపై చిత్రీకరించిన ఈ గీతాన్ని హీరో ప్రియదర్శి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ చిత్రానికి తేజ కూకునూరు సంగీతం అందించారు. చరణ్, అర్జున్, విహ ఆలపించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలతో 'బద్మాషులు' చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు తెలిపారు.



ప్రేక్షకుల ముందుకు గ్యాంబ్లర్స్



సంగీత్ శోభన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగ కథానాయిక. కేఎస్‌కే చైతన్య దర్శకుడు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మాతలు. చిత్రబృందం విడుదల తేదీని ప్రకటించింది. జూన్ 6న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో సంగీత్ శోభన్ సీరియస్ లుక్‌లో కనిపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో ఉండే థ్రిల్లింగ్ అంశాలు, మలుపులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. సంగీత్ శోభన్ మేనరిజమ్స్, శారీరక భాషను అర్థం చేసుకొని పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశారు' అని చెప్పారు. కొత్త కాన్సెప్ట్‌తో థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన గ్యాంబ్లర్స్ ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శశాంక్ తిరుపతి.

యూత్ టీమ్‌తో 'థాంక్యూ డియర్'



ధనుష్ రఘుముద్రి నటించిన 'థాంక్యూ డియర్' చిత్రం ఫస్ట్ లుక్‌ను సీనియర్ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. ఈ సినిమా చేస్తున్న యువ బృందానికి ఆశీస్సులు అందజేసి సినిమా విజయం సాధించాలని భరద్వాజ కోరారు. హీరో ధనుష్ రఘుముద్రి మాట్లాడుతూ 'ఇది నా రెండో సినిమా. నా కెరీర్‌కు కీలకమైంది. ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది' అన్నారు. హెబ్బా పటేల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తోట శ్రీకాంతకుమార్ దర్శకత్వంలో పప్పు బాలాజీ రెడ్డి నిర్మిస్తున్నారు. లైన్ ప్రొడ్యూసర్ పునీత్ రెడ్డి.

యదార్థ సంఘటన ఆధారంగా



కౌసల్యా కృష్ణమూర్తి, అథర్వ చిత్రాలతో నటుడిగా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు కార్తీక్‌రాజు. ఆయన కథానాయకుడిగా కొత్త చిత్రం ప్రారంభమైంది. శుక్రవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. తొలి షాట్‌కు సురేశ్‌బాబు క్లాప్ ఇచ్చారు. హీరో చైతన్య కెమెరా స్విచ్చాన్ చేశారు. భీమనేని శ్రీనివాసరావు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రాజా దుస్సా దర్శకత్వంలో గాలి కృష్ణ నిర్మిస్తున్నారు. కాజల్ చౌదరి కథానాయిక. 1980ల్లో వరంగల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని దర్శకుడు తెలిపారు.

రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్

- ప్రభుత్వానికి ఆర్‌బీఐ భారీ నజరానా
- రికార్డు స్థాయిలో చెల్లింపులు
- 2024-25లో 27.4% పెరిగిన డివిడెండ్
- కలిసొచ్చిన ఫారెక్స్ లావాదేవీలు



ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కేంద్ర ప్రభుత్వానికి భారీ నజరానా ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో రూ.2,68,590.07 కోట్ల భారీ డివిడెండ్ ప్రకటించింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (సీబీడీ) ఈ మేరకు సిఫారసు చేసింది. ఈ నెల 15న జరిగిన సీబీడీలో ఆమోదించిన ఎకనామిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ్) ఆధారంగా ఆర్‌బీఐ ఈ మొత్తాన్ని నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) చెల్లించిన రూ.2.1 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 27.4 శాతం ఎక్కువ. అయితే మార్కెట్ వర్గాలు అంచనా వేసిన రూ.3 లక్షల కోట్ల కంటే ఇది తక్కువే. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) డివిడెండ్ రూపంలో రూ.2.56 లక్షల కోట్లు సమకూరే అవకాశం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. అయితే ఆర్‌బీఐ ఒక్కటే ఇందులో రూ.2,68,590 కోట్లు సమకూర్చడం విశేషం. దీంతో డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఎదురవుతున్న ఆర్థిక అనిశ్చితిని, భారత-పాక్ ఘర్షణలతో పెరగనున్న రక్షణ బడ్జెట్ కేటాయింపుల భారాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంటుందని భావిస్తున్నారు. అయితే ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని కంటిజెంట్ రిస్క్ బఫర్ (సీఆర్‌బీ) లెవల్‌గా పిలిచే ఈక్విటీ మూలధనాన్ని.. ఆర్‌బీఐ తన ఆస్తి-అప్పుల పట్టిక (బ్యాలెన్స్ షీట్)లో 6.5 శాతం నుంచి 7.5 శాతానికి పెంచింది.

ఆదాయం ఇలా

దేశ, విదేశీ రుణ పత్రాల పెట్టుబడులపై లభించే వడ్డీ, తన సేవలపై వసూలు చేసే రుసుములు, కమీషన్లు, విదేశీ మారక ద్రవ్య లావాదేవీల (ఫారెక్స్)పై వచ్చే లాభం, అనుబంధ సంస్థల నుంచి లభించే ప్రతిఫలం రూపంలో ఆర్‌బీఐకి ఏటా ఆదాయం వస్తుంది. ఇందులోంచి కరెన్సీ నోట్ల ముద్రణ, డిపాజిట్లు, రుణాలపై వడ్డీ చెల్లింపులు, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు, నిర్వహణ ఖర్చులు, తరుగుదల కేటాయింపులతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థను ఆదుకునేందుకు కంటిజెంట్ రిస్క్ బఫర్ (సీఆర్‌బీ) లెవల్ రూపంలో కొంత మొత్తాన్ని ఉంచుకుని మిగిలిన మొత్తాన్ని ఏటా డివిడెండ్ రూపంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తుంది. గత ఆర్థిక సంవత్సరం ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌ను రూ.83-84 మధ్య కొని రూ.84-87 మధ్య విక్రయించడం లాభాలను బాగా పెంచింది.

జలాన్ ఫార్ములాలో సవరణ

ఖర్చులు పోను తన మిగులు ఆదాయంలో ఎంత మొత్తాన్ని ఆర్‌బీఐ డివిడెండ్ రూపంలో ప్రభుత్వానికి బదిలీ చేయాలనే దానిపై మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నేతృత్వంలోని కమిటీ 2019లో చేసిన సిఫారసులను ఆర్‌బీఐ ఇప్పటికీ అనుసరిస్తోంది. ఈ సిఫారసులు ఇప్పటికీ వర్తిస్తాయని ఆర్‌బీఐ వర్గాలు చెప్పాయి. అయితే అవసరాన్ని బట్టి కంటిజెన్సీ రిస్క్ బఫర్ (సీఆర్‌బీ) శాతంలో కొద్దిపాటి మార్పులు చేర్పులు తప్పవని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇప్పటి వరకు 6.5 శాతంగా ఉన్న సీఆర్‌బీని 7.5 శాతానికి పెంచుతూ ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ నిర్ణయం తీసుకుంది.



పీఆర్‌బీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

దేశంలో చెల్లింపుల వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు ఆర్‌బీఐ సిద్ధమైంది. ఇందు కోసం ఆరుగురు సభ్యులతో పేమెంట్స్ రెగ్యులేటరీ బోర్డు (పీఆర్‌బీ) ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న బోర్డు ఫర్ రెగ్యులేషన్ అండ్ సూపర్‌విజన్ ఆఫ్ పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్ (బీపీఎస్‌ఎస్) స్థానంలో ఈ బోర్డు ఏర్పాటు కానుంది. ఈ బోర్డుకు ఆర్‌బీఐ గవర్నర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆర్‌బీఐ నుంచి గవర్నర్‌తో సహా ముగ్గురు, కేంద్ర ప్రభుత్వం నామినేషన్ చేసే ముగ్గురు సభ్యులు ఈ బోర్డులో సభ్యులుగా ఉంటారు. ఈ బోర్డు ఏడాదికి కనీసం రెండు సార్లు భేటీ అవుతుందని ఆ నోటిఫికేషన్‌లో తెలిపారు. దేశంలో చెల్లింపుల వ్యవస్థ పనితీరును పర్యవేక్షించడంతో పాటు ఈ బోర్డు అవసరమైతే నియంత్రిస్తుంది.

పెరిగిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్).. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.253 కోట్ల నికర నష్టాలను ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నష్టం రూ.168 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.2,570 కోట్ల నుంచి రూ.2,977 కోట్లకు పెరిగింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ నికర నష్టం రూ.829 కోట్ల నుంచి రూ.817 కోట్లకు తగ్గింది. ఢిల్లీ, హైదరాబాద్, మోపా (గోవా) విమానాశ్రయాలతో పాటు ఇండోనేషియాలో మేడన్ విమానాశ్రయాన్ని జీఏఎల్ నిర్వహిస్తోంది.

ఎంటార్ లాభం రూ.14 కోట్లు

ఎంటార్ టెక్నాలజీస్ (ఎంటీఏఆర్) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.183.10 కోట్ల ఆదాయంపై రూ.13.7 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.4.9 కోట్లు) తో పోల్చితే లాభం ఏకంగా 182.7 శాతం వృద్ధి చెందింది. మార్చితో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.676 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.52.9 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసినట్లు ఎంటార్ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	517
చిత్తూరు	603	విశాఖపట్నం	545
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,530 ▼	89,400 ▼	1,11,000 ▼
విజయవాడ	99,000 ▲	93,000 ▲	99,900 ▲
విశాఖపట్నం	99,600 ▲	89,400 ▼	1,11,000 ▼
రాజమండ్రి	97,530 ▼	89,400 ▼	1,01,000 ▼
ప్రొద్దుటూరు	96,200 ▼	88,500 ▼	99,200 ▼
ముంబై	95,471 ▼	87,451 ▼	96,909 ▲

మళ్లీ లాభాల్లోకి

సెన్సెక్స్ 770 పాయింట్లు అప్

ముంబై: అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో భారీ ఊగిసలాట ధోరణిలో ట్రేడవుతున్న ఈక్విటీ మార్కెట్ శుక్రవారం లాభాల బాట పట్టింది. మార్కెట్ ఫ్లాట్‌గానే ప్రారంభమైనా రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ వంటి బ్లూచిప్ షేర్లలో జరిగిన భారీ కొనుగోళ్లు ఈక్విటీ సూచీలను పరుగులు తీయించాయి. అమెరికన్ బాండ్లపై వడ్డీ రేట్లు తగ్గడంతో పాటు ప్రభుత్వానికి ఆర్‌బీఐ రికార్డు డివిడెండ్ అందిస్తోందన్న వార్తలు సెంటిమెంట్ బలపడడానికి దోహదపడ్డాయి. సానుకూల వార్తల ప్రభావంతో సెన్సెక్స్ ఒక దశలో 953.18 పాయింట్ల లాభంతో 81,905.17 పాయింట్ల ఇంట్రాడే గరిష్ఠ స్థాయిని తాకింది. తదుపరి క్రమంలో కొంతమేరకు దిగజారినా చివరికి 769.09 పాయింట్ల లాభంతో 81,721.08 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 243.45 పాయింట్లు లాభపడి 24,853.15 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 609.51 పాయింట్లు, నిఫ్టీ 166.65 పాయింట్లు నష్టపోయాయి.

స్కోడా ట్యూబ్స్ ఇష్యూ ధర రూ.130-140: స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబ్స్ తయారీ సంస్థ స్కోడా ట్యూబ్స్ ఐపీఓ ఈనెల 28 ప్రారంభమై 30న ముగియనుంది. షేరు ధరల శ్రేణిని రూ.130-140గా ప్రకటించింది. కాగా ఐపీఓ ద్వారా నిధుల సమీకరణకు అనుమతి కోరుతూ కనోడియా సిమెంట్ సెబీకి దరఖాస్తు చేసింది

వచ్చే రెండేళ్లలో రూ.130 కోట్ల పెట్టుబడులు

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే రెండు, మూడేళ్ల కాలంలో రూ.130 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్) ప్రకటించింది. ప్రతిపాదిత పెట్టుబడులతో అధిక విలువ కలిగిన అవకాశాలను దక్కించుకోవటంతో పాటు ప్రొడక్ట్ ఇన్నోవేషన్ సహా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆటోమేటెడ్, మెకనైజ్డ్ ఫ్యాబ్రికేషన్ లైన్స్‌ను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపింది. అలాగే ప్రస్తుతమున్న 60 టన్నుల క్రేన్, 60 ఎంఎం థిక్‌నెస్ ఫ్యాబ్రికేషన్‌ను 100 టన్నుల క్రేన్, 100 ఎంఎం ఫ్యాబ్రికేషన్‌కు విస్తరించనున్నట్లు వెల్లడించింది.

క్యూ4 లాభం రూ.16 కోట్లు: మార్చితో ముగిసిన చివరి త్రైమాసికాని (క్యూ4) గాను కంపెనీ నికర లాభం 3 శాతం వృద్ధి చెంది రూ.16 కోట్లుగా నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం కూడా 19.7 శాతం వృద్ధితో రూ.171 కోట్లకు చేరుకుందని తెలిపింది. మార్చి త్రైమాసికంలో విదేశీ కస్టమర్ల నుంచి ఎగుమతి లైసెన్స్ సహా తుది అనుమతులు అందుకోవటంలో జాప్యం ఎదురుకావటంతో ఆర్డర్ నిలిచిపోయిందని, అయితే ఈ ఆర్డర్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పూర్తి చేయవచ్చని అంచనా వేస్తున్నట్లు ఎస్‌జీఎల్‌టీఎల్ పేర్కొంది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.626 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.69 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది.



సుజుకీ తొలి ఈవీ 'ఈ-యాక్సెస్'

ముంబై: సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా.. తొలి ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఈ-యాక్సెస్' ఉత్పత్తిని ప్రారంభించినట్లు ప్రకటించింది. గురుగ్రామ్ ప్లాంట్‌లో ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కంపెనీ ఉత్పత్తి చేస్తోంది. ఈ స్కూటర్‌ను కంపెనీ ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025లో ప్రదర్శించింది. లిథియం-అయాన్-ఫాస్ఫేట్ బ్యాటరీ, రీజెనరేటివ్ బ్రేకింగ్ సిస్టమ్, మెయింటెనెన్స్- ఫ్రీ బెల్ట్ డ్రైవ్ సిస్టమ్ సహా రివర్స్ మోడ్ వంటి ఇతర అత్యాధునిక ఫీచర్లతో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చింది.

- అంతర్జాతీయ ఐటీ కన్సల్టింగ్, సేవల సంస్థ యూనిక్ హైర్ తాజాగా తన సేవలను యూఏఈకి విస్తరించింది. ఇందులో భాగంగా యూఏఈ బిజినెస్ ఎనేబులర్ అయిన టీ కన్సల్ట్‌తో వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సుమారు 10 వేల మంది అంతర్జాతీయ అభ్యర్థులను ఎంపిక చేసుకుని, వారికి నైపుణ్యాల్లో శిక్షణను అందించి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ తయారీ సంస్థ ఓబెన్.. కొత్త ప్లాట్‌ఫామ్ ద్వారా 100 సీసీ మోటార్‌సైకిల్ విభాగంలోకి అడుగుపెట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఓ100 పేరుతో ఏర్పాటు చేయనున్న కొత్త ప్లాట్‌ఫామ్‌పై 100 సీసీ బైక్స్‌ను ఉత్పత్తి చేయనుంది. రూ.లక్ష ధర ఉండే ఈ బైక్‌ను ఈ ఏడాది ద్వితీయార్థంలోకి మార్కెట్లోకి తీసుకురానుంది.
- కాంటినెంటల్ టైర్స్ తెలంగాణలో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా కరీంనగర్‌లో ప్రీమియం డ్రైవ్ డీలర్‌షిప్‌ను ఏర్పాటు చేసింది. తెలంగాణలో సంస్థకిది పదో స్టోర్.
- సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ థింక్ గ్యాస్ కొత్తగా మూడు ఎల్‌ఎన్‌జీ ఇంధన కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, నెల్లూరు సహా తమిళనాడులోని వల్లం వద్ద వీటిని నెలకొల్పనుంది. సెప్టెంబరు 25 నాటికి ఇవి కార్యకలాపాలు ప్రారంభిస్తాయని థింక్ గ్యాస్ వెల్లడించింది.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — పంజాబ్ x ఢిల్లీ — వేదిక: జైపూర్ — రా.7.30 నుంచి




షమికి చోటు కష్టమే

గిల్‌కే కెప్టెన్సీ.. పంత్‌నకు డిప్యూటీ

నేడు టీమిండియా టెస్టు జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకుండా భారత టెస్టు జట్టు ప్రయాణం మొదలుకానుంది. ఈ ఇద్దరు అనుభవజ్ఞుల రిటైర్మెంట్ తర్వాత తొలిసారి భారత సెలెక్టర్లు జట్టును ప్రకటించనున్నారు. ఇంగ్లండ్‌తో జూన్ 20 నుంచి జరుగనున్న ఐదు టెస్టుల సిరీస్ కోసం శనివారం ఆటగాళ్ల జాబితాను వెల్లడించనున్నారు. ప్రస్తుత సంధి దశను అధిగమించేందుకు జట్టు కూర్పు ఎలా ఉండబోతున్నదేది ఆసక్తికరంగా మారింది. అయితే కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వైపే మొగ్గుచూపే అవకాశం ఉంది. అతడికి పోటీగా ఉన్న రిషభ్ పంత్‌ను వైస్‌కెప్టెన్‌గా నియమించవచ్చు. వాస్తవానికి ఇన్నాళ్లు రోహిత్‌కు డిప్యూటీగా ఉన్న బుమ్రాను సారథిగా నియమించాలనుకున్నా అతడి ఫిట్‌నెస్, పనిభారం కారణంగా సెలెక్టర్లు యువ ఆటగాడి వైపు మొగ్గు చూపాలనుకుంటున్నారు. ఇక సీనియర్ పేసర్ మహ్మద్ షమి ఈ టూర్‌కు వెళ్లడం సందేహంగా మారింది. టెస్టుల్లో తనకు సుదీర్ఘ స్పెల్స్ వేసే ఫిట్‌నెస్ లేదని బీసీసీఐ వైద్య బృందం చెప్పినట్టు సమాచారం. ఒకవేళ షమీని పక్కనబెడితే అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్‌కు చాన్స్ ఉంటుంది. అలాగే బుమ్రా కూడా అన్ని టెస్టులు ఆడే అవకాశం కనిపించడం లేదు. బ్యాటింగ్‌లో కరుణ్ నాయర్, సాయి సుదర్శన్‌లకు చోటు దక్కవచ్చని సమాచారం. అయితే శ్రేయాస్ అయ్యర్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది వేచిచూడాల్సిందే.



వావ్.. శ్రీకాంత్

'మలేసియా మాస్టర్స్'లో సెమీస్‌కు

కౌలాలంపూర్: కొన్నాళ్లుగా ఫామ్‌లేమితో సతమతమవుతున్న సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ఎట్టకేలకు గాడిలో పడ్డాడు. దాదాపు ఏడాదికాలం తర్వాత తొలిసారిగా ఓ టోర్నీలో సెమీఫైనల్ చేరాడు. మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ క్వార్టర్‌ఫైనల్లో శ్రీకాంత్ 24-22, 17-21, 22-20తో తనకంటే ఎన్నోరెట్లు మెరుగైన ప్రపంచ 18వ ర్యాంకర్ తోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)పై పోరాడి గెలుపొందాడు. గంటా 14 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలిగేమ్ నెగ్గి, రెండో గేమ్ ఓడిన శ్రీకాంత్.. నిర్ణాయక గేమ్‌లో మాత్రం అద్భుత ప్రదర్శనతో పైచేయి సాధించాడు. ఈ బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఈవెంట్‌లో క్వాలిఫయర్స్ ద్వారా అడుగుపెట్టిన శ్రీకాంత్ వరుసగా ఐదు మ్యాచ్‌లు గెలిచి టైటిల్‌కు చేరువవడం విశేషం. ఫైనల్ బెర్త్ కోసం జపాన్ షట్లర్ యుషి తనకతో శ్రీకాంత్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో పోరాటం ముగిసింది. క్వార్టర్‌ఫైనల్లో ధ్రువ్ ద్వయం 22-24, 13-21తో చైనాకు చెందిన టాప్‌సీడ్ జియాంగ్ జెన్ బాంగ్/వీ యా గ్జిన్ చేతిలో పరాజయం పాలైంది.

నీరజ్‌కు రెండోస్థానం



హోజో (పోలెండ్): ఇటీవల దోహా డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల దూరాన్ని అధిగమించి చిరకాల స్వప్నాన్ని సాకారం చేసుకున్న భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా.. తన తదుపరి ఈవెంట్‌లోనూ సత్తా చాటాడు. ఓర్లెన్ జానుజ్ కుసోస్సిన్స్కీ మెమోరియల్ అథ్లెటిక్స్ మీట్‌లో భాగంగా శుక్రవారం ఇక్కడ జరిగిన పోటీలో నీరజ్ రెండోస్థానంలో నిలిచాడు. నీరజ్ జావెలిన్‌ను 84.14 మీటర్ల దూరం విసిరాడు. మొదటి ప్రయత్నంలో ఫౌల్ చేసిన చోప్రా, రెండో ప్రయత్నంలో 81.28 మీటర్లు విసిరాడు. తర్వాత రెండు ఫౌల్స్ చేసిన నీరజ్ ఐదో యత్నంలో 81.80 మీటర్లు, ఆ తర్వాత చివరగా 84.14 మీటర్లతో సరిపెట్టుకున్నాడు. దోహా డైమండ్ లీగ్‌లో అగ్రస్థానంలో నిలిచిన జర్మనీ స్టార్ జులియన్ వెబర్ ఇక్కడా అదేజోరు చూపి ప్రథమస్థానం దక్కించుకున్నాడు. 86.12 మీటర్లతో వెబర్ టాప్‌లో నిలవగా.. పీటర్స్ అండర్సన్ (గ్రెనెడా) 83.24 మీటర్లతో మూడోస్థానానికి పరిమితమయ్యాడు.

ఆ ఇద్దరి స్థానాల భర్తీ కష్టమే



కోచ్ గంభీర్

న్యూఢిల్లీ: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల టెస్టు రిటైర్మెంట్‌పై కోచ్ గంభీర్ స్పందించాడు. ఆ ఇద్దరి స్థానాలను భర్తీ చేయడం కష్టమేనని అంగీకరించాడు. కానీ యువ ఆటగాళ్లకు ఇదో చక్కటి అవకాశంగా పేర్కొన్నాడు. 'టీమిండియాకు ఇప్పుడు ఇద్దరు సీనియర్లు లేకుండా ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రిటైర్మెంట్ అనేది ఆటగాళ్ల వ్యక్తిగత నిర్ణయం. అయినా రోహిత్, విరాట్ లేకుండా ఆడడం కాస్త కష్టమే. అయితే ఇతర ఆటగాళ్లకు తమ సత్తా నిరూపించుకునే చాన్స్ దక్కుతుంది. చాంపియన్స్ ట్రోఫీ సమయంలో పేసర్ బుమ్రా అందుబాటులో లేడు. అప్పుడు కూడా నేనిదే విషయం చెప్పాను. ఎవరైనా లేకపోతే మరొకరు జాతీయ జట్టులో చోటు దక్కించుకుని నిరూపించుకుంటారు. అలాంటి అవకాశం కోసం చాలామంది ఎదురుచూస్తుంటారు కూడా' అని గంభీర్ చెప్పుకొచ్చాడు.

ఇషాన్ షో



చెలరేగిన సన్‌రైజర్స్ బౌలర్లు
- బెంగళూరుకు ఝలక్
- పోరాడిన సాల్ట్, విరాట్

48 బంతుల్లో 94 నాటౌట్

లఖ్‌నవూ: టాప్-2 స్థానాల కోసం పోటీ పడుతున్న గుజరాత్, బెంగళూరు జట్లకు ప్లేఆఫ్స్ నుంచి నిష్క్రమించిన టీమ్స్ ఝలక్ ఇస్తున్నాయి. గిల్ సేన లఖ్‌నవూ చేతిలో ఓడినట్టుగానే.. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ స్థాయికి తగ్గ ఆటతీరుతో అదరగొట్టింది. ఇషాన్ కిషన్ (48 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 94 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. భారీ ఛేదనను దీటుగా ఆరంభించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు చివర్లో బౌలర్లు చెక్ పెట్టారు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రైజర్స్ 42 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ గెలిస్తే టాప్‌లోకి వెళ్లేది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 231 పరుగులు చేసింది. అభిషేక్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 34) రాణించారు. షెఫర్డ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో బెంగళూరు 19.4 ఓవర్లలో పరుగులు చేసింది. సాల్ట్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 62), విరాట్ (25 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 43) మాత్రమే ఆకట్టుకున్నారు. కమిన్స్‌కు మూడు, ఎషాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఇషాన్ నిలిచాడు.

16 పరుగులు..7 వికెట్లు: భారీ ఛేదనను ఆర్‌సీబీ ఆత్మవిశ్వాసంతో మొదలెట్టి పేలవంగా ముగించింది. ఓపెనర్లు విరాట్, సాల్ట్.. రైజర్స్ బౌలర్లను ఆరంభం నుంచే దీటుగా ఎదుర్కొన్నారు. ఈ జోడీ చక్కటి వేదికను ఏర్పరిచినా ఆఖరి ఐదు ఓవర్లలో 16 పరుగులకే 7 వికెట్లను కోల్పోయిన జట్టు మ్యాచ్‌ను కూడా చేజార్చుకుంది. విరాట్ వరుస బౌండరీలతో ముందు జోరు చూపాడు. ఆరో ఓవర్‌లో విరాట్ 6 సాల్ట్ 4,6తో 17 రన్స్ రాగా పవర్‌ప్లేను 72 రన్స్‌తో ముగించింది. అయితే చక్కగా కుదురుకున్న విరాట్‌ను హర్ష్ దూబే అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ ఆ తర్వాత సాల్ట్ ఎడాపెడా షాట్లతో విజృంభించాడు. దీంతో 27 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ పూర్తయ్యింది. ఈ దశలో వరుస ఓవర్లలో మయాంక్ (11), సాల్ట్ వికెట్లను కోల్పోవడం దెబ్బతీసింది. జితేశ్-పటీదార్ (18) కాసేపు నిలదొక్కుకుని నాలుగో వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఇక డెత్ ఓవర్లలో రైజర్స్ బౌలర్లు అదరగొట్టారు. 16వ ఓవర్‌లో పటీదార్ రనౌట్‌తో పాటు షెఫర్డ్ డకౌట్ కాగా తర్వాతి ఓవర్‌లోనే జితేశ్‌ను కోల్పోవడంతో ఆర్‌సీబీకి ఆశల్లేకుండా పోయాయి.

ఇషాన్ దూకుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ ఓ పక్క వికెట్లు కోల్పోయినా.. పరుగుల వేట మాత్రం ఆపలేదు. ఇషాన్ కిషన్ కీలక ఇన్నింగ్స్‌తో మెరవగా.. నితీశ్ (6) మినహా క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ అతడికి తమ వంతుగా సహకరించారు. దీంతో ఆరంభం నుంచే స్కోరుబోర్డు 11 పరుగుల రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. మధ్యలో కాస్త నెమ్మదించినా, చివరి మూడు ఓవర్లలో 43 రన్స్‌తో భారీ స్కోరందుకుంది. ఓపెనర్లు అభిషేక్, హెడ్ (17)ల ధాటికి 3.3 ఓవర్లలోనే 50 పరుగులు సాధించింది. పవర్‌ప్లేలోనే ఈ జోడీ వెనుదిరిగినా అప్పటికే 71/2 స్కోరుతో పటిష్ఠంగా నిలిచింది. ఆ తర్వాత ఇషాన్ బాధ్యత తీసుకుని క్లాసెన్ (24)తో మూడో వికెట్‌కు 48 పరుగులు జోడించాడు. తొమ్మిదో ఓవర్‌లో ఇషాన్ రెండు ఫోర్లు, క్లాసెన్ ఓ ఫోర్‌తో స్కోరు వందకి చేరింది. అయితే అదే ఓవర్‌లో క్లాసెన్‌ను స్పిన్నర్ సుయాష్ అవుట్ చేశాడు. అనికేత్ (26) 11వ ఓవర్‌లో 6,4,6తో 19 రన్స్ రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లోనూ అతడు సిక్సర్ బాదినా క్రునాల్‌కు చిక్కాడు. అటు పది ఇన్నింగ్స్ తర్వాత ఇషాన్ 28 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. నితీశ్ నిరాశపర్చినా అభినవ్ (12), కమిన్స్ (13)తో కలిసి ఇషాన్ చివర్లో జోరు చూపాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 6,4 బాదిన ఇషాన్ తన సెంచరీకి ఆరు పరుగుల దూరంలో నిలవాల్సి వచ్చింది. ఏడో వికెట్‌కు ఇషాన్-కమిన్స్ అజేయంగా 43 పరుగులు జోడించారు.

పాయింట్ల పట్టిక

జట్లు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
పంజాబ్	12	8	3	1	17	0.389
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	-0.019
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	13	5	7	1	11	-0.737
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ శర్మ (సి) సాల్ట్ (బి) ఎంగిడి 34, హెడ్ (సి) షెఫర్డ్ (బి) భువనేశ్వర్ 17, ఇషాన్ (నాటౌట్) 94, క్లాసెన్ (సి) షెఫర్డ్ (బి) సుయాశ్ 24, అనికేత్ (సి) భువనేశ్వర్ (బి) క్రునాల్ 26, నితీశ్ (సి) క్రునాల్ (బి) షెఫర్డ్ 4, అభినవ్ (సి) సాల్ట్ (బి) షెఫర్డ్ 12, కమిన్స్ (నాటౌట్) 13, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 231/6; వికెట్ల పతనం:** 1-54, 2-54, 3-102, 4-145, 5-164, 6-188; **బౌలింగ్:** యశ్ దయాల్ 3-0-36-0, భువనేశ్వర్ 4-0-43-1, ఎంగిడి 4-0-51-1, సుయాశ్ 3-0-45-1, క్రునాల్ 4-0-38-1, షెఫర్డ్ 2-0-14-2.

బెంగళూరు: సాల్ట్ (సి) హర్షల్ (బి) కమిన్స్ 62, కోహ్లీ (సి) అభిషేక్ (బి) దూబే 43, మయాంక్ (సి) ఇషాన్ (బి) నితీశ్ 11, పటీదార్ (రనౌట్) 18, జితేశ్ (సి) అభినవ్ (బి) ఉనాద్కట్ 24, షెఫర్డ్ (సి అండ్ బి) మలింగ 0, క్రునాల్ (హిట్‌వికెట్) (బి) కమిన్స్ 8, డేవిడ్ (సి) క్లాసెన్ (బి) మలింగ 1, భువనేశ్వర్ (బి) కమిన్స్ 3, యశ్ దయాల్ (సి) అనికేత్ (బి) హర్షల్ 3, ఎంగిడి (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 19.5 ఓవర్లలో 189 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-80, 2-120, 3-129, 4-173, 5-174, 6-174, 7-179, 8-186, 9-187, 10-189; **బౌలింగ్:** కమిన్స్ 4-0-28-3, ఉనాద్కట్ 4-0-41-1, హర్షల్ 3.5-0-39-1, మలింగ 4-0-37-2, హర్ష్ దూబే 2-0-20-1, నితీశ్ 2-0-13-1.

టెస్టులకు మాథ్యూస్ వీడ్కోలు



బంగ్లాతో తొలి టెస్టే ఆఖరిది

కొలంబో: శ్రీలంక వెటరన్ ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్టులకు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాడు. బంగ్లాదేశ్‌తో గాలె వేదికగా వచ్చే నెల 17 నుంచి జరిగే తొలి టెస్టే తన కెరీర్‌లో ఆఖరిదని తేల్చాడు. ఇక పరిమిత ఓవర్లలో జట్టు కోరుకుంటే అందుబాటులో ఉంటానని ప్రకటించాడు. 2009లో గాలె మైదానంలోనే 37 ఏళ్ల మాథ్యూస్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. 17 ఏళ్లుగా శ్రీలంకకు ఆడడాన్ని గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపాడు. మాథ్యూస్ 118 టెస్టుల్లో 16 శతకాలు, 8,167 పరుగులతో పాటు 33 వికెట్లు తీశాడు. 34 టెస్టుల్లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. సంగక్కర, జయవర్ధనె తర్వాత ఈ ఫార్మాట్‌లో ఎక్కువ పరుగులు సాధించిన లంక బ్యాటర్‌గా మాథ్యూస్ కొనసాగుతున్నాడు.

అడ్రియన్ కంచు మోత

జూనియర్ షూటింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. జర్మనీలోని సుల్‌లో శుక్రవారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో అడ్రియన్ కర్మాకర్ కాంస్యం సాధించాడు. రొమైన్ (ఫ్రాన్స్)కు స్వర్ణం, ఓస్టిల్ (నార్వే)కు రజతం దక్కాయి.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

నాగార్జునసాగర్, మే 23(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో కుడి కాలువకు గురువారం రాత్రి ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేశారు. ఏపీలో కుడి కాలువ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి అవసరాల కోసం చెరువులు, కుంటలు నింపనున్నట్లు అధికారులు తెలిపారు. కుడి కాలువకు 2, 3వ నంబరు తూముల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. రోజుకు సుమారు 5వేల క్యూసెక్కుల చొప్పున 10రోజుల్లో 4టీఎంసీల నీటిని విడుదల చేస్తారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450 టీఎంసీలు)కాగా ప్రస్తుతం 512.50 అడుగులుగా(135.9545టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 5,598 క్యూసెక్కులు, జంటనగరాలకు ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు సాగర్ ప్రాజెక్టులో పూడికను అంచనా వేసి కనిష్ఠ నీటి మట్టాన్ని కేఆర్ఎంబీ అధికారులు తగ్గించారు. ప్రస్తుతం 505 అడుగులు(115.6540టీఎంసీలు)గా కనిష్ఠ నీటి మట్టాన్ని తీసుకున్నారు.

ఇంటర్ ఇంగ్లిష్ సప్లిమెంటరీ పరీక్షలకు 6,595 మంది గైర్హాజరు


హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్ష పేపర్-1, 2లకు కలిపి 6,595 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫస్టియర్ పేపర్-1 పరీక్షకు 53,736 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా 48,412 మంది (90 శాతం) హాజరయ్యారు. 5,324 మంది గైర్హాజరయ్యారు. రెండో సంవత్సరానికి సంబంధించిన పేపర్-2 పరీక్షకు 6,932 మంది రిజిస్టర్ చేసుకోగా.. 5,661 మంది (81.66శాతం) హాజరవగా.. 1,271 మంది గైర్హాజరైనట్టు ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది.

వేగవంతమైన జూరాల గేట్ల మరమ్మతులు

» పనులను పరిశీలించిన ఎస్ఈ రహీమొద్దీన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమరచింత, మే 23 (ఆంధ్రజ్యోతి): "జూరాల ప్రాజెక్టులో వరద నీటి వృథా" అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. అధికారులు వేగవంతంగా మూడు గేట్ల వద్ద రోప్‌ల మరమ్మతులు చేపట్టారు. మరో రెండు గేట్ల వద్ద పనులను ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. జూరాల ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న గేట్ల మరమ్మతు పనులను ప్రాజెక్టు ఎస్ఈ రహీమొద్దీన్, డీఈలు, ఏఈల బృందం పరిశీలించింది. ఇరిగేషన్ అధికారులతో పాటు సెక్రటేరియట్, ఈఎన్సీ అధికారులు కూడా ప్రాజెక్టు వరద నీటి వృథాపై ఆరా తీసినట్లు తెలిసింది. ఒకవైపు జూరాల గేట్ల వద్ద రోప్ మరమ్మతు పనులు కొనసాగుతుండగా మరోవైపు స్టాఫ్ లాక్ ఎలిమెంట్ సెంటర్ల పైనుంచి వరదనీరు వృథాగా దిగువకు పారుతోంది. మూడు రోజులుగా వృథాగా పోతున్న వరద శుక్రవారం కూడా కొనసాగింది.



కాపీరైట్ పొందిన భద్రాద్రి సీతారామచంద్రుల మూలవరుల ఫొటోలు

భద్రాద్రి రామయ్య చిత్రాలకు కాపీరైట్

» వినియోగంపై హక్కులు పొందిన దేవస్థానం

» జూన్ 20 తర్వాత విక్రయిస్తే కఠిన చర్యలు

భద్రాచలం, మే 23(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆరాధ్య దైవమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి చిత్రాలు, ఫొటోలను విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ఇకపై చట్టపరమైన ఆటంకాలు ఎదురుకానున్నాయి. సీతారామచంద్రస్వామి మూలమూర్తులు, చిత్రాలపై సర్వహక్కులు ఇక నుంచి భద్రాద్రి దేవస్థానానికి ఉండనున్నాయి. ఈ మేరకు భద్రాద్రి దేవస్థానం మూలవరుల చిత్రాలు, ఫొటోలపై కాపీరైట్ హక్కులను అధికారికంగా పొందింది. ఈ క్రమంలో దేవస్థానం కీర్తి ప్రతిష్ఠలకు భంగం వాటిల్లేలా చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడే ముద్రణదారులు, వ్యాపారులు, వారికి సహకరించే వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రావ్ అండ్ రావ్ ట్రేడ్ మార్క్స్, పేటెంట్, డిజైన్ కాపీరైట్ రిజిస్ట్రేషన్ కన్సల్టెంట్స్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తమ ఆధీనంలో ఉన్న చిత్రాలు, ఫొటోలను సదరు ముద్రణ సంస్థల నిర్వాహకులు, వ్యాపారులు జూన్ 20తర్వాత విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, జైలుశిక్ష తప్పదని స్పష్టం చేశారు.

జూన్ 2 నుంచి విత్తనాల పంపిణీ కార్యక్రమం

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని జూన్ 2న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ప్రతీ రెవెన్యూ గ్రామం నుంచి ఎంపికైన ముగ్గురు నుంచి అయిదుగురు అభ్యుదయ రైతులకు వర్సిటీలో ఉత్పత్తి చేసిన విత్తనాల పంపిణీ ద్వారా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ కమిటీ తెలంగాణ చైర్ పర్సన్‌గా డీకే అరుణ



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు చెందిన కన్సల్టేటివ్ కమిటీకి తెలంగాణ చైర్ పర్సన్‌గా ఎంపీ డీకే అరుణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో ఆహార ఉత్పత్తులు, ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఇతర అంశాలపై ఈ కమిటీ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తుంది. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన కేంద్ర ప్రభుత్వానికి డీకే అరుణ కృతజ్ఞతలు తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు స్వామిజీ, హరీశ్ తదితరులు

రమణాచారి 'హరే శ్రీనివాస' పుస్తకావిష్కరణ

» తిరుమలలో గొప్ప సంస్కరణ తెచ్చిన ఘనత ఆయనదే: హరీశ్

రవీంద్రభారతి, మే 23 (ఆంధ్రజ్యోతి): రమణాచారిని శ్రీనివాసుడు వదిలితే పుష్పగిరి శంకరుడు పట్టుకున్నాడని పుష్పగిరి పీఠాధిపతులు, జగద్గురువులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో శుక్రవారం కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు, రిటైర్డు ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి. రమణాచారి రచించిన 'హరే శ్రీనివాస' అనే పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి మాట్లాడుతూ.. అసాధ్యాలను సుసాధ్యం చేసిన రమణాచారి అద్భుత సత్యాల హారం 'హరే శ్రీనివాస' అని.. భవిష్యత్‌లో పుష్పగిరి శ్రీనివాస పుస్తకం రావాలని ఆకాంక్షించారు. కళాకారుల శ్రేయస్సు కోసం తపించడంతోపాటు పలు విజయాలు సాధించిన రమణాచారి ఈ పుస్తకం తేవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన మాజీ మంత్రి హరీశ్ మాట్లాడుతూ రమణాచారి ఏ పదవిలో ఉన్నా.. ఆ పదవికే ఔన్నత్యాన్ని తెచ్చారన్నారు. బ్రాహ్మణుల్లోనూ పేదలుంటారని గుర్తించడంతోపాటు వారి కోసం రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటులో రమణాచారి పాత్ర గొప్పదని అన్నారు. జి. వల్లీశ్వర్ ఈ పుస్తకాన్ని సమీక్షించారు. చివరిగా రమణాచారి మాట్లాడుతూ.. తన పుస్తకావిష్కరణకు గొప్పవారు వచ్చినందుకు ఆనంద దాయకం అని తెలిపారు. తిరుమలలో గడిపిన అనుభవాలను ఈ పుస్తకంలో పొందుపరిచానని చెప్పారు.

ప్రగతి దిశగా ముందడుగు

నేడు 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' ఆవిష్కరణ.. నీతి ఆయోగ్ భేటీలో ఆవిష్కరించనున్న రేవంత్

ప్రధాని మోదీతో కలిసి అల్పాహారం చేయనున్న ముఖ్యమంత్రి

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు ఢిల్లీ వేదికగా ఆవిష్కృతం కానున్నాయి. 2047 నాటికి తెలంగాణ సాధించదలచుకున్న లక్ష్యాలు, సుపరిపాలన విధానాలతో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ విజన్-2047'ను సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ఢిల్లీలో నీతి ఆయోగ్ సమావేశం వేదికగా ఆవిష్కరించనున్నారు. దీంతోపాటు రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం అందించాల్సిన సహాయ సహకారాలపై తెలంగాణ తరఫున ప్రత్యేక నివేదికను సమర్పించనున్నారు. 'వికసిత్ రాజ్య.. వికసిత్ భారత్' ఎజెండాగా ఢిల్లీలోని భారత మండపంలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఇందులో తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పెట్టుబడుల సాధన, మౌలిక వసతుల అభివృద్ధికి ఏ విధంగా ముందుకు వెళ్తున్నామనే అంశంతోపాటు ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న 'తెలంగాణ రైజింగ్' నినాదం గురించి సీఎం తెలియజేస్తారు. తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా చేపడుతున్న పనుల గురించి కూడా వివరించనున్నారు. అదేవిధంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఔషధ రంగం, పట్టణీకరణలో ఇప్పటికే తెలంగాణ ముందుందని, ఆయా రంగాల్లో మరింత ముందుకు వెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలపనున్నారు.

ప్రభుత్వ పథకాలపై వివరణలు..

వ్యవసాయ రంగం అభివృద్ధిలో భాగంగా రైతులకు చేసిన రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, సన్న బియ్యం పంపిణీ, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే పథకం, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు పథకం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల గురించి వివరించనున్నారు. వీటితోపాటు రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్లు, డ్రైపోర్టు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ప్రపంచస్థాయి సౌకర్యాలతో విశ్వవిద్యాలయాల ఏర్పాటుపై ప్రసంగిస్తారు. కాగా, నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రమే హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. శనివారం భారత్ మండపంలో ప్రధాని మోదీతోపాటు పలువురు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి సీఎం రేవంత్ అల్పాహారం చేయనున్నారు. ఆ తరువాత ప్రధాని, ఇతర రాష్ట్రాల సీఎంలతో కలిసి గ్రూప్ ఫొటో కార్యక్రమంలో పాల్గొననున్నారు. కాగా, 2018 తరువాత నీతి ఆయోగ్ సమావేశానికి తొలిసారిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ తరఫున హాజరవుతున్నారు.

మోదీని ఎన్నిసార్లయినా కలుస్తా

(మొదటిపేజీ తరువాయి)

రహదారితోపాటు, బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇండస్ట్రీలు, ఫార్మా, ఐటీ రంగాల్లో ప్రగతి సాధించాల్సి ఉందన్నారు. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే సంక్షేమ నినాదంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిననే అహంభావం తనకు ఏమాత్రం లేదని రేవంత్ అన్నారు. ఎప్పటిలాగే పేదోడు, పెద్దోడు అనే తేడా లేకుండా ఎవరినైనా కలుస్తున్నానన్నారు. జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఓసారి ఎంపీగా 20 ఏళ్లపాటు రాజకీయంలో ఉన్నా.. గతంలో ఏనాడూ అధికారంలో లేనని, అయినా ప్రజల్లో ఉన్నందునే ఈరోజు ముఖ్యమంత్రిగా అందరి ముందుకు వచ్చానని పేర్కొన్నారు. ప్రతిపక్షంలోనూ, అధికార పక్షంలోనూ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని తెలిపారు.

ప్రతిపక్ష నేత ఫాంహౌస్‌కే పరిమితమా..?

ప్రశ్నించే గొంతుకగా ఉండాల్సిన ప్రతిపక్ష నేత ఫాంహౌస్‌లో పడుకుంటారా? అధికారం ఉంటేనే అసెంబ్లీలో అడుగుపెడతారా? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. శాసనసభకు వచ్చి ఆయన అనుభవంతో తమ తప్పొప్పులు చెబితే సరిదిద్దుకుంటామని అన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులతో అదానీ, అంబానీలతో పోటీపడేలా ఆడబిడ్డలు వ్యాపారం చేయాలని ఆకాంక్షించారు. మెదక్ అంటేనే ఇందిరమ్మ అని, ఆమె మెదక్ ఎంపీగా గెలిచి ప్రధాన మంత్రి అయ్యారని రేవంత్ గుర్తు చేశారు. బీడీఎల్, బీహెచ్ఈఎల్, ఇక్రిశాట్ సంస్థలు ఇందిరమ్మ చొరవతోనే ఏర్పాటయ్యాయన్నారు. కాగా, జహీరాబాద్ ప్రాంతంలోని నిమ్జ్ పారిశ్రామిక కారిడార్‌లో 450 ఎకరాలను హ్యుందాయ్ కార్ల పరిశ్రమకు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు. హ్యుందాయ్ పరిశ్రమతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంతంలో చెరుకు పండించే రైతులు ఒక సహకార సంఘంగా ఏర్పాటైతే వారి కోసం 100 ఎకరాలను కేటాయిస్తామని అన్నారు. చక్కెర పరిశ్రమను వారి ఆధ్వర్యంలో అద్భుతంగా నిర్వహించుకోవచ్చని సూచించారు. ఇక దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే కాకుండా న్యూయార్క్, టోక్యో నగరాలతో పోటీపడే విధంగా హైదరాబాద్ మారుతుందని చెప్పారు. మంజీరా జలాలతో హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్న సింగూరు రిజర్వాయర్‌ను ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. వార్డుమెంబరు నుంచి పార్లమెంటు మెంబరు వరకు కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకోవడానికి తన శాయశక్తులా కష్టపడతానన్నారు. కాగా, జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప నాయకుడని, సమాజంలో అణచివేతకు గురైన బలహీనవర్గాల తరఫున నిలబడ్డాడని కొనియాడారు. ఆ రోజుల్లో అనుభవ మంటపాలను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించేవారని తెలిపారు. ఆ అనుభవ మంటపాల ఆధారంగానే నేడు అసెంబ్లీ పార్లమెంటులో సమస్యల పరిష్కారం కోసం మాట్లాడుతున్నామని చెప్పారు.



సభలో జగ్గారెడ్డితో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

విద్యార్థులతో ముఖ్యమంత్రి మాటామంతీ

ఝరాసంగం: దేశ, రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని సీఎం రేవంత్ అన్నారు. చదువుల్లో రాణించాలని. తల్లిదండ్రులు గర్వపడేలా సమాజంలో మంచి పేరు తేవాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధి మాచనూరు సమీపంలో రూ.26 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయం భవనాన్ని శుక్రవారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులను సీఎం ఆత్మీయంగా పలకరించారు. "ఏ తరగతి చదువుతున్నారు? ఇక్కడ చదువు బాగా చెబుతున్నారా?" అని ప్రశ్నించారు.బాగా చదువుకోవాలని సూచించారు.

నిమ్జ్ నిర్వాసితుల బాధ్యత జగ్గారెడ్డికి: సీఎం రేవంత్

జహీరాబాద్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయడానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిమ్జ్‌కు శ్రీకారం చుట్టారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే జరిగిన భూసేకరణలో నిర్వాసితులైన వారికి నష్టపరిహారం చెల్లించారని, పెండింగ్‌లో ఉన్న పరిహారం చెల్లింపు కూడా పూర్తవుతుందని అన్నారు. నిర్వాసితులైన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ బాధ్యతను సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి అప్పగిస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితులకు మంచి భోజనం పెట్టించి వారికి ప్రభుత్వపరంగా పట్టాలు ఇప్పించే బాధ్యతను జగ్గారెడ్డి తీసుకోవాలని సూచించారు.

పదవుల కోసం రాజకీయాల్లోకి రావొద్దు

» ఇందిర కుటుంబం పదవులను ఆశించలేదు: శ్రీధర్‌బాబు



కీసర, మే 23 (ఆంధ్రజ్యోతి): పదవుల కోసం రాజకీయాల్లోకి రావొద్దని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం మునిసిపల్ పరిధి రాంపల్లి దాయరలోని బాలవికాస కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. శుక్రవారం రెండో రోజు మంత్రి హాజరై మాట్లాడుతూ.. యువత పదవులు ఆశించి రాజకీయాల్లోకి రావొద్దని సూచించారు. ఇందిరాగాంధీ నుంచి మొదలుకొని నేటి తరం రాహుల్‌గాంధీ వరకు వారి కుటుంబం ఎలాంటి పదవులు ఆశించలేదన్నారు. ఉగ్రవాదం అణచివేతలో ఇందిరాగాంధీ అప్పట్లో తీసుకున్న నిర్ణయం సాహసోపేతమని కొనియాడారు. రాజీవ్‌గాంధీ దేశంలో ఐటీ అభివృద్ధికి పునాది వేసిన మహనీయుడని పేర్కొన్నారు. నేడు రాహుల్ గాంధీ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచారని, దేశవ్యాప్తంగా జోడో యాత్ర ద్వారా ప్రజలను చైతన్యవంతుల్ని చేశారన్నారు. ఇప్పుడు వైట్ టీషర్ట్ కార్యక్రమం చేపట్టి కరుణ, ఐక్యత, అహింస, సమానత్వం, పురోగతి అనే అంశాలపై యువజన కాంగ్రెస్‌కు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నాస్కామ్‌తో ఉన్నత విద్యా మండలి ఒప్పందం

హైదరాబాద్, మే23(ఆంధ్రజ్యోతి):తెలంగాణ ఉన్నత విద్యామండలి పరిధిలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే విధంగా నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్)తో మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. నాస్కామ్ స్కిల్ సెక్టార్ కౌన్సిల్ శిక్షణతో వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన వివరించారు.

ఢిల్లీ టూర్లతో సీఎం విజయాలు

» తెలంగాణకు ఐపీఎస్ క్యాడర్ పెంపు

» 2 వేల విద్యుత్ బస్సుల కేటాయింపు

» ఫలితాలనిస్తున్న ఢిల్లీ పర్యటనలు: సీఎంవో

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో పలుచోట్ల ఫ్లైఓవర్ల నిర్మాణానికి అవసరమైన కంటోన్మెంట్ భూముల బదలాయింపు నుంచి రాష్ట్ర అవసరాలకు తగిన విధంగా ఐపీఎస్ క్యాడర్ సంఖ్య పెంపు, రాష్ట్రానికి 2వేల విద్యుత్ బస్సుల కేటాయింపు వరకు తెలంగాణ విజ్ఞప్తుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనల నేపథ్యంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసి చేసిన విజ్ఞప్తుల్లో కొన్నింటికి కేంద్రం పచ్చజెండా ఊపిందని పేర్కొంది. సీఎంవో వివరాల ప్రకారం.. ఇప్పటికే కంటోన్మెంట్ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి పట్ల సానుకూలంగా వ్యవహరించిన కేంద్రం ఆ భూముల బదలాయింపునకు మార్గం సుగమం చేసింది. తాజాగా తెలంగాణ ఐపీఎస్ క్యాడర్ సంఖ్యను కూడా 139 నుంచి 151కు పెంచుతూ గెజిట్‌ను విడుదల చేసింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు కేటాయించిన ఐపీఎస్ అధికారుల సంఖ్య రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదని ప్రధాని మోదీకి, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు సీఎం రేవంత్ గతంలో కలిసి వివరించారు. ఆ సమయంలోనే రాష్ట్రానికి అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని వారికి లేఖలు రాశారు. సీఎం విజ్ఞప్తుల పట్ల సుముఖత వ్యక్తం చేసిన కేంద్రం రాష్ట్రానికి 12 ఐపీఎస్ క్యాడర్ పోస్టులను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కాగా, హైదరాబాద్ నగర విస్తీర్ణం భారీగా పెరుగుతుండడం, నానాటికీ కాలుష్యం పెరుగుతున్నందున కాలుష్య నివారణతో పాటు ఆధునిక నగర అవసరాలకు తగినట్లు విద్యుత్ బస్సులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ పలుమార్లు కోరారు. ఈ ఏడాది జనవరి 16న ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి, ఆ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ఆ సందర్భంగా పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద హైదరాబాద్ నగరానికి ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించాలని కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఎలక్ట్రిక్ బస్సులతో ప్రస్తుతం ఉన్న ఆర్టీసీ డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతినకుండా ఉండేలా.. డీజిల్ బస్సులను రిట్రోఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చాలని కోరారు. ఈ క్రమంలో విద్యుత్ బస్సుల కేటాయింపుపై ఉన్న అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఇటీవల 2వేల ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించింది. వచ్చే ఏడాది మార్చి నాటికి హైదరాబాద్ నగరంలో ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయని సీఎం కార్యాలయం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రభుత్వోద్యోగులకు త్వరలో తీపి కబురు?!

» పెండింగ్ బకాయిల చెల్లింపు

» ఒక డీఏ విడుదలతోపాటు ఆరోగ్య పథకం వెల్లడి

» రాష్ట్ర అవతరణ దినోత్సవాన అధికారిక ప్రకటన

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రభుత్వోద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురందించనున్నది. ఉద్యోగుల డిమాండ్లపై ఇప్పటికే అధికారుల కమిటీని ఏర్పాటు చేసిన సర్కారు.. కొన్ని డిమాండ్ల పరిష్కారానికి అంగీకరించినట్లు సమాచారం. రిటైర్డు ఉద్యోగుల బెనిఫిట్లతోపాటు పెండింగ్ బకాయిల చెల్లించడానికి ముందుకొచ్చినట్లు వినికిడి. ఇక ఒక డీఏ, ఆరోగ్య పథకం ప్రకటించే అవకాశాలున్నాయి. సత్వరం ఆర్థికేతర డిమాండ్లను నెరవేర్చడానికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయనున్నదని ఉద్యోగ సంఘాల వర్గాలు చెబుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న 5 డీఏల్లో 2 డీఏలు ఇవ్వాలని ఉద్యోగులు పట్టుబడుతున్నా.. ఒక డీఏ విడుదలకు సర్కారు సుముఖత వ్యక్తం చేసినట్లు ఉద్యోగుల కథనం. అలాగే ఉద్యోగుల కోరిక మేరకు ఆరోగ్య పథకం ప్రకటించడానికి ప్రభుత్వం అంగీకరించినట్లు తెలియవచ్చింది. కాగా ఉద్యోగ సంఘాల నేతలు ఒక్కటిగానే ఉండాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దల సూచనలతో మారం జగదీశ్వర్ నేతృత్వంలోని ఉద్యోగ సంఘాల జేఏసీలో లచ్చిరెడ్డి సారథ్యంలోని ఉద్యోగ సంఘాల జేఏసీ విలీనానికి సిద్ధమైనట్లు వినికిడి. ఈ మేరకు ప్రభుత్వ పెద్దల సమక్షంలోనే ఇరు పక్షాల నేతల మధ్య జరిగిన చర్చలు ముగిశాయని, వారం రోజుల్లో ఉద్యోగ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి.. రెండు జేఏసీల విలీనంపై ప్రకటన చేస్తారని సమాచారం.

నోటీసులకే వణికిపోతే ఎలా?

కాళేశ్వరం ప్రాజెక్టులో తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

» తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సిన ప్రాజెక్టును మేడిగడ్డకు ఎందుకు మార్చారు?

» కాళేశ్వరం పేరుతో 82 వేల కోట్ల ఆర్థిక భారాన్ని రాష్ట్రంపై మోపారు: ఉత్తమ్



హైదరాబాద్, మే23 (ఆంధ్రజ్యోతి): "జ్యుడీషియల్ కమిషన్ నోటీసులు ఇస్తేనే వణికిపోతున్నారు.. కమిషన్ నివేదిక ఇచ్చాక ప్రాజెక్టు నిర్మాణంలో తప్పులు చేసిన వారికి చట్టపరంగా శిక్షలు తప్పవు.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఘోర తప్పిదాలు జరిగాయని రాజ్యాంగబద్ధంగా పని చేసే అన్ని సంస్థలు తప్పుబట్టాయి. బీఆర్ఎస్ నాయకులు మాత్రం ప్రజలను నమ్మించేందుకు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు" అని బీఆర్ఎస్ నేతలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు వివరాల కోసం విచారణ కమిషన్ నోటీసు ఇస్తే.. బీఆర్ఎస్ నేతలు కమిషన్‌నే దూషిస్తూ తప్పుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టు విషయంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు మాటలను వినుంటే జోసెఫ్ గోబెల్స్ కూడా పరేషాన్ అయ్యేవాడన్నారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో తుమ్మిడిహట్టి ప్రాజెక్టు పనులను చేపట్టామని, రూ.10వేల కోట్లతో కాలువ పనులు కూడా జరిగాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే 16 నుంచి 17 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదన్నారు. ఇలాంటి ప్రాజెక్టును కాదని.. కేవలం బీఆర్ఎస్ నేతల కమిషన్ల కక్కుర్తితో తుమ్మిడిహట్టిని పక్కన పెట్టి.. మేడిగడ్డ వద్ద కాళేశ్వరం చేపట్టారని మండిపడ్డారు. కాళేశ్వరం పేరుతో రూ.84 వేల కోట్లకు అంచనాలు పెంచుకుని, ఆ తరువాత దాన్ని రూ.1.20 లక్షల కోట్లకు పెంచారన్నారు. ఇప్పుడు మరమ్మతులు చేయాలంటే రూ.1.50 లక్షల కోట్లు అవుతుందన్నారు. తుమ్మిడిహట్టిని కాదని మేడిగడ్డకు ఎందుకు మార్చారో బీఆర్ఎస్ నేతలు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు తమ కక్కుర్తి, అసమర్థత, అహంకారంతో తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఓ పెద్దమనిషి ప్రాజెక్టులో బాంబులు పెట్టించారని ఆరోపణలు చేస్తున్నారని.. ఇదే విషయంపై బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే 21 అక్టోబరు 2023లో ఎఫ్ఐఆర్ నమోదైందని గుర్తు చేశారు. అప్పుడే ఎందుకు విచారణ చేయించలేదని ప్రశ్నించారు.. కనీసం ఇప్పుడైనా బాంబుకు సంబంధించిన వివరాలను కమిషన్‌కు ఇవ్వాలని కోరారు.

నిలోఫర్ సూపరింటెండెంట్‌పై కొరడా

(మొదటిపేజీ తరువాయి)

డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలంను విధుల నుంచి తప్పించి.. ఎల్బీనగర్ డీఎంహెచ్‌వో డాక్టర్ పి. చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తీవ్రమైన అవినీతి ఆరోపణలతోనే..

శుక్రవారం ప్రభుత్వం చర్యలు చేపట్టిన ముగ్గురు అధికారులపై కూడా అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్నాయి. నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్.. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద వచ్చిన నిధులను దుర్వినియోగం చేశారని.. బ్లడ్‌బ్యాంకులో నుంచి ఆస్పత్రి సిబ్బంది రక్తం బ్యాగులు దొంగతనం చేసినట్టు తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలున్నాయి. వీటితో పాటు పలు ఇతర ఆరోపణలపై ఆయనకు చార్జ్ మెమో కూడా జారీ అయింది. గతంలో ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులను నిలోఫర్‌కు తీసుకువస్తే.. వెంటనే చికిత్స అందించకుండా, వారికి 14 ఏళ్లపై వయసు ఉందని, ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇటీవల ఆస్పత్రి పార్క్ ప్రాంతంలో ఓ ప్రైవేటు మెడికల్ షాపు నిర్మాణం కోసం అనుమతులు ఇవ్వడం వివాదాస్పదమైంది. సీఎం ఆఫీసు, వైద్య మంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకే నిర్మాణం చేపట్టామంటూ ఆయన మీడియాతో మాట్లాడటంతో.. సర్కారు సీరియస్ అయింది. ఇక సూర్యాపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం.. కొవిడ్ సమయంలో జాతీయ ఆరోగ్య మిషన్, రాష్ట్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. సూర్యాపేట జిల్లాలో పెద్ద సంఖ్యలో ప్రైవేటు ఆస్పత్రులకు... నిబంధనలకు విరుద్ధంగా, వైద్యుల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కూడా లేకుండానే అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై జిల్లా వైద్యులు కొందరు ఫిర్యాదు చేయడంతో.. మంత్రి దామోదర రాజనర్సింహ విచారణకు ఆదేశించారు. ఆ నివేదిక ప్రభుత్వానికి అందింది. కోటాచలంపై వేటు పడింది. మరోవైపు పేట్లబుర్జు ఆస్పత్రి సూపరింటెండెంట్ రజనిరెడ్డి అవినీతికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఇంతకు ముందూ ముగ్గురు!

అవినీతి, అక్రమాల ఆరోపణలు, విధుల్లో నిర్లక్ష్యంతో కొన్నిరోజుల కిందే ముగ్గురు వైద్యారోగ్య శాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టడం గమనార్హం. జగిత్యాల బోధనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములుపై పలు రకాల ఆరోపణలు రావడం, ఆస్పత్రిలో సరిగ్గా ఉండటం లేదన్న ఫిర్యాదులతో చర్యలు చేపట్టింది. నిజామాబాద్ బోధనాస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ ప్రతిమారాజ్‌ను కూడా సర్కారు ఉన్నపళంగా తొలగించింది. ఆస్పత్రి ప్రాంగణంలో పుట్టినరోజు వేడుకలు చేసుకోవడం, రోగులను పట్టించుకోకపోవడంతో ఆమెపై వేటు పడింది. పలు రకాల ఆరోపణలతో వనపర్తి వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సునందినిని సర్కారు తప్పించింది.

డాడీ.. డాటర్ లేఖ ఓ డ్రామా

- కవిత లేఖ ఎందుకు రాసిందో అర్థం కాలే: కిషన్‌రెడ్డి
- ఓటీటీ డ్రామాలా లిక్కర్ క్వీన్ కవిత లేఖ : సంజయ్
- కవిత లేఖ.. కాంగ్రెస్ కుట్ర?: డీకే అరుణ
- మరో షర్మిల కానున్న కవిత: రఘునందన్



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభపై ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు ఆయన కుమార్తె రాసిన లేఖ ఒక డ్రామా మాత్రమేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. "డాడీ.. డాటర్ లేఖ ఓ డ్రామా మాత్రమే" అని వ్యాఖ్యానించిన ఆయన.. అసలు ఆమె ఆ లేఖ ఎందుకు రాసిందో తనకైతే అర్థం కాలేదని, అందులో కంటెంట్ (విషయమేమీ) లేదని పేర్కొన్నారు. శుక్రవారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డాడీ, డాటర్ మధ్య మాటల్లేవన్న సంగతి తనకు ఇప్పుడే తెలిసిందన్నారు. ఆమె లేఖకు అంత ప్రాధాన్యం ఇవ్వక్కర్లేదని.. అది వారి మధ్య అంతర్గత విషయమని అని ఆయన అభిప్రాయపడ్డారు. "బీఆర్ఎస్ పార్టీ డాడీ..డాటర్..సన్ పార్టీ. అంతే కాదు.. సన్ ఇన్ లా (అల్లుడు).. స్ట్రోక్ పార్టీ.. ఇది నాలుగు స్తంభాల ఆటలాంటిది" అని కిషన్‌రెడ్డి వ్యంగ్యవ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, ఎప్పుడూ ప్రజాసంఘాలను, రైతు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను కలవలేదని.. 2019లో తాను మొదటిసారి కేంద్రమంత్రి అయిన తర్వాత నాటి సీఎం కేసీఆర్‌ను గౌరవంగా కలవాలనుకున్నా తనకే ఆయన సమయం ఇవ్వలేదని కిషన్ రెడ్డి చెప్పారు. "నేను అప్పుడే ఈ మాట అంటే, మా డాడీ అందరినీ కలుస్తారంటూ డాటర్ చెప్పారు. కానీ, కేడర్‌ను కలుస్తలేరనే విషయాన్ని ఇప్పుడు ఆమెనే చెప్పింది" అని వ్యాఖ్యానించారు. "కేసీఆర్ బీజేపీపై రెండే నిమిషాలు తిట్లు తిట్టారని ఆమె రాశారు. పదేళ్ల తిట్టింది సరిపోదా? ఐనా.. మునిగిపోయిన పార్టీ తిడితేంది? తిట్టకపోతేంది?" అని ఎద్దేవా చేశారు. అలాగే.. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిన కేసును సీబీఐకి అప్పగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



డ్రామాలకు కేరాఫ్‌గా..

ఒకప్పుడు ఉద్యమాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ, ఇప్పుడు డ్రామాలకు కేరాఫ్‌గా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో మద్యం కంపు పుట్టించిన లిక్కర్ క్వీన్ వాళ్ల నాన్నకు రాసిన లేఖ ఇప్పుడు ఓటీటీ డ్రామాను తలపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. "బహుశా 'కాంగ్రెస్ వదిలిన బాణం' పేరుతో ఇది తెరకెక్కితే ఓటీటీ రికార్డులు తిరగరాస్తుందేమో అన్నంత డ్రామా ఇందులో ఉంది మరి" అని బండి వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించడంలో విఫలమైన బీఆర్ఎస్, కాంగ్రెస్ బీజేపీపై ఏడుస్తూ నిట్టూరుస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఇక.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన తండ్రికి రాసినట్లుగా ప్రచారం జరుగుతున్న లేఖ కాంగ్రెస్ కుట్రేమోనని బీజేపీ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. ఆ పార్టీనే కవిత పేరుతో లేఖ విడుదల చేసిందేమోనని సందేహం వ్యక్తం చేశారు. ఆ లేఖపై కేసీఆర్, కవిత స్పందిస్తేనే స్పష్టత వస్తుందని అరుణ అన్నారు. అయినా.. తండ్రికి కూతురు లేఖ రాయాల్సిన అవసరం ఏమొచ్చిందని అరుణ ప్రశ్నించారు. "కేసీఆర్‌ను కలిసే పరిస్థితి కూడా కవితకు లేదా? అన్న కేటీఆర్‌తో ఉన్న రాజకీయ వైరంలో ఇది భాగమేనా? కవిత ఉద్దేశపూర్వకంగా లేఖ లీక్ చేశారా? లేక ఎవరిద్వారానైనా లీక్ చేయించారా? లేఖ రాయించినవాళ్లు లీక్ చేశారా? కేసీఆర్ లీక్ చేశారా?" అనే విషయాలు వారు చెబితే తప్ప స్పష్టత రాదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు ప్రసక్తేలేదని ఆమె తేల్చిచెప్పారు. ఇక.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, మరో షర్మిల కాబోతున్నట్లుగా కనిపిస్తోందని బీజేపీ ఎంపీ ఎం. రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు. తనకున్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ పార్టీ మొదటగా కవితతో కొత్త పార్టీ పెట్టిస్తుందని.. ఎన్నికల సమయంలో కవిత, షర్మిల లాగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులవుతారని లేదా ఆమె పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ డ్రామా వెనుక సీఎం రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు. "కవిత లేఖ నేపథ్యం.. కుటుంబ పంచాయతీనా? రాజకీయ వారసత్వ పంచాయితీనా? ఆస్తుల పంచాయతీనా?" అని రఘునందన్ ప్రశ్నించారు.

దేవుడి చుట్టూ దయ్యాలు!

(మొదటిపేజీ తరువాయి)

అనుకుంటున్న విషయాలను మాత్రమే తాను లేఖలో రాశానని చెప్పారు. "నేను కేసీఆర్‌కు లేఖలు రాయడం కొత్తేమీ కాదు. ఆయనకు తరచుగా సమాచారం (ఫీడ్ బ్యాక్) ఇస్తాను. నేను లేఖ ద్వారా వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో ప్రత్యేకత ఏమీ లేదు" అని ఆమె తేల్చిచెప్పారు. కానీ, ఈసారి తాను రాసిన లేఖ బయటికి రావడం బాధాకరమన్నారు. తనకు వ్యక్తిగతంగా ఎవరిపైనా ద్వేషంగానీ ప్రేమగానీ లేవని ఆమె పేర్కొన్నారు. అయితే, తన తండ్రికి తాను అంతర్గతంగా రాసిన లేఖ బహిర్గతమైందంటే.. దాని వెనుక ఎవరున్నారనే విషయాన్ని పార్టీనాయకులు, తెలంగాణ ప్రజలు అందరూ ఆలోచించాలని.. దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని కవిత అభిప్రాయపడ్డారు. "కేసీఆర్ కుమార్తెనైన నేను రాసిన లేఖే బయటికి వచ్చిందంటే.. ఇక సామాన్యుల సంగతేంటి?" అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ వ్యవహారాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో తనపై అంతర్గత కుట్రలు, కుతంత్రాలు జరుగుతున్నాయన్న విషయాన్ని తాను ఇటీవలే బహిరంగంగానే చెప్పానని గుర్తుచేశారు. ఇవే విషయాలను ఆమె జాతీయ మీడియా కోసం ఆంగ్లంలో కూడా చెప్పారు.

కోవర్టులను పక్కకు తప్పిస్తేనే...

కేసీఆరే తమ నాయకుడని.. ఆయన నాయకత్వంలోనే తెలంగాణ బాగుపడతది, ముందుకు పోతదని కవిత వ్యాఖ్యానించారు. పార్టీలో ఉన్న చిన్న చిన్న లోపాలపై అంతర్గతంగా చర్చించుకుంటూ, సవరించుకుని, కోవర్టులను పక్కకు తప్పించుకుంటూ ముందుకుపోతేనే పార్టీ పదికాలాల పాటు చల్లగా ఉంటుందన్నారు. తన లేఖ బయటకు రావడం చూసి.. బీఆర్ఎస్ పార్టీ ఆగమైందన్నట్టుగా బీజేపీ, కాంగ్రెస్ నేతలు సంబరపడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్ ఈ రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని, ఆ రెండు పార్టీలూ తెలంగాణను అన్ని రకాలా విఫలం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు పార్టీ పెడుతున్నారనే ప్రచారం నిజమేనా? మీకు కేసీఆర్ వద్ద యాక్సెస్ లేదా?" అని విలేకరులు అడిగిన ప్రశ్నలకు కవిత సమాధానం దాటవేశారు. కాగా.. 'డాడీ చుట్టూ దయ్యాలున్నాయి' అంటూ ఎయిర్‌పోర్టులో ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. విమానాశ్రయంలో కవితకు స్వాగతం చెప్పేందుకు వచ్చినవారు సైతం 'ఆ దయ్యాలెవరు?' అంటూ చర్చించుకోవడం కనిపించింది. మరోవైపు.. బీఆర్ఎస్‌తో సంబంధం లేకుండా ఆమె వర్గీయులు స్వాగత ఏర్పాట్లు చేయడంపై పార్టీలోనూ విస్తృతంగా చర్చ జరుగుతోంది.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పిడికిలి బిగించి అభిమానులకు అభివాదం చేస్తున్న కవిత



నేడు తండ్రి వద్దకు కవిత ?

- తాను రాసిన లేఖ బహిర్గతం కావడంపై మాట్లాడే అవకాశం
- ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లోనే కేసీఆర్

సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, మే 23 : ఎమ్మెల్సీ కవిత తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ పార్టీలో కలకలం రేపుతుండగా.. కేసీఆర్ నివాసముంటున్న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాత్రం ఎలాంటి అలికిడి కనిపించడం లేదు. మరోపక్క, అమెరికా నుంచి శుక్రవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న కవిత.. ఆ లేఖ తానే రాశానని విమానాశ్రయం వద్ద విలేకరులతో అన్నారు. అయితే, ఆ లేఖ బయటకు ఎలా వచ్చిందో తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో తండ్రి దగ్గర ఉన్న లేఖ బహిరంగం కావడంపై.. ఆమె నేరుగా కేసీఆర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకుంటారని ప్రచారం జరిగింది. ఇందుకోసం విమానాశ్రయం నుంచి ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు నేరుగా వెళతారని తొలుత అంతా భావించారు. కానీ, హైదరాబాద్‌లోని తన నివాసానికే కవిత వెళ్లారు. కానీ, శనివారం ఏదో ఒక సమయంలో ఆమె కేసీఆర్‌ను కలిసే అవకాశముందని సమాచారం. అయితే, బీఆర్ఎస్ పార్టీ కేడర్‌లో కుంపటి రేపుతున్న కవిత లేఖపై కేసీఆర్, ఆ పార్టీకి చెందిన ఇతర సీనియర్ నేతలు మౌనంగా ఉండడం విడ్డూరంగా ఉందనే చర్చ జరుగుతోంది.



శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద కవిత కటౌట్లతో అభిమానులు

లాంజ్‌లో 40 నిమిషాలు

అమెరికా నుంచి తన కుటుంబసభ్యులతో రాత్రి 8:10 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన కవిత దాదాపు 40నిమిషాల పాటు లాంజ్‌లో వేచి ఉన్నారు. ఆ సమయంలో ఆమె స్నాక్స్ తీసుకుని కొన్ని ఫోన్ కాల్స్ మాట్లాడినట్టు సమాచారం. అలాగే.. ఎయిర్‌పోర్టు బయట పెద్ద ఎత్తున వేచి ఉన్న మీడియాతో ఏం మాట్లాడాలనే అంశంపైనా ఆమె కొంత కసరత్తు చేసినట్లు తెలిసింది. మీడియాతో మాట్లాడిన అనంతరం ఆమె ప్రత్యేక కాన్వాయ్‌లో అక్కణ్నుంచీ బయల్దేరి వెళ్లిపోయారు.

జాగృతే.. బీఆర్ఎస్ శ్రేణులు రాలే!

శంషాబాద్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకకు హాజరై అమెరికా నుంచి శుక్రవారం రాత్రి భారత్‌కు తిరిగొచ్చిన ఎమ్మెల్సీ కవితకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 'తెలంగాణ జాగృతి' ఘనస్వాగతం పలికింది. జాగృతి సభ్యులు పెద్ద ఎత్తున ఆమెకు స్వాగతం పలికేందుకు తరలిరావడంతో ఎయిర్‌పోర్టు ప్రాంగణం కిటకిటలాడింది. కవిత, ఆమె భర్త, ఇద్దరు కుమారులకు.. అభిమానులు, జాగృతి నాయకులు, పుష్పగుచ్ఛాలు అందజేసి సాదర స్వాగతం పలికారు. కవిత ఫోటో ఉన్న కటౌట్‌లు పట్టుకుని జాగృతి నేతలు ఎయిర్‌పోర్టు బయట వరుసగా నించున్నారు. బీసీ కులసంఘాల పేరుతో కూడా బ్యానర్లు కనిపించాయి. కవిత ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రాగానే వారంతా.. "కవితక్క జిందాబాద్.. కవితక్క సీఎం.." అంటూ నినాదాలు చేశారు. సామాజిక తెలంగాణ లక్ష్యంగా పనిచేస్తున్న కవితక్కకు స్వాగతమంటూ ఏర్పాటు చేసిన ఆ బ్యానర్లలో ఎక్కడా బీఆర్ఎస్ అనే పదం గానీ, పార్టీ ప్రస్తావనగానీ, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ ఫోటోలుగానీ కనిపించకపోవడం.. అవన్నీ గులాబీ రంగులో కాక నీలిరంగులో ఉండడం, టీమ్ కవితక్క పేరుతో కటౌట్లు ఏర్పాటు చేయడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఇక.. కవితకు స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ విమానాశ్రయానికి రాలేదు. స్థానికంగా జాగృతితో సంబంధం ఉన్న కొందరు నేతలు వచ్చినా గుర్తుపట్టగలిగేవారెవరూ లేరు. వచ్చిన వందలాది మంది అభిమానుల్లో ఒక్కరి వద్ద సైతం బీఆర్ఎస్ జెండా, కండువా లేకపోవడం, వారంతా 'కవితక్క జిందాబాద్' అనడం తప్ప కేసీఆర్, కేటీఆర్, హరీశ్ పేర్లను ప్రస్తావించకపోవడం గమనార్హం. కాగా.. కవితకు స్వాగతం పలకడానికి ఎయిర్‌పోర్టుకు వచ్చిన అభిమానులు పట్టుకున్న కవిత సింగిల్ ఫోటోతో ఉన్న ప్లకార్డులు ప్రత్యేక ఆకర్షణగా కనిపించాయి. సామాజిక తెలంగాణ కోసం కృషి చేస్తున్న కల్వకుంట్ల కవిత అక్కకు స్వాగతం సుస్వాగతం అని వాటిలో ఉంది.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కవితకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

కవిత లేఖ అంతా ఒక డ్రామా!

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌కు కవిత లేఖ అంతా ఒక డ్రామా అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొట్టిపారేశారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర, దక్షిణ తెలంగాణల్లోనూ ఆ పార్టీ డిపాజిట్లు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. దీంతో అంతర్గతంగా వాళ్లే ప్లాన్ చేసుకుని.. కవిత పేరుతో లేఖను విడదల చేసి డ్రామాలు ఆడుతున్నారన్నారు. నేరుగా ఇంటికి వెళ్లి మాట్లాడే అవకాశం ఉన్న కవిత.. లేఖ రాయడమేంటని ప్రశ్నించారు. శుక్రవారం వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, కవిత, కేటీఆర్‌లు కొట్టుకుంటే ఆస్తుల పంపకాల కోసం కొట్టుకుంటారని వ్యాఖ్యానించు.. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీకి చెందిన 41 మంది తెలంగాణ ఎమ్మెల్యేలు పోరాడి సాధించుకున్నామని, మధ్యలోకి కేసీఆర్ వచ్చి దూరాడని వ్యాఖ్యానించారు. మేడిగడ్డకు బాంబు పెట్టి పేలిస్తే పైన పేలుతుంది కానీ.. కింద ఎలా పేలుతుందంటూ కేటీఆర్‌ను కోమటిరెడ్డి ప్రశ్నించారు. ప్రాజెక్టులో బాంబులు పెడితే.. అప్పుడు ప్రభుత్వంలో ఉండి ఏం చేశారని నిలదీశారు.

కేసీఆర్ జవాబివ్వాలి: పొన్నం



కవిత లేఖపై కేసీఆర్ సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నవారికి రజతోత్సవ సభలో మాట్లాడటానికి ఎందుకు అవకాశం ఇవ్వలేదని, బీజేపీపై విమర్శలు ఎందుకు చేయలేదంటూ కవిత అడిగిన ప్రశ్నలకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సమాధానం చెప్పాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ దోస్తీని కాంగ్రెస్ తొలినుంచీ నిలదీస్తోందని, కవిత లేఖతో ఇది తేటతెల్లమైందన్నారు. బీఆర్ఎస్ మునిగే నావ అని, ఎమ్మెల్సీ కవిత అందులోంచి దూకేయాలని చూస్తోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. పదేళ్ల పాపాలను లేఖ ద్వారా బయటపెట్టిందని చెప్పారు.

బీఆర్ఎస్‌లో ముసలం!

గులాబి పార్టీలో కవిత కలకలం.. పార్టీలో లుకలుకలు బహిర్గతం..!.. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలెవరు?

- కవిత లేఖ ఎక్కడికి దారి తీస్తుంది?
- ధిక్కార స్వరాన్ని కేసీఆర్ సహిస్తారా?
- గతంలో అసమ్మతి గళం వినిపించిన నేతలను బయటికి పంపించిన చరిత్ర
- కూతురే ప్రశ్నించడంపై పార్టీలో ఆందోళన
- కవిత కొత్త పార్టీ పెడతారన్న ప్రచారం

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత.. తన తండ్రికి రాసిన లేఖ వ్యవహారం ఆ పార్టీలో చిచ్చురేపుతోంది. గత కొంతకాలంగా పార్టీలో తనపై కుట్ర జరుగుతోందంటున్న కవిత.. తొలిసారి తన లేఖ ద్వారా ఈ విషయాన్ని బయటపెట్టిన తీరు పార్టీ వర్గాలను విస్మయానికి గురి చేసింది. పార్టీ తనకు తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని గత కొంతకాలంగా ఆమె అసంతృప్తితో ఉన్నట్లు గులాబీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు కేసీఆర్ సొంత మీడియాలోనూ ఆమెకు తగినంత ప్రచారం కూడా లభించడం లేదని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. దాంతో సొంతంగా జిల్లా పర్యటనలు పెట్టుకున్నారని అంటున్నారు. కవిత తీరుపై పార్టీ పెద్దలూ కొంత అసంతృప్తితో ఉన్నట్లు గులాబీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. జైలు నుంచి బెయిల్‌పై విడుదలైనప్పుడు ఒక దశలో తెలంగాణ భవన్‌లో ఆమెను మీడియా సమావేశాలు కూడా నిర్వహించవద్దని ఆదేశాలు వెళ్లినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు పార్టీ అధినేతకు రాసిన లేఖను కావాలనే కేసీఆర్ సన్నిహితులే బయటపెట్టారని, ఇదంతా కవితకు, కేసీఆర్ మధ్య మరింత దూరం చేసేందుకే చేశారని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను వివరిస్తూ కేసీఆర్‌కు కవిత రాసినట్లుగా చెబుతున్న లేఖ గురువారం బహిర్గతం కావడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే ఇది నకిలీ లేఖ అని, తమ పార్టీకి దెబ్బతీసేందుకు ప్రత్యర్థులు కుట్ర చేశారనే కోణంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలనే వ్యూహం దిశగా బీఆర్ఎస్ నేతలు ఆలోచించారు. కానీ, లేఖను తానే రాశానంటూ శుక్రవారం కవిత కుండబద్దలు కొట్టడంతో అధినాయకత్వం వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది.

ఎవరా దయ్యాలు?

లేఖ పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పేర్కొన్న సానుకూల అంశాలను ప్రస్తావించకుండా కేసీఆర్ దేవుడని, కానీ.. ఆయన చుట్టూ దయ్యాలున్నాయని కవిత అనడం మరింత కలకలం రేపింది. ఇంతకీ కేసీఆర్ చుట్టూ ఉన్న ఆ దయ్యాలెవరనే చర్చ నడుస్తోంది. వాస్తవానికి కేసీఆర్ కోటరీగా చాలా కొద్ది మందికి మాత్రమే పేరుంది. వారు దయ తలిస్తేనే కేసీఆర్ దర్శనం దక్కుతుందన్న అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో ఉన్నాయి. అధికారం కోల్పోయాక కూడా కొంతమేరకు ఇంకా అదే పరిస్థితి నడుస్తోందన్న ఆరోపణలు న్నాయి. గతంలో ఓ కుటుంబం కేసీఆర్‌ను కలిసేందుకు ప్రయత్నించగా.. వారికి ఆ అవకాశం ఇవ్వకపోవడంతో ఆ కోటరీపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీ సన్నిహితులు చెబుతున్నారు. గొడవ కూడా పడినట్లు వారు గుర్తు చేసుకుంటున్నారు. అందుకే తన ఆక్రోశాన్ని ఆమె లేఖ ద్వారా వెళ్లగక్కారని అంటున్నారు. అలాగే తనకు, తన తండ్రికి మధ్య ఆ కోటరీ కారణంగానే దూరం పెరిగిందన్న భావన ఆమెలో ఉన్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.



ఎలా డీల్ చేస్తారో?

పార్టీలో కవిత దూకుడునే తగ్గించేందుకే ఈ లేఖ వ్యవహారాన్ని బయట పెట్టారన్న వాదనలూ వినిపిస్తున్నాయి. గతంలో పార్టీలో సంక్షోభాలు నెలకొన్న సమయంలో.. ప్రతిపక్షాల పని అనో, తెలంగాణ ద్రోహులు అనో, ఢిల్లీ వాళ్లపని అనో ఇతరులపై నెపం నెట్టి.. ఆ సంక్షోభం నుంచి బయటపడే ప్రయత్నం పార్టీ అధిష్ఠానం చేసేది. తెలంగాణ ఉద్యమంలో తనతోపాటు ఆలె నరేంద్ర కీలకంగా వ్యవహరించినా.. ఆయనతో ఏర్పడ్డ విభేదాలతో ఇతర కారణాలు చూపి 2007 ఏప్రిల్‌లో కేసీఆర్ సస్పెండ్ చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలంటే కేసీఆర్ నాయకత్వం తప్పనిసరి అని భావించిన తెలంగాణవాదులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించలేకపోయారు. ఆ తరువాత తన 'తల్లి తెలంగాణ పార్టీ'ని నాటి టీఆర్ఎస్‌లో విలీనం చేసి కేసీఆర్‌తోపాటు ఎంపీగా గెలిచిన విజయశాంతిని స్వయంగా పార్టీ నుంచి వైదొలిగే పరిస్థితి కల్పించారు. అప్పుడు కూడా.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, బీఆర్ఎస్ అధికారం చేపట్టడంతో కేసీఆర్‌కు ఎవరూ ఎదురు చెప్పలేని పరిస్థితి ఉంది. ఆపై పార్టీలో సీనియర్ నేత అయిన ఈటల రాజేందర్‌కూ ఇదే పరిస్థితి ఎదురైంది. అధినేత నిర్ణయాలను ప్రశ్నించే ధోరణిలో మాట్లాడడంతో ఆయనను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆపై ఈటల ఆస్తులను తెరపైకి తెచ్చి ఆత్మరక్షణలో పడేశారు. దీంతో ఈటల ఎమ్మెల్యే పదవికి కూడా 2021 జూన్‌లో రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అయితే వీరందరి వ్యవహారం ఒక ఎత్తయితే.. ఈసారి సొంతింటి నుంచే ధిక్కార స్వరం వినిపిస్తోంది. దీంతో ఈ అంశాన్ని కేసీఆర్ ఎలా డీల్ చేస్తారోనన్న ప్రశ్నలు పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. కానీ, కవిత లేఖ వ్యవహారం మాత్రం కచ్చితంగా పార్టీకి నష్టం కలిగిస్తుందని గులాబీ వర్గాలంటున్నాయి. ఈ వ్యవహారాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించకోకపోతే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. అయితే పెద్దాయనకు, పిల్లలకు మధ్య సమన్వయకర్తగా కేసీఆర్ సతీమణి శోభ వ్యవహరిస్తుంటారని, ప్రస్తుతం కవిత విషయంలోనూ ఆమె చొరవ తీసుకునే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు అంటున్నాయి.

కవిత లేఖపై నోరెత్తొద్దన్న అధిష్ఠానం..!

బీఆర్ఎస్ అధినేతకు కవిత రాసిన లేఖపై మాత్రం ఆ పార్టీ నుంచి ఎలాంటి స్పందన లేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా.. ఇతర నేతలెవరూ స్పందించలేదు. ఖండించనూ లేదు. కాగా ఈ అంశంపై గులాబీనేతలు ఎవరూ మీడియా ముందుగానీ.. ఇతర చోట్లగానీ నోరెత్త వద్దని అధిష్ఠానం అల్టిమేటం జారీచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిణామాలు ఎంతవరకు దారితీస్తాయో వేచి చూసి.. ఆ తర్వాత అధినేత సూచనమేరకు దీనిపై స్పందించాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు సమాచారం.

ప్రభుత్వ వ్యతిరేకత పెంచామన్న జోష్ కొద్దిరోజులే..

అధికారం కోల్పోయిన తొలినాళ్లలో బీఆర్ఎస్ కొంత ఆత్మరక్షణలో పడిపోయింది. పార్లమెంటు ఎన్నికల్లోనూ ఈ విషయం స్పష్టమైంది. కానీ, ఇటీవలి కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. అధికార పార్టీని టార్గెట్ చేస్తోంది. హామీల అమలు కోసం నిలదీస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెంచడంలో ఒక అడుగు ముందుకు వేసిందనే అభిప్రాయాలు జనంలోనూ ఉన్నాయి. వరంగల్ రజతోత్సవ సభ ద్వారా పార్టీకి ఒక మంచి ఊపు తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ వ్యతిరేకతను బాగా ఎస్టాబ్లిష్ చేశామన్న సంతోషం గులాబీ వర్గాల్లో కనిపించింది. అయితే ఆ సంతోషం కొద్దిరోజులకే కవిత రూపంలో ఆవిరైందని ఓ కీలక నేత వ్యాఖ్యానించారు. సొంతింటి వ్యవహారాన్నే చక్కదిద్దుకోలేని పరిస్థితులు ఏర్పడితే ప్రజల్లో చులకన భావం ఏర్పడుతుందని ఆ నేత ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్త పార్టీ యోచనలో కవిత?

పార్టీలోని తాజా రాజకీయ పరిణామాలు.. ఎటు దారితీస్తాయి? పార్టీలో చీలికలు ఏర్పడతాయా? అన్న కోణంలో కూడా బీఆర్ఎస్ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. పార్టీలో నెలకొన్న సమస్యలను అధినేత దృష్టికి తీసుకువెళ్లానని, ఇందులో తనకు ఎటువంటి వ్యక్తిగత ఎజెండా లేదని కవిత ప్రకటించినప్పటికీ.. త్వరలోనే ఆమె కొత్త పార్టీ పెట్టనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే మొన్నటివరకు కవితతో సన్నిహితంగా ఉన్న గులాబీ పార్టీ నేతల్లో ఎంతమంది ఆమె వైపు నిలుస్తారు? అసలు ఆమె పార్టీ పెడతారా? లేదంటే పార్టీలోని అంతర్గత సమస్యలను మాత్రమే కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లారా? అన్నదానిపై పార్టీ శ్రేణుల్లో చర్చ కొనసాగుతోంది. గతంలో నరేంద్ర, విజయశాంతి, ఈటల రాజేందర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి లాంటివారు బీఆర్ఎస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరినట్లుగా కవిత కూడా మరో పార్టీలో చేరతారా? అన్నదానిపైనా చర్చ జరుగుతోంది. వాస్తవానికి కవిత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్లుగానే.. మేడే సందర్భంగా తన నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సామాజిక తెలంగాణను సాధించలేకపోయామని, పదేళ్లు అధికారంలో ఉన్నా.. భూమిలేని పేదలకు ఏమీ చేయలేకపోయామని అనడం చర్చకు దారితీసింది. మరోసారి మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడుతూ తనపై కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని.. సమయం వచ్చినపుడు అన్నీ బయటకు వస్తాయన్నారు. ఆర్నెళ్లు జైల్లో ఉన్నది సరిపోదా? ఇంకా కష్టపెడతారా? అంటూ ఆమె బాధపడ్డారు. తనను రెచ్చగొడితే ఇంకా గట్టిగా స్పందిస్తానని ఆ సందర్భంలో కవిత హెచ్చరించారు.

సింగరేణి కార్మికులు, కుటుంబ సభ్యులకు విద్యావకాశాలు

- వారిని పట్టభద్రులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- సింగరేణి సీఎండీ, అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ వెల్లడి
- త్వరలో సమగ్ర ప్రణాళిక రూపకల్పన

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు, వారి కుటుంబసభ్యులు, సమీప గ్రామాలకు చెందిన అందరికీ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్యావకాశాలు అందించి పట్టభద్రులుగా తీర్చిదిద్దేందుకు బృహత్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క సూచనలతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు సింగరేణి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్సిటీ నిర్వహణలో విద్యా బోధనకున్న అవకాశాలపై శుక్రవారం సైఫాబాద్‌లోని సింగరేణి భవన్‌లో చర్చించారు. త్వరలో సమగ్ర ప్రణాళిక రూపొందించి అంబేడ్కర్ వర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రొ.ఘంటా చక్రపాణి మాట్లాడుతూ సింగరేణి అనేక కార్మిక సంక్షేమ కార్యక్రమాలతో మంచి పేరు సంపాదించిందని.. కార్మికులు, సమీప గ్రామాల ప్రజల విద్యాభివృద్ధికి తోడ్పడితే అది అన్నిటికన్నా పెద్ద సంక్షేమ కార్యక్రమవుతుందన్నారు. సింగరేణివ్యాప్తంగా బోధనకు అనుకూల భవనాలను కేటాయిస్తే వర్సిటీ ద్వారా స్టడీ సెంటర్ల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సింగరేణివ్యాప్తంగా అందరినీ గ్రాడ్యుయేట్లుగా మార్చడమే లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. ప్రాజెక్టు ప్రభావిత, నిర్వాసిత ప్రజలకు ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీలు, పీజీ కోర్సులు చదివేందుకు సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆర్థిక సాయం అందించవచ్చని తెలిపారు. సింగరేణి సీఎండీ బలరామ్ మాట్లాడుతూ కార్మికుల్లో ఎక్కువ మంది హైస్కూల్, ఇంటర్ వరకే చదివారని, అలాంటి వారికి అంబేడ్కర్ వర్సిటీ ద్వారా పై చదువులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశం సంస్థకు ఉందన్నారు. కార్యక్రమంలో ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. విజయ కృష్ణారెడ్డి, డైరెక్టర్ (అకడమిక్) ప్రొ.పుష్ప ఘంటా చక్రపాణి, డైరెక్టర్(యూజీసీ-డీఈబీ ఎఫైర్స్) ప్రొ.పల్లవి కబ్డే, సింగరేణి ఈడీ కోల్ మూమెంట్ ఎస్‌డీఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.


ఈ నెల 27 వరకు భారీ వర్షాలే!



హైదరాబాద్, మే23(ఆంధ్రజ్యోతి): రాబోయే రెండ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళ భూభాగంలోకి ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తూర్పు మధ్య ఆరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం రాగల 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే ఈనెల 27 నాటికి పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. మరోపక్క, తెలంగాణలో ఈనెల 27 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఇందుకు సంబంధించి వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇక, గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు ఆదిలాబాద్ జిల్లా నర్నూర్‌లో అత్యధికంగా 12.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా 12 మండలాల్లో భారీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. జగిత్యాల జిల్లా మేడిపల్లిలో 9.1 సెంటీమీటర్లు, నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో 8.8, జగిత్యాలలో 8.7, ములుగు జిల్లా కన్నాయిగూడేంలో 8.3, జగిత్యాల రూరల్‌లో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ పేర్కొంది.

తెలంగాణలో మళ్లీ కరోనా కలకలం

హైదరాబాద్‌కు చెందిన పల్మనాలజిస్టుకు కొవిడ్ పాజిటివ్.. అప్రమత్తమైన వైద్య, ఆరోగ్య శాఖ



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, హైదర్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని వణికించిన కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తోందనే వార్తల నేపథ్యంలో తెలంగాణలో కొవిడ్ కలకలం రేగింది. రాష్ట్రంలో తొలి కొవిడ్ కేసు నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన పల్మనాలజిస్టు(శ్వాసకోశ వ్యాధుల వైద్యుడు)కి కరోనా పాజిటివ్ అని తేలింది. దీంతో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో శ్వాసకోశ నిపుణుడైన ఓ వైద్యుడు ఆదివారం నుంచి జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో ఆయన బుధవారం ఆర్‌టీపీసీఆర్ పరీక్ష చేయించుకోగా.. గురువారం కొవిడ్ పాజిటివ్ అని నివేదిక వచ్చింది. సదరు వైద్యుడు ఇటీవల కాలంలో విదేశాలకు వెళ్లివచ్చింది లేదు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులకు వైద్యం చేయడం ద్వారా ఆయన కరోనా బారిన పడి ఉంటారని అనుమానిస్తున్నారు. సదరు వైద్యుడిలో శుక్రవారానికి కొవిడ్ లక్షణాలు కొంతమేర తగ్గుముఖం పట్టినట్లు తెలిసింది. కాగా, కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన వైద్యుడు కరోనా పాజిటివ్‌గా తేలిన విషయాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఉమా గౌరి ధ్రువీకరించారు. బాధిత వైద్యుడు ఐదు రోజులు ఐసోలేషన్ పాటించారని, పూర్తిగా కోలుకున్నారని ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యుడి కుటుంబసభ్యులు, సన్నిహితుల్లో కరోనా లక్షణాలు కనిపించలేదని పేర్కొన్నారు. కాగా, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కరోనా లక్షణాలతో బాధపడుతున్న వారు తమకు సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులను, ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక బృందాలు, వార్డులు..

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు నమోదవుతుండడం, రాష్ట్రంలోనూ తొలి కేసు నమోదవ్వడంతో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. నేడో, రేపో ప్రజలకు కొవిడ్ అడ్వైజరీ జారీ చేసే అవకాశముంది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొవిడ్ పరీక్షలు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. గాంధీ, ఫీవర్, ఉస్మానియా ఆస్పత్రుల్లో ఇప్పటికే రాపిడ్, ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ వెంకటి తెలిపారు. కొవిడ్ బాధితుల కోసం గాంధీ ఆస్పత్రిలో ఇప్పటికే ఉన్న 30 పడకల వార్డును తిరిగి సిద్ధం చేస్తున్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో కూడా కొవిడ్ వార్డును సిద్ధం చేస్తున్నారు. వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఫీవర్, చెస్ట్, నిలోఫర్, కింగ్ కోఠి ఆస్పత్రుల్లోనూ ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయనున్నారు. నిజానికి, హైదరాబాద్‌లో అడపాదడపా కొవిడ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. శస్త్రచికిత్సలు, ఇతర జబ్బులకు వైద్యం చేసే ముందు ప్రైవేటు ఆస్పత్రుల్లో కొవిడ్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో కొందరికి కొవిడ్ పాజిటివ్ అని వస్తుంది. ఐదు రోజుల క్రితం ఆర్థోపెడిక్ సమస్యతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చిన రోగికి కొవిడ్ పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చినట్టు సమాచారం.


తెలంగాణ జీవనశైలిలోనే సౌందర్యం!

(మొదటిపేజీ తరువాయి)

పలు దేశాల అందగత్తెలు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రాభవాన్ని ప్రశంసించారు. శుక్రవారం హోటల్ ట్రైడెంట్‌లో నిర్వహించిన 'హెడ్ టు హెడ్ చాలెంజ్' ఫైనల్ జరిగింది. యూరప్, ఆఫ్రికా, ఆసియా-ఓషియానా, అమెరికా-కరేబియన్‌ల నుంచి ఐదుగురు చొప్పున పాల్గొన్న పోటీదారులు సామాజిక కోణంపై తమదైన శైలిలో జడ్జిలకు సమాధానాలు ఇచ్చారు. ఇందులో మిస్ వేల్స్, మిస్ టర్కీ, మిస్ ట్రినిడాడ్ టొబాగో, మిస్ జాంబియా విజేతలుగా నిలిచారు. ఈ పోటీకి ఎంపికైన 20 మందిలో మిస్ ఇండియా నందితా గుప్తా పేరు లేదు.

అద్భుత సమాధానాలు..

తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి, మహిళల సాధికారత, భద్రతకు సంబంధించి న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు అందగత్తెలు ఉత్సాహంగా చేసిన వ్యాఖ్యలు ప్రపంచం దృష్టిని ఆకర్షించాయి. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రం మహిళల భద్రతను హక్కుగా గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటుందన్న విషయాన్ని పలువురు స్పష్టం చేశారు. భద్రత అనేది ఒక హక్కు, దాన్ని అందించడంలో తెలంగాణ ముందు వరుసలో ఉందని చెప్పారు. పోలీస్ కమాండ్, కంట్రోల్ సెంటర్‌ను సందర్శించామని.. అక్కడ షీ టీమ్స్, హాక్ ఐ, నిరంతర పర్యవేక్షణ వంటి సాంకేతిక భద్రతా వ్యవస్థలను పరిశీలించి మహిళల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు విశేషంగా ఆకర్షించాయని తెలిపారు. తెలంగాణను ప్రపంచానికి ఎలా పరిచయం చేస్తారని అడిగిన ప్రశ్నలకు అద్భుతంగా సమాధానాలు ఇచ్చారు. తెలంగాణ సాంకేతికత, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందడమే కాకుండా మహిళల



హక్కులు, విద్య, సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యమిచ్చే రాష్ట్రమని పలువురు సుందరాంగులు చెప్పారు. ఇది ప్రపంచానికి శక్తివంతమైన సందేశాన్ని అందిస్తుందన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మీయత, ఆదరణ, ఆతిథ్యం ప్రత్యేకంగా నిలిచాయని పేర్కొన్నారు. రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు.

- తెలంగాణలో మహిళల భద్రత- సాధికారతపై ప్రపంచానికి ఏ సందేశాన్ని ఇస్తారు? అని బ్రెజిల్, సురినామ్, కేమెన్ ఐలాండ్స్, గయానా, ట్రినిడాడ్ టొబాగో నుంచి వచ్చిన పోటీదారులను న్యాయనిర్ణేతలు ప్రశ్నించారు. మిస్ గయానా స్పందిస్తూ.. 'మహిళలు ఎక్కడికైనా వెళ్లగలరు. భద్రత అనేది హక్కు' అని చెప్పారు. మహిళలు స్వేచ్ఛగా బతకడానికి అనువైన ప్రదేశం తెలంగాణ అని, రాష్ట్రంలో మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. కాంటినెంట్ తుది రౌండ్ విజేతగా నిలిచిన మిస్ ట్రినిడాడ్ టొబాగో మాట్లాడుతూ.. 'ప్రగతి, సాధికారత ఒకటే. భారతదేశం, తెలంగాణలో ప్రధానంగా హైదరాబాద్‌లో ఆ దిశగా చేపడుతున్న చర్యలు అభినందనీయం. సగం జనాభా వెనకబడి ఉంటే విజయం సాధించలేమని మహిళలను ముందుకు నడిపిస్తున్న తెలంగాణకు ధన్యవాదాలు' అని చెప్పారు.
- సవాళ్లు ఎదుగుదలకు అవకాశాలుగా ఎలా మారాయి? సోషల్ మీడియా పాత్రపై న్యాయనిర్ణేతలు సంధించిన ప్రశ్నలకు మిస్ నమీబియా స్పందిస్తూ.. కుంగుబాటుతనంతో తన వ్యక్తిగత పోరాటం గురించి చెప్పారు. ఎవరికి వారు తనను తాను తెలుసుకొని, బలాన్ని గుర్తించి ముందుకు సాగాలని చెప్పారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ విజేతగా నిలిచిన మిస్ జాంబియా.. క్లినికల్ మెడిసిన్ పూర్తి చేసి స్కాలర్‌షిప్‌ను పొందిన విషయాన్ని ప్రస్తావిస్తూ స్ఫూర్తిదాయక వ్యాఖ్యానం చేశారు. "ప్రపంచం మారవచ్చు. కానీ, మీరు మారాల్సిన అవసరం లేదు. మీరు మీలాగే ఉండాలి" అన్నారు. విద్య ద్వారా యువతను శక్తిమంతం చేసే అంశాలపై అడిగిన ప్రశ్నలకు.. స్పెయిన్, వేల్స్, ఫ్రాన్స్, జర్మనీ, ఐర్లాండ్ ప్రతినిధులు సమాధానం చెప్పారు. మిస్ ఐర్లాండ్ గృహ హింసకు వ్యతిరేకంగా బలమైన రక్షణకు మద్దతు ఇచ్చారు. మిస్ వేల్స్ ఆరోగ్య సంరక్షణ, విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. తన కుటుంబంలో విశ్వవిద్యాలయానికి వెళ్లిన మొదటి వ్యక్తి తానేనని పేర్కొన్నారు. ఉగాండా, భారతదేశంలో వైద్య సేవలను వివరిస్తూ.. యాసిడ్ దాడి బాధితుల గాథలు తన లక్ష్యానికి ఎలా స్ఫూర్తినిచ్చాయో తెలిపారు. సాంస్కృతిక గుర్తింపు, వ్యక్తిత్వ సౌందర్యంపై అడిగిన ప్రశ్నలకు శ్రీలంక, థాయిలాండ్, టర్కీ, లెబనాన్, జపాన్ ప్రతినిధులు సమాధానాలు ఇచ్చారు. మిస్ టర్కీ స్పందిస్తూ.. నేటి ప్రపంచంలో సాంస్కృతిక వారసత్వం అత్యంత ముఖ్యమైందన్నారు. కాన్సులేట్లు, రాయబార కార్యాలయాలు నిర్వహించే అంతర్జాతీయ కార్యక్రమాలతో సంగీతం, కళలు, వంటకాలు, సంప్రదాయాల ద్వారా మనం సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడడమేగాక ఐక్యతను పెంపొందించుకోగలమని చెప్పారు.

తెలంగాణను ఎలా ప్రోత్సహిస్తారు?

భారతదేశంలోని తెలంగాణను సంస్కృతి, వారసత్వం, ఆవిష్కరణల పరంగా ప్రపంచానికి ఎలా ప్రోత్సహిస్తారు? అనే ప్రశ్నకు.. టర్కీ, వేల్స్ జాంబియా, ట్రినిడాడ్ టొబాగో ఖండాల విజేతలు ఆసక్తికరమైన సమాదానాలు చెప్పారు. మిస్ టర్కీ తెలంగాణను సాంకేతిక, వైద్య ఆవిష్కరణల కేంద్రంగా పేర్కొన్నారు. ప్రగతిశీల, శక్తివంతమైన రాష్ట్రమని.. సాధికారత, ఆవిష్కరణ, లింగ సమానత్వంపై ప్రపంచానికి బలమైన సందేశాన్ని ఇస్తోందని తెలిపారు. మిస్ వేల్స్ స్పందిస్తూ.. తెలంగాణ గొప్ప సంస్కృతిని ప్రత్యక్షంగా ఆస్వాదించేందుకు నా దేశాన్ని ఆహ్వానిస్తానన్నారు. మిస్ జాంబియా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కళలు, సంస్కృతి సంపూర్ణమని అన్నారు. వారి ప్రామాణికతను ప్రతిబింబించే అనేక బహుమతులు తనకు లభించినట్లు చెప్పారు. మిస్ ట్రినిడాడ్ టొబాగో మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలకు దయ, కరుణ ఎక్కువని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.